జొన్నలగడ్డ లలితాదేవి

# ఆనంద భువనం



జొన్నలగడ్డ లలితాదేవి నవలలు:-

ఆనంద భవనం
కళ్యాణ మందిరం
పెళ్ళిచేసి చూడు
ఇనస్పెక్టర్‌గారి అమ్మాయి
కాంతం కథ
భలే బ్రహ్మచారి

# ఆనంద భవనం

అది ఆనంద భవనం క్రింది అంతస్తు. ఆనంద భవనం అంటే మూడంతస్తుల దివ్యభవనమన్న మాట. ఆ భవనం విశాలమైన ఆవరణలో తోటమధ్య ఉంది. ఆ తోట వైశాల్యమే యించుమించు ఎకరం వుంటుంది. ఆ ఎకరం మేరలోనూ కొన్ని వరుసలుగా పెరేడ్‌కు వచ్చిన ఒక సైనికదళంలా నిలబడివున్న పూల మొక్కలు కనిపిస్తాయి. తెలుపు-ఎరుపు, పసుపు రంగు గులాబీలు, మల్లెలు, మొల్లలు జాజులు-సంపెంగల మొక్కలనుంచి గాలితో పాటుకిటికీ దగ్గర నిలబడివున్న రాజా వీర వెంకట సత్యనారాయణరావు జమీందారుగారి నాసికాపుటాలకు సోకే సురభిళ సుమ సుగంధం ఇంతింతకాదు. ఆ మొక్కల వెనుక బారులు తీర్చి నట్లు నిమ్మచెట్లు, దానిమ్మ చెట్లు, సపోటా మొక్కలు, జామ చెట్లు రకరకాల పళ్లుకాసే అరటిచెట్లు. వాటి వెనుక వూర గాయలకు పనికివచ్చే మామిడి చెట్లు, బంగినపల్లి, బందరు

బొండాం, చెరుకురసాలు చిన్నవి పెద్దవి కాసే చెట్లున్నాయి. వాటి వెనుక వంగమొక్కలు, బెండ, పొట్ల, బీర, ఆనప, గుమ్మడి పాదులు అవి ప్రాకడానికి ప్రత్యేకంగా పందిళ్లు కట్టబడ్డాయి. ఈ తోట మొక్కల వృక్షాల సంరక్షణకు నియమించబడిన మాలి సుందరం. సుందరానికి ఆ తోట అంటే పంచప్రాణాలు. అదే అతని జీవితం. ఉదయం నించి ఆ మొక్కల మధ్యనే తిరుగుతూ వుంటాడు. వాటితో మాట్లాడుతూ వుంటాడు. సరిగా కాయలు కాయక పోయినా అనుకున్నట్లు పూలు పూయకపోయినా పూలచెట్లను-చెట్లను మృదువుగా మందలిస్తూ వుంటాడు.

ఇవన్నీ ఒకకంట గమనిస్తూ వుంటాడు, ఆనందభవనం యజమాని రాజా వీర వెంకట సత్యనారాయణరావు జమీందారు. జమీందారులను-ఎస్టేట్లను ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న తర్వాత కూడా పేరుకు ముందున్న రాజా, చివర తోకలావున్న జమీందారు- మాయంకాలేదు. ఆయనకు ఆ తోటవల్ల సాలుకు పదివేలకుపైగా రాబడి వుంటుంది. తోటమీద రాబడికి ఓ పద్దు, లెక్కలు అనేవి లేవు కనక వాటికి రాజాగారు, ఇన్‌కంటాక్సు చెల్లించరు. బిల్డింగ్‌లో ఆయన నౌకర్లువుంటారు. అది మాత్రం అద్దెకు ఇవ్వరు. ఆయన చెల్లెలు శ్రీమతి పుష్పావతీదేవి, ఆమెకు సాహిత్యం అంటే వున్న మక్కువ కావాలని చేసుకున్న



రెండో పెళ్ళి భర్తమీద కూడా లేదు. మార్కెట్‌లోకి వచ్చే ప్రతి నవలా కొంటుంది. వాటికి అయ్యే ఖర్చంతా అన్నయ్య వెంకటసత్యనారాయణరావుదే; నవలలేకాక ప్రతి పత్రికా కొంటుంది. గేయాలు గణయతి ప్రాసలు కాకుండా దస్తాలకొద్దీ రాస్తుంది. పత్రికలవారు రిజెక్టుచేస్తే ఆ పత్రికలను తిట్టిపోస్తుంది.

పడితే మటుకు మహానదిలా పొంగి, అసలే స్థూలకాయురాలేమో మరి మూడింతలు ఉబ్బుతుంది. ఏమైతేనేం ఆమె వయస్సు నలభయ్యవపడిలో పడబోతున్నా అందంగానే ఉంటుంది.

అన్న రాజా వీరవెంకటసత్యనారాయణరావు జమీందారు చూపులకి ఎంత అసహ్యంగా వుంటాడో. ఆమె అంత అందంగా, అందాన్ని మించిన ఆకర్షణీయంగా వుంటుందని చిన్నప్పుడు అంతా అనేవారు.

రాజాగారి వయస్సు యాభై అయిదేళ్ళయినా ధృఢంగా వున్నాడు. ఆయనకు ఇల్లు కదిలి వెళ్ళడం అంటే అయిష్టం. ఎంతసేపు-తోట-పూలమొక్కలు పళ్ళచెట్లు చూసుకుంటూ మురిసిపోతూ వుండటమే ఆయన పని. ఆయన భార్య పోయినదగ్గరనించీ చెల్లెలు పుష్పావతిమాటే ఆ యింట్లో శివాజ్ఞగా చెల్లుబడి అవుతోంది.

ఆమె తర్వాత, అంత పవర్‌ఫుల్ వ్యక్తి, ఆ యింట్లో సుగ్రీవాజ్ఞగా మాట చెల్లుబడి అయ్యేది నిత్యం-పగలు, రాత్రి, నిద్రపోయేటప్పుడుకూడా పచ్చని అద్దాల చలవ జోడు ధరించే కార్యదర్శి శర్మది. అందరూ శర్మగా రనడమేగాని. ఆయన ఇంటిపేరు తెలిసినవారెవరూ ఆ సువిశాల భవనంలో లేరు. రాజా వీరవెంకటసత్యనారాయణరావు గారు ఆ యింట్లో పెత్తనం-పొలాల ఆజమాయిషీ-తోటలపై అధికారం రాబడి-వ్యయాలు-కార్యక్రమాలు అన్నీ చూసే విషయాలన్నీ శర్మకే అప్పగించాడు.

పోతే రాజాగారి చెల్లెలు శ్రీమతి పుష్పావతికూడా మాటిమాటికీ ఏ పని చేసినా, ఏ కార్యకలాపాలు తలపెట్టినా ముందుగా మందహాసంతో పలకరించి శర్మను కూడగట్టుకుంటుంది.

ఆమెకు భర్తపట్ల తగని అనురాగం. ఆయన పేరు రామకృష్ణప్రసాద్. ఆయనకీ అంతే; అయితే ఆ ప్రేమ యింతవరకూ వెళ్ళిందంటే ఆమె ఎంత చెబితే అంత. నిలబడు అంటే నిలబడిపోతాడు. కూర్చోండి అంటే కూర్చుంటాడు. వేళదాటిపోయింది అన్నం తినరేం-అంటే తపీమని వెళ్లి కంచం ముందు కూర్చోవాలి. అంతవరకూ ఆమెదే పెత్తనం.

ఆయనకి పెళ్లాంమీదవున్న ప్రేమకొద్దీ తన లక్షలు



మూలిగే బ్యాంకి ఎకౌంట్‌ని జాయింట్ ఎకౌంట్‌గా మార్చేశాడు పుష్పావతినికూడా కలుపుకొని. ఆయనకి మొదటి భార్యవల్లకలిగినది ఒకే ఒక ఆడపిల్ల రత్నప్రభ. రత్నప్రభ అంటే ఒకప్పుడు పుష్పావతికి గిట్టేనా. ఇప్పుడు సరిపడదు. కారణం ఏమిటంటే తాను కుదిర్చిన రోళ్ళ ప్రసాద్‌ని కాదని పూటకు ఠికానాలేని మల్లేశ్వరరావుని పెళ్ళి చేసుకోవడమే.

ఇంతకీ కిటికీ దగ్గర నిలబడి రాజా వీరవెంకటసత్యనారాయణరావు జమీందారుగారు ఆ రోజున. అంటే డిసెంబరు 12 శుక్రవారం నాటి ఉదయం ఎందుకో విచారంగా వున్నారు.

అందాలు-సుగంధాలు చిందే తోట సొగసును చూడలేకపోతున్నారు. మొక్కలకు నీళ్లుపోసే తోటమాలి సుందరం ఆయనికి 10 అడుగుల దూరంలోనేవున్నా కనిపించటం లేదు. అంతా మసక మసకగా వుంది.

ఈ సంక్షోభానికంతటికీ కారణం ఏదో వుండంటారా? ఉండకుండా ఎలా వుంటుంది! ఆయనకు చచ్చేటంత చత్వా ం, మందమతి. కళ్ళజోడు ఎక్కడ పెట్టాడో గుర్తులేదు. గని ఓరాకు పడిపోతున్నాడు పరాకుగా వుంటున్నాడు. ఆ రాకు తగ్గటానికి సిజర్స్ సిగరెట్లు అదే పనిగా కాలుస్తు

న్నాడు. నౌకర్లను నలుగుర్ని పురమాయించాడు కళ్ళజోడు వెతకమని.

అందులో ముగ్గురు ఆయనకంటే అధ్వాన్నం చూపు గలవారు. ముగ్గురు వరుసగా వచ్చి ఎక్కడా కనిపించ లేదని చెప్పి వెళ్ళడంతో మరింత కంగారు పడిపోయాడు జమీందారు. ఇంక నాలుగవ నౌకరన్నా శుభవార్త తెస్తాడేమోనని ఆశగా ఎదురు చూడసాగాడు.

మరి కాసేపటికి అతనూవచ్చి కళ్ళజోడు కనిపించనే లేదనేసరికి వీరభద్రావతారం దాల్చాడు వీరవెంకటసత్యనారాయణ. నౌకర్లందరి మీద ప్రళయకాలరుద్రుడిలా మండిపడిపోయాడు.

ఇంతలో ఆయన చిన్న కొడుకు లక్ష్మీకాంతరావు వచ్చాడు. ఏదో చెప్పాలని వచ్చి తండ్రి నరసింహావతారం చూసి కారణం తెలుసుకోవాలని "ఏం నాన్నా కళ్ళజోడు కనిపించలేదా?" అని అడిగాడు.

"లేదురా! దానికోసమే ఇందాకటినించి నలుగురు వెతుకుతున్నారు"

"మరి మీకు అది ఎక్కడ పెట్టారో గుర్తురాలేదా?"

రాజాగారు అసలే చిరాకుగా వున్నాడేమో కొడుకు క్రాస్ ఎగ్జామిన్ ప్రారంభించేసరికి మరింత ఒళ్ళు మండింది అన్నీ చొప్పదంటు ప్రశ్నల్లా తోచాయి.



"ఒరేయ్! కాంతం! ముందు నువ్వు షటప్. ఆ తర్వాత గెటవుట్." అన్నాడు రంకెలు వేస్తూ.

తండ్రి మాటకు ఎదురు చెప్పినా మరో క్వశ్చిన్ వేసినా రెచ్చగొట్టినా కోతిలా మరింతగా గంతులు వేస్తాడని గ్రహించిన కాంతారావు ఏదో చెప్పాలనుకున్నది చెప్పకుండానే చల్లగా జారుకున్నాడు.

## 2

భార్యతో అర్జంటుగా మాట్లాడాలని పూనమల్లి వచ్చి
ఆనందభవన్‌లో బైఠాయించిన రామకృష్ణప్రసాద్ భార్యనడిగి అయిదురూపాయలనోటు తీసుకొని నౌకరు రత్తయ్యకిచ్చి గోల్డ్‌ఫ్లేక్ సిగరెట్ ప్యాకెట్ తెప్పించుకుని కాలుస్తూ తన గది ముందునుంచే వెడుతున్న భార్యనుచూసి దగ్గాడు. ముందుకు వడివడిగా పోతున్న యజమాని వెనుక వస్తున్న పెంపుడు కుక్క మొరగడంవిని ఆగిపోయినట్లే అన్నగారి గదివైపు విసవిసా నడిచిపోతున్న పుష్పావతి ఆగింది. వెనక్కి తిరిగి భర్తవైపు చూసి "పిలిచారా!" అంది "ఊ" అన్నాడు రామకృష్ణప్రసాద్.

ఆమె తన భర్త దగ్గరకివచ్చి "ఏమిటి విశేషం?

ఎందుకు పిలిచారు?" అంది ఆప్యాయంగా మందస్మిత వదనారవిందంతో.

రామకృష్ణప్రసాద్ తలగోక్కుంటూ "అమ్మాయి రత్నప్రభ మాటేనే;" అన్నాడు మెల్లగా.

"ఎవరూ రత్నప్రభ! ఏం కావాలంటుందేమిటి?

భర్త మల్లేశ్వరరావుకి ఎక్కడా ఉద్యోగం దొరకలేదట. ఏదో వ్యాపారం పెట్టుకుంటాడట. లేదా పొలంకొని స్వంత వ్యవసాయం చేస్తాడట. పదివేల రూపాయలు అప్పుగా పంపమంది. ఏడాదికి రెండువేలు తీరుస్తుందట. ఎంతో ప్రాధేయపడుతూ ఉత్తరం రాసింది."

"ఉత్తరాలు రాసినా సరే, టెలిగ్రాములిచ్చినా సరే ఏడ్చి రాగాలు పెట్టి క్రిందపడి దొర్లినా సరే! పైసా కూడా యివ్వడానికి వీల్లేదు. లక్షాధికారిని చేజేతుల వదులుకొని బిక్షాధికారిని వలచి వరించిన మీ కుమార్తె రత్నప్రభ తగిన శిక్ష అనుభవించాల్సిందే! మన జాయింట్ బ్యాంక్ అకౌంటునుంచి పదివేలు తీసుకుని కూతురికి పంపుదామనుకున్నారేమో, ఆ పప్పులేమీ వుడకవు. తెలిసిందా! ఇక ఆమె ప్రసక్తి నా దగ్గర తీసుకురాకండి" అంది ధాటీగా

అలా అంటూ వుండగా అంతవరకూ ప్రేమామృతాన్ని చిలికే ఆమె కళ్ళల్లో క్రోధాగ్ని విస్ఫులింగాలు జ్వలించాయి.



అది చూడగా అసలే కూతురు కోరిక ఎలా తీర్చనా అని బెంగపెట్టుకున్న ఆమె భర్త రామకృష్ణప్రసాద్ మరింత నీరసించి క్రుంగిపోయాడు.

పలుగురు నౌకర్లు కళ్ళజోడు వెతికి వెతికి వేసారి లేదు పొమ్మన్నాక చిందులూ శివాలూ తొక్కుతున్న రాజా వీర వెంకటసత్యనారాయణరావు కార్యదర్శి శర్మను చూడగానే "శర్మా!" అన్నాడు గట్టిగానే.

"ఏం బాబూ!"

"నా కళ్ళజోడు చూశారా!"

మీ కళ్ళజోడు మీ కోటు జేబునించి వేలాడుతూనే వుంది గదండీ!

రాజాసాబ్ కుడిజేబు తడుముకుని కళ్ళజోడు తీసుకుని "మైగాడ్" ఉయ్యాలలో పిల్లాడిని పెట్టుకొని ఫూరంతా వెదికిన ఇల్లాలిలా అన్నీ వెతికానే!" అన్నాడు నవ్వుతూ. అంతవరకూవున్న ఆగ్రహమంతా చల్లారిపోగా.

ఆ కళ్ళజోడు పెట్టుకునే సరికి సర్వప్రపంచమూ కంటి ఎదుట పొడగట్టింది. ఆనందోత్సాహాలతో రాజాగారి కళ్ళు మిలమిలా మెరిశాయి.

"అమ్మయ్య! తోటలో మాలి సుందరం ఏం చేస్తున్నాడో చూసి వస్తాను" అని పరుగులు వేస్తూ వెళ్ళబోతుంటే శర్మ అడ్డుకున్నాడు.

బాబుగారూ! కారు సరిగ్గా 12-15కి గుమ్మంలో వుంటుంది" అన్నాడు.

"ఎవరి కారు?"

"మీ కారే."

"ఎందుకు?"

"మీరు మద్రాసు వెళ్ళి ప్లేయర్స్ క్లబ్‌లో మహాకవి మార్తాండ శాస్త్రిగారిని కలుసుకొని ఆయనతో కలిసి భోజనం చేసి మన యింట్లో అతిథిగా రెండు వారాలపాటు వుండమని ఆహ్వానించారు గదా" అన్నాడు.

"ఎవరీ మార్తాండుడు! నేనెప్పుడూ అతగాడి పేరైనా వినలేదే! ఏ ప్రాంతంవాడు? ఎవరు ఆహ్వానించారు?"

"మీ చెల్లెలు. పుష్పావతీ దేవిగారు ఆహ్వానించారు." అన్నాడు శర్మ.

ఇప్పటికి నెల రోజులనుంచీ కుమారి మహాదేవి బైఠాయించి, మేడమీద ఖాళీగావున్న గదులకు గొంతెత్తి తన కవితాగానం వినిపిస్తుంటే రాత్రిళ్లు నిద్రపట్టక చస్తున్నాను. ఇప్పుడీ మార్తాండ శాస్త్రి ఒకడా ఖర్మ. ఏం కవులు! చూడగా మా చెల్లెలికి పూర్తిగా మతి పోయినట్టుంది."

కుమారి మహాదేవిగారి పేరు కన్నడ సాహిత్యలోకానికి చిరపరిచితం. మీ చెల్లిగారు ఆ మధ్య బెంగుళూరు వెళ్లినప్పుడు కలుసుకున్నారట, ఆమె స్వయంగా ఆహ్వా



నించిన మీదటనే మహాదేవిగారు వచ్చారు. ఆమె తెలుగు-తమిళ-మలయాళ భాషలలో కూడా కవితలు వ్రాస్తారు కదండీ!"

"ఏమో! నేను చూశానా! చదివి ఏడ్చానా! ఇంతకీ ఈ మహాదేవి ఎక్కడినించి వచ్చిందన్నావు?"

"బెంగుళూరు నుంచి."

"సరేలే! ఇక్కడ బోలెడు తోటపనులు—ఇతర పనులు వుంటే కారులో మద్రాసు వెళ్ళి క్లబ్బులో ముక్కూ-ముఖం ఎరగని వాడికి భోజనం పెట్టించి ఇక్కడకి తీసుకురావాలా కర్మ! కర్మ"

శర్మ దానికేం జవాబు చెప్పకుండా వెళ్ళిపోయి. మళ్ళీ తిరిగి వచ్చి మద్రాసులోనే మిమ్మల్ని క్లబ్బులో రెండు సలకై అయిదుకు కుమారి సుజాతగారు కలుసుకుంటారు" అన్నాడు.

"ఆవిడెవరు?"

శ్రీమతి పుష్పావతీ దేవిగారు మన భాండాగారంలో వున్న పుస్తకాల జాబితా వ్రాయడానికి నియమించారావిడని ఒక నెల వుంటారట ఆవిడ"

"అయితే ఆవిడకూడా సాహితీ బంధు వేనన్నమాట."

చూడండీ రాజాసాబ్, మన ఇంటి గ్రంథాలయంలో నాలుగు వేల పుస్తకాలున్నాయి. అందులో శాస్త్ర

గ్రంథాలను-నవలలను-కథల పుస్తకాలను విభాగాలుచేసి, నెంబర్లువేసి కేట్లాగు తయారుచేస్తే సులభంగా రిఫరెన్సు చేసుకోవచ్చు."

"ఎవడికాక్కావాలా పుస్తకాలు - అమ్మితారేస్తే-ఓ వెయ్యి రూపాయలు వస్తాయి! హైబ్రిడ్ కొబ్బరిమొక్కలు కొని తోటలో వేసుకుంటే ఏటా మరో పదివేలు ఆదాయం వస్తుంది. నేను చదువుతానా ఏడుస్తానా?" విసుగ్గా అన్నాడు రాజాగారు.

"మీరు చదవకపోతేనేం-మేమందరం చదువుకుంటాం గదండీ-రాజాసాబ్! ఆమెను-మహాకవి మార్తాండశాస్త్రి గారినికూడా కారులో ఇక్కడకు తీసుకురండి" అన్నాడు శర్మ

సరేలేగాని, ఈ మహాకవి ఏ ప్రాంతంవాడో చెప్పావు గాదు"

గంజాం జిల్లా. ఒరిస్సానుంచి వచ్చినవాడండీ.

"ఈ కుమారి మహాదేవి మహాదేవదేశాయ్‌కి ఏమవుతుంది?"

"ఆయన ప్రసిద్ధ గాంధేయుడు. ఈమె కవికోకిల, ఈమె పదహారణాల ఆంధ్రపడుచు. ఆయన గుజరాతీ."

"కుమారి అంటే ఇంకా పెళ్లి కాలేదన్నమాట."

"వయసు మాత్రం 25_30 ఏళ్లుంటాయి."



"కులం?"

"కుల గోత్రాలు నాకు తెలియవండీ." అంటూ శర్మ వెళ్లిపోగానే రాజాసాబ్ చెల్లెలు శ్రీమతి పుష్పావతీ దేవివచ్చింది అటు పక్కకి. రిస్టువాచీ చూసుకుని కాఫీ రెండు కప్పులతో తెచ్చింది.

"అన్నయ్యా! కాఫీ త్రాగి బయలుదేరు. నేటి యువ తరం రచయితలలో మార్తాండశాస్త్రి ఒకరు. ఆయన నవల "కోనసీమ కొబ్బరిచెట్లు" "పాన్పు" పత్రికలో సీరియల్ వేస్తున్నది. కుమారి మహాదేవి. శాస్త్రిగార్ల కవితాగోష్ఠి, సాహిత్యచర్చ వినితీరవలసిందేగదా అన్నయ్యా!"

"మన కొంపమీదికి ఈ కవుల్ని, కవయిత్రుల్ని ఎక్కించి నాకు తోటపనికి తీరిక లేకుండా చేస్తున్నావు. నేను ప్రకృతిమాత ఒడిలో పుట్టి పెరిగిన వాడినిగదా! నాకీ సాహిత్యం దేనికి? అని అడిగాడు విసుగ్గా రాజాగారు.

"సాహిత్యమేనా? వచ్చే సోమవారం రాత్రి మన యింట్లో సంగీత విద్వాన్ శ్రీతారకం గారి గాత్రపాట. ఆయన కర్ణాటకంలోను ఔత్తరాహికంలోను నిధి. రెండూ పాడివిని పిస్తారు" హుషారుగా అంది పుష్పావతి.

"కర్మకొద్దీ-నా యిల్లు-నాకీ సంగీత సాహిత్యాలతో నరకతుల్యమవుతుంది. సరే! ఇక బయలుదేరి వెడతాను కారు తీసుకురమ్మను డ్రైవర్ని.

ఆమె డ్రైవర్ని పిలవడానికి వెడుతూంటే "పుష్పా" అని వినిపించింది.

భర్త మళ్లీ పిలుస్తున్నాడని-తాను ఇంకా కాఫీ తాగని కప్పు భర్త కందించి, "ఏం? పిలిచారా?" అని అడిగింది. "నీ మెడలో సుమారు 50 వేలు ఖరీదు చేసే నెక్లెసు ఎందుకు బ్యాంకు సేఫ్టీ లాకర్ లో వుంటే భద్రంగా వుంటుంది గదా."

నన్నుకూడా లాకర్ లో పెట్టండి-నేనూ భద్రంగా వుంటాను. నా మీద మీకు 24 గంటలూ అనుమానమే. నా జాకెట్లు లంగాలు-కుట్టడానికి టైలరు నజీముద్దీన్ ని పిలిపించి ఇక్కడే మిషను పెట్టుకు కుట్టమంటే ఆ కుర్రకుంక నీ ఛాతీ కొలిచాడని. వంపులు-సొంపులు చూసి చప్పరిస్తాడని గొడవ."

చప్పరించడంటావా?"

"వాడు చిన్నవాడు కదండి! ఏం చప్పరిస్తాడు? మీ వన్నీ కుశంకలె! వాడికి పద్దెనిమిదేళ్లైనా లేవే!"

"అవి చాలవా?"

"దేనికి?"

నీకేసి చూడడానికి-నీ సౌందర్యామృతం కళ్లతో త్రాగడానికి.

"ఏడిశాడు-వాడువట్టి ఆడారి వెధవ."



వాడికి మలేరియా వుంది-మన్యం చోడవరంలో రెండేళ్లున్నానని చెప్పాడు."

"మలేరియా లేదు-రుమేరియా లేదు. నాకు వాడి సంగతి బాగా తెలుసు. అమ్మగారు-అమ్మగారు. పావలా యిప్పించండి-సింగిల్ టీ త్రాగి వస్తానంటాడు. లంగాలు, జాకెట్లు ఎంత అందంగా కుడతాడని-ఇక మీ నెక్లెసు గొడవా! పెద్ద పండుగ వెళ్లేదాకా అది నా మెడలో వుండవలసిందే అంటూ పుష్పావతీదేవి లోపలికి వెళ్లిపోయింది.

## 3

శ్రీమతి పుష్పావతీదేవి అలా వెళ్లిందో లేదో రాజాసాబ్ కుమారుడు లక్ష్మీకాంతారావు వచ్చాడు.

"మామయ్యా! ఏం చేస్తున్నావు?" అంటూ

"ఏముంది అల్లుడూ చేసేందుకు?" అన్నాడు.

"నీతో చిన్నపనుండి వచ్చాను." అన్నాడు కాంతారావు.

"చెప్పు."

"హడావుడిగా చెప్పడం కుదరదు. మూడు నిముషాలు చెప్పాలి."

"మూడుకాదు ముప్ఫయి నిముషాలు చెప్పు. నాకేం అభ్యంతరం లేదు."

"ఓ వెయ్యిరూపాయలు అప్పుకావాలి మ గా,"

"చచ్చానురా దేవుడా! అని అనుకొని-నేనూ దాని కోసమే తాపత్రయపడుతున్నది. రత్నప్రభకి పదివేలు కావాలంటూ వుత్తరం రాసింది. ఆ డబ్బుతో తన బ్రతుకూ భర్త బ్రతుకు, ఒక గాడిని పడతాయని ఇప్పుడు చుక్కాని పట్టే నావికుడులేని నావలా జీవితాలు నట్టేట వున్నాయనీ గోలపెట్టింది. మీ అత్త పైసాకూడా ఇవ్వనంటూ ఖరారుగా చెప్పింది.

"మామయ్యా! అయితే నీకు నేనొక మంచి ఉపాయం చెప్పనా?" అన్నాడు కాంతారావు.

"చెప్పు నాయనా! లాభించేది అయితే తక్షణం ఆచరిస్తాను."

"అత్తయ్య నెక్లెసు తాకట్టుపెట్టు. రత్నకి పదివేలు ఇవ్వు. నాకు వెయ్యి ఇవ్వు. గిండీ రేసుల్లో ఇవాంజీకాను బాక్ చేస్తే ఫాక్స్‌ట్రాట్ గెలిచింది. ఏడువందలు బుకీ రెడ్డికి బాకీ పడ్డాను. ఆ బాకీ చెల్లుబెట్టి రేపు ఆదివారం రేసుల్లో డిటర్మినేషన్ మీద విన్ పది టిక్కెట్లు కొంటాను. ఓ ట్రిబుల్ వేస్తాను. జాక్‌పాట్ కొట్టితీర్తాను. నీ వెయ్యి నీకు ఇచ్చేస్తాను ష్యూర్."

"ఓరి అమాయకుడా! మీ అత్త అంత తేలిగ్గా నెక్లెసు ఇస్తుందా?"



"ఇవ్వకపోతే దొంగతనం చేద్దాం."

"అమ్మో! చంపేస్తుంది." అన్నాడు భయం భయంగా.

"ఎవరికీ తెలియకుండా నేను అపహరించుకువస్తాను. కావాలంటే కొత్త నెక్లెసు కొనుక్కోమని చెక్కు రాసియ్యి. ఏమీ అనదు. నౌకర్లెవరో ఆ నెక్లెసు తస్కరించారనుకుంటుంది. ఓ రోజు బాధ పడుతుంది. తర్వాత కొత్త నెక్లెసుకొని యిస్తే ఏమీ అనదు. పాపం రత్నప్రభకి ఉత్తరం రాస్తున్నావా?"

"ఆ! ఇవ్వలేను-పంపలేను, అని రాస్తున్నాను."

"అలాకాదు. ఇస్తాను-పంపుతాను. అని రాయి మామా! అన్నింటికి నేనున్నానుగా!"

నిజంగా నాకేమీ మాట రాకుండా నువ్వు అత్తయ్య వజ్రాలహారం దొంగిలించి నాకు అందించగలిగితే వెయ్యేం ఖర్మ, రెండు వేలిస్తాను.

"అసలు నీకు అత్తయ్యకి రత్నకి డబ్బు పంపడం విషయంలో జరిగిన సంభాషణ అంతా విన్నాను మామయ్యా కనుకనే నా అప్పు తీరడానికి-నీ కుమార్తెను సంతోష పరచడానికి-మార్గం-అత్తయ్య నెక్లెసు కాజేయడమే. నీకు ఏమీ

మాట రాకుండా-నీ మీద అత్తకేం అనుమానం కలుగకుండా చూసే పూచీ నాదీ."

ఇంత భరోసా నువ్వు ఇస్తున్నప్పుడు నేను ఎలా కాదంటాను? ఆ బాధ్యత అంతా నీ మీదే పెడుతున్నాను. అనుకున్న పని నిర్విఘ్నంగా కానీ!" అన్నాడు రామకృష్ణ ప్రసాద్.

"అలా దారికిరా మామయ్యా! నీ ప్రాణానికి నా ప్రాణం అడ్డు అని చెప్పానుగా." అంటూ బయటికి వెళ్ళి పోయాడు కాంతారావు.

"ఛీ! పెళ్లాం నక్లెసు భర్త దొంగిలించడమెంత విరుద్ధం? ఒకవేళ నేనే ఈ దొంగతనం చేయించినట్లు పుష్పావతికి తెలిస్తే నన్ను బ్రతకనిస్తుందా? ఏమైనప్పటికీ ఒకసారి బావగార్ని కూడా అడిగి చూడటం మంచిది." అనుకుంటూ తోటలోకి దారి తీశాడు రామకృష్ణప్రసాద్.

ఏదో పుస్తకం చూస్తున్న వీరవెంకటసత్యనారాయణరావు జమీందారు "వట్టి చవట దొరికాడు. మడిలో ఏ ఎరువులు వేస్తే ఎంత మంచిదో ఈ పుస్తకంలో చాలా చక్కగా రాశాడు" అనుకుంటున్నాడు స్వగతంగా.

"బావగారూ !" అంటూ పిలిచాడు రామకృష్ణ ప్రసాద్.



"ఎవరూ! ఏం కావాలి?" తోటల పెంపకం కూడా ఒకకళే. అంటూ పి. నరసింహారావు రాసిన ఈ పుస్తకాన్ని చూడు. సుందరం ఎంత తెలివితక్కువగా మొక్కలు పాతాడో తెలుస్తుంది.

నీ మొక్కల మాట అలా వుంచి-నాగోడు వినవయ్యా స్వామీ. నీ చెల్లెలికి తెలియకుండా ఓ పదివేలు అప్పిస్తావా? నెలరోజుల్లో తిరిగి ఇచ్చేస్తాను."

"మా చెల్లెలికి తెలియకుండా నీకు పదివేలు అప్పివ్వడం నావల్ల కాదు. అది అసంభవమన్నర."

"పాపం! మా పిల్ల ఏడుస్తూ రాసిందయ్యా!"

"అది ఎప్పుడు రాసినా ఏడుస్తూనే రాస్తుందిలే. ముందు బొండు మల్లె ఎరువు సంగతి చూడనీ! సుందరానికి ఆ తర్వాత చదివి వినిపిస్తాను."

"తల బద్దలు కొట్టుకున్నా వినడుగాక వినడు-ఇవ్వడు. ఇవ్వడానికి ఇష్టం లేకనే అలా మాట్లాడుతున్నాడో-లేక మనిషికి మదపిచ్చిలా తోటపిచ్చో తెలియదు. ఛీ! ఛీ! ఛీ!" అనుకుంటూ రామకృష్ణప్రసాద్ ఆ తోటలోంచి తిరిగి తన గదిలోకి వెళ్ళిపోయాడు మరో సిగరెట్ ముట్టించి.

మేనత్త నెక్లెసు ఎలా చేజిక్కించుకోవాలా. దాని మీద పదకొండో-పన్నెండో వేలు తీసుకురావడం ఎలాగా

అన్న సమస్యతో సతమతమవుతున్నాడు లక్ష్మీకాంతారావు. అతన్ని ముఖ్యంగా పీడిస్తున్నది తన అప్పు తీర్చడం ఎలాగా అన్నదే। అలా ఆలోచనల మధ్య అతను హాల్లోకి వచ్చాడు. అక్కడ బల్లమీద దిన, వార, మాస పత్రికలు డ్రిల్లుకు సిద్ధంగావున్న సోల్జర్లలా వున్నాయి. మార్నింగ్ స్టార్ పత్రిక తీశాడు. ఆదివారం రేసుల సెలక్షన్ కోసం-సెలక్షన్ల కోసం చివరి పేజీ చూడకుండా ఆ పత్రిక మొదటి పేజీలోవున్న డబుల్ కాలం ప్రకటన చూశాడు. అందులో ఇలా వుంది:

పి. పి. రావ్‌కి మీ సమస్యలన్నీ వదలండి. మీకు ఏ పని కావాలన్నా చేసి పెడతాడు. చేపలు, కోళ్ళతో సంబంధంలేని ఏ పని అయినా సరే చెయ్యగలడు. మహాసాహసి మహామేధావి-సాటిలేని సలహాలు- సరసమైన రుసుము. వెంటనే సంప్రదించండి. లేదా వ్రాయండి.

పరోపకారి పరమేశ్వరరావు
అడ్వయిజరీ కనసల్టెంట్
బాక్సు నెంబరు **746**,
కేరాఫ్ మార్నింగ్‌స్టార్
మద్రాసు-**2**



ఈ ప్రకటన సాక్షాత్తు పరమేశ్వరుడే చేశాడనుకున్నాడు లక్ష్మీకాంతారావు. వీడికి రెండు లేదా మూడు వందలు ఇచ్చామంటే మేనత్త నెక్లెసు అతనే దొంగిలించి తెస్తాడు. తన మామయ్య తనకి రెండువేలు ఇస్తాడు. అప్పులన్నీ తీర్చిపారేసి తనే రేసు కోర్సులో వ్యాపారం విరమించుకుంటున్న ముసలి రెడ్డిస్థానే తనే బుకీగా వుంటూ వందలు-వేలు సంపాదిస్తాడు. కాల్ గరల్స్‌తో జల్సా చేస్తాడు కాస్త కాస్త బ్లాక్ నైట్ విస్కీ రుచి చూడవచ్చు. అబ్బ! ఎంత ఆనందం! ఎంత సుఖం!" అనుకుంటూ మరో రెండుసార్లు ఆ ప్రకటన చదివాడు.

ఆలస్యం అమృతం విషం అన్నట్టు వెంటనే వుత్తరం రాశాడు. కవరులో పెట్టి అంటించాడు.

ఇంతలో ఒక ఐడియా వచ్చింది లక్ష్మీకాంతారావు బుర్రలో. గబగబా తోటలోకి వెళ్ళాడు.

నాన్నగారూ! మీరు 12-30కి కారులో మద్రాసు వెడతారా?"

"ఆ! వెడతాను."

"నన్నుకూడా తీసుకు వెళ్ళరూ!"

"నువ్వు దేనికి?"

"ఒకసారి కంటి డాక్టర్ని చూడాలండీ-కళ్ళంబడి అదే పనిగా నీళ్ళు కారుతున్నాయి."

"ఏదో వేడిచేసి వుంటుంది. ఆ మాత్రం భాగ్యానికి మద్రాసు దేనికి? ఇక్కడ చూపించుకోరాదా."

"అలా కాదండీ! కన్ను-ముక్కు-చెవి స్పెషలిస్టు నా ఫ్రెండు ఫ్రీగా చూస్తాడు. అవసరమైతే కళ్ళజోడు ప్రిస్క్రైబ్ చేస్తాడు. లేదా డ్రాప్స్ వేస్తాడు. ఆయింట్‌మెంట్ ఇస్తాడు కంటి వ్యాధులు ప్రతిడాక్టరుకీ చూపించ కూడదండీ!

"సరేరా!"

"థాంక్స్ నాన్నారూ."

"అయితే ఒక్క షరతు. సాయంత్రందాకా మద్రాసులో పిచ్చికుక్కలా తిరిగితే వూరుకోను. బస్సులో తిరిగి మూడు గంటలకల్లా నా దగ్గరకివచ్చి తీరాలి. లేకపోతే నా కోపం వస్తుంది."

"2-30కే తిరిగి వస్తానండీ!" అంటూ ఉత్సాహంగా రిస్టువాచీ చూసుకున్నాడు. అప్పటికే పన్నెండు అయింది. పన్నెండున్నరకల్లా కారు రెడీ చేయమని డ్రైవరుతో చెప్పాడు లక్ష్మీకాంతారావు.

# 4

రాజావీర వెంకటసత్యనారాయణరావు జమీందారు కుమార రత్నం లక్ష్మీకాంతారావుతో స్టడీ బేకర్ ఛాంపియన్ 1956 మోడల్ కారులో మద్రాసుకు బయలు దేరిన సమయంలోనే పరోపకారి పరమేశ్వరరావు (షార్ట్ నేమ్ పి. పి. రావ్) మార్నింగ్ స్టార్ ఆఫీసుకు వెళ్ళి బాక్సు నెంబరు 746కు ఏమైనా ఉత్తరాలు వచ్చాయా అని అడిగాడు. ఆరు కవర్లిచ్చాడు. బాక్సు నెంబర్ల క్లర్కు ఆఫీసుకు వెలుపల అరుగుమీద బెంచీలో కూర్చుని ఒక్కొక్కటి చింపి చదవ సాగాడు. అందులో అయిదు ఉత్తరాలు నిరాశా-నిస్పృహ లనే కలిగించాయి.

ఒక ఉత్తరంలో ఆదివారం రేసుల్లో గవర్నర్స్ కప్పు గెలిచే గుర్రం సరిగా చెప్పగలిగితే 10 రూపాయలు ఇస్తా." అని వుంది.

మరో ఉత్తరంలో ఒక పెద్ద పారిశ్రామికవేత్త ప్రామిసరి నోటుపై తనకు ఒక లక్ష రూపాయలు అప్పు ఇప్పించమని కోరాడు.

నువ్వు పుట్టిన తేదీ-చోటు-సమయం తెలుపుతూ 25 రూపాయలు పంపితే జీవిత ఫలాలు చెబుతాను" అంటూ ఒక జోతిష్కుడు వ్రాశాడు. మరో కవరులో సినిమా హ్యాండ్ బిల్ వుంది.

అయిదో ఉత్తరంలో తన ఏజన్సీలో జీవితభీమా పాలసీ తీసుకుని సాయం చెయ్యమని ఓ ఏజంటు కోరాడు.

ఇక ఒకే ఒకటి మిగిలింది. అందులో ఇలావుంది :

"పి. పి. రావ్ గారికి నన్ను కెథిడ్రల్ రోడ్డు మద్రాసులోని హోటల్ దిగ్జామ్ హాలులో-బటన్ హోల్‌లో సులభంగా గుర్తించడానికి వీలుగా ఒక ఎఱ్ఱ గులాబిపువ్వు ధరించి "బంగాళాఖాతంలో వాయుగుండం. కోస్తా జిల్లాలో వర్షాలు చెదురుమదురుగా కురవవచ్చు." అంటే-ఈ జవాబిచ్చే వ్యక్తి "వానలు కురిస్తే రైతులకు మేలు" అంటాడు ఈ విధంగా గుర్తింపు జరిగితే వ్యాపారం సంగతి మాట్లాడుకోవచ్చు. ప్రకటనదారుకు లాభసాటి షరతులు. సరిగా 12-50కి కలుసుకోవలెను."

పరమేశ్వరరావు ఈ వుత్తరాన్ని రెండు మూడుసార్లు చదివాడు. ఫ్లవర్ బజారుకి వెళ్ళాడు. ముదురు ఎఱ్ఱగులాబి పువ్వుకొని బటన్ హోల్‌లో పెట్టుకున్నాడు. తిన్నగా దిగ్జామ్ హోటల్‌కి వెళ్ళాడు.

లేంజిలో ఎవరో యువకుడు ప్రక్కనే నిలబడ్డాడు.

అతడే తనకు జవాబు వ్రాశాడేమో అనుకొని. బంగాళాఖాతంలో వాయుగుండం" అన్నాడు.

ఆ వ్యక్తి ఆశ్చర్యంగా చూసి "ఆదివారం గవర్నర్ కప్పు గెలిచే గుర్రం ఏమిటి?" అని అడిగాడు.



పరమేశ్వరరావు తడుముకోకుండా 'గోల్డెన్ నైట్' అన్నాడు. ఆ తర్వాత తనకు ఉత్తరం రాసిన వ్యక్తే పలకరిస్తాడని అక్కడే శిలావిగ్రహంలా నిలబడ్డాడు. అలా ఒంటిగంటదాకా నిలబడ్డాక ఒక 25_26 ఏళ్ళ యువకుడువచ్చి పరమేశ్వరరావుని పరిశీలనగాచూచాడు. వెంటనే "బంగాళాఖాతంలో వాయుగుండం కోస్తా జిల్లాల్లో చెదురు మదురుగా వర్షాలు" అన్నాడు దానికి బదులుగా "వర్షాలవల్ల రైతులకు మేలు_ బ్రదర్ నీ కోసం అయిదు నిముషాలు నుంచి చూస్తున్నాను" అన్నాడు.

నేనక్కడ అరగంటనించి కనిపెట్టుకుని వున్నాను. రా! రెస్టారెంట్‌లో ఒక మూలగా కూర్చుని మాట్లాడుకుందాం" అంటూ రెస్టారెంట్‌లో ఒక మూలగావున్న టేబుల్ దగ్గర కూర్చున్నాడు.

"ఏమైనా ఆరగిస్తారా? వైన్ త్రాగుతారా? కాఫీ సేవిస్తారా?" అని అడిగాడు.

"వైన్" అన్నాడు పరమేశ్వరరావు.

వెయిటర్‌ని పిలిచి బార్ కేసి వేలెత్తిచూపి "పీటర్ స్కాట్ టూ పెగ్స్" అన్నాడు.

వెయిటర్ అయిదు నిముషాల్లో రెండుగ్లాసుల్లో విస్కీ, ఐస్ క్యూబ్స్‌ని జీడిపప్పుతో రెండు ప్లేట్లు తెచ్చి వారి ముందుంచాడు.

విస్కీ సిప్ చేస్తూ "నీ వేషంచూస్తే రాష్ట్రపతి భవనంలో డిన్నరుకు వెళ్ళేవాడిలా ఉన్నావే! నీ ప్రకటనలో చెప్పినట్టు ఏ పనికైనా సిద్ధపడతావా?"

వేషగాంభీర్యం లేకపోతే నాతో మాట్లాడేదెవరు? నా ఆస్తి మొత్తం పదిరూపాయలు. సంపూర్ణ పేదరికం అనుభవిస్తున్నాను. వేసిన ప్రకటన ఎరుగున్న అడ్వర్టయిజింగ్ ఏజన్సీవాళ్ళు వేయించారు. అంతా పైడా బే" అన్నాడు నిజం వప్పుకుంటూ.

"నేరం చేస్తావా?"

"పట్టుబడని పరిస్థితిలో-జైల్లో కూర్చోవలసిన అవసరం వెంటనే లేని పరిస్థితిల్లో చేస్తాను."

"నేను రెండున్నరకు బస్ కాచ్ చేసి పూనమల్లిలోని ఆనందభవన్ మూడుగంటలలోగా చేరుకోకపోతే - మా నాన్నగారినుంచి చివాట్లు చెప్పు దెబ్బలు తప్పవు." అన్నాడు లక్ష్మీకాంతారావు.

"మీ నాన్నగారెక్కడ వున్నారు?"

"ప్లేయర్స్ క్లబ్బులో మహాకవి మార్తాండశాస్త్రి గారిని_కుమారి సుజాత గార్లను కలుసుకోబోతున్నారు."

"ఆల్ రైట్ నేను చెయ్యవలసిన నేరం ఏమిటి?"

"మా మేనత్త పుష్పావతి ధరించే డైమండ్ నక్లెసును చెక్కెయ్యాలి. నీవు ఆనందభవనంలో ఎవరినీ ఎరుగవు కనక నీ మీద అనుమానం వుండదు. నీకు 500రూ. ఇస్తాను."



"సరే అక్కడకు వస్తాను. మాట్లాడుకొని-పరిస్థితులు వీలుపాలు గమనించిగాని చెప్పలేను."

"ఇదుగో అక్కడికిరా! పొరపాటు రండి" అంటూ లక్ష్మీకాంతారావు పూనమల్లి రోడ్‌లో బస్‌స్టాండుకు పరుగెత్తి బస్సు ఇంకా స్టాపు దగ్గర ఆగకుండానే ఎక్కేశాడు, పరమేశ్వరరావు చేతిలో ఒక నోటుకుక్కి.

అది యాభై రూపాయలనోటు.

"మైగాడ్! ఇవాళ ఉదయం నక్కను తొక్కి వుంటాను. సాయంత్రం భోజనంచేసి తీరికగా వెళ్ళవచ్చు ననుకుంటూ. తన పూర్వపు స్నేహితుడు మల్లేశ్వరరావు ఇంటికి నుంగంబాకం బస్సు ఎక్కాడు. రండాల్స్ రోడ్డు మొగలో దిగాడు. 9 సి ఇంటికి వెళ్ళాడు, తలుపుకున్న బెల్ నొక్కాడు. ఓ అమ్మాయివచ్చి తలుపు తీసింది.

"శ్రీమతి రత్నప్రభ వుందా?" అని అడిగాడు.

"లేరు బయటకు వెళ్ళారు."

"ఆమె భర్త?"

"ఆయన కూడా లేరు."

మైగాడ్! అంటూ మెట్లుదిగి కళ్ళజోడు అద్దాలు జేబు రుమాలుతో తుడుచుకుని మెట్లుదిగి రోడ్డు మీదికి వచ్చేసరికి రత్నప్రభ భర్త మల్లీశ్వరరావు ఎదురై, అమాంతంగా పరమేశ్వరరావును కావలించుకుని "అరే. మై డియ

రెస్ట్ ఓల్డ్ ఫ్రెండ్-రావ్! ఎన్నాళ్ళకి కనిపించావు?" అంటూ ఆనందపడుతూ "రా! మా రత్న తన బాల్యస్నేహితురాండ్రకు టీ పార్టీ చేస్తోంది. నన్నుకూడా రావద్దంది. రా! ఇక్కడే ఒక రోడ్ సైడ్ టీ షాపు వుంది. వన్ బై టూ టీ త్రాగుదాంరా! అంతవరకే మన జేబులో పైసలున్నాయి" అన్నాడు.

"సరే! వన్ బై టూ యే తాగుదాంరా!" అంటూ పరమేశ్వరరావు ఇద్దరూ రోడ్డు చివరనున్న టీ షాపు వెలుపల బల్లమీద కూర్చున్నారు. వన్ బై టూ అంటూ డబ్బులిచ్చాడు మల్లేశ్వరరావు.

"నీ పరిస్థితి ఎలా వుంది భాయ్."

"నీ మాట చెప్పవేం?"

"బ్రతకలేక బడిపంతులన్నట్టు ఓ ఎలిమెంట స్కూల్లో టీచరుగా వున్నాను. ఇంతకు ముందు బిస్కట్ల ఏజంటుగా పనిచేశాను. దానిలో చాలామంది డీలర్లు సొమ్ము సరిగ్గా ఇవ్వక బాకీలు పెట్టారు. అందుచేత అది మానే స్కూలు టీచరుగా చేరాను. ఇల్లుకూడా మారాము. వచ్చే జీతం 125 అద్దె ఒక్కగదికి, వసారాకు 40. మిగిలిన దానితో ఏదో ఒక పూటతిని ఒకపూట పస్తుండి కాలం నెట్టు వస్తున్నాం. మరి నువ్వు?"

నిన్న రాత్రి వరకూ మామేనమామ దగ్గరజీతానికి ప



చేస్తున్నట్టు లెఖ్ఖ. ఇవాళ ఉదయం ఉద్యోగానికి రాజీనామా యిచ్చాను. ఆయన చేసేది చేపలు, కోడిగ్రుడ్ల వ్యాపారం. ఆ చేపల వాసన భరించలేక గట్టిగా పట్టుకుంటే పగిలిపోయి చేతులనిండా సొన, జిగురులా పట్టుకుంటూంటే కడుక్కోలేక తూర్పు దిక్కుగా తిరిగి దణ్ణంపెట్టి నువ్వులు-నీళ్ళు వదిలి వేశాను. నిన్ననే 'మార్నింగ్ స్టార్' పత్రికలో ఓ చిన్న అడ్వర్టయిజ్‌మెంటు వేయించాను. దాని ఫలితంగా ఒకడు వచ్చి-యాభై రూపాయలిచ్చాడు. ఆకలిగావుంటే ఏమైనా తిను.

అయితే ఈ టీ షాపు వాడి దగ్గర యాభై రూపాయల నోటు మారుతుందనే నమ్మకం నాకు లేదు. నేను రేపు ఉదయం ఎంప్లాయిమెంట్ ఏజన్సీకి వెళ్ళి మిస్ హస్నాబాను కలుసుకోవాలనుకుంటున్నాను.

హస్నాబాను 20 ఏళ్ళనించి నిరుద్యోగులకు వాళ్ళ వాళ్ళ అర్హతలనుబట్టి ఉద్యోగాలు సిఫారసు చేస్తూ వుంటుంది. ముఖ్యంగా దాసీలను, వంటవాళ్ళను పంపడం ఆమె స్పెషాల్టీ."

"ఇంకా నేనేమీ తినబోను టీ చాలులే." అన్నాడు మల్లేశ్వరరావు.

పరమేశ్వరరావు నాన్న బాగా డబ్బున్న రోజులలో

కొడుకును తనతోపాటు మద్రాసులోని క్లబ్బులన్నిటిలోనూ మెంబరుగా చేర్చాడు. అలా సభ్యత్వంవుండని చెప్పుకోదగ్గ క్లబ్బులు 26. కాని యిప్పుడు నాలుగింటిలో మాత్రమే మెంబరుషిప్ వుంది. మిగిలిన 22 క్లబ్బుల్లోనూ రోజులు బాగా లేక వ్యాపారంలో నష్టంవచ్చి తండ్రి చనిపోవడంతో చందాలు కట్టని కారణంగా సభ్యత్వం తొలిగించబడింది. నాలుగు క్లబ్బుల్లోనూ మార్చి నెలాఖరుదాకా సభ్యత్వం వుంటుంది. ఆ తర్వాత సభ్యత్వం, ప్రవేశం సంగతి దేముడెరుగు.

పరమేశ్వరరావు ప్లేయర్స్‌క్లబ్‌కు వెళ్ళాడు. నౌకర్లు టిప్‌టాప్‌గా సూటు-బూటు-హాట్-స్పెక్టికల్స్ ధరించిన పరమేశ్వరరావుని ఆటకాయించ లేదు సరిగదా సెల్యూట్ చేసి తలుపులు తెరిచారు.

తిన్నగా ఒక మూలఉన్న టేబులు దగ్గర కూర్చున్నాడు. మెంబర్లకు అన్ని సౌకర్యాలతోపాటు డబ్బు ఇస్తే భోజనంకూడా పెడతారా క్లబ్బులో. ఆ క్లబ్బు ఒక ఫైవ్ స్టార్ క్లబ్బుకు ప్రక్కనే వుంది. అతడు వెయిటర్‌తో భోజనం తెమ్మన్నాడు. ఒక్కడూ భోజనంచేస్తూ ఆలోచనలో పడ్డాడు.

# 5

ప్లేయర్స్ క్లబ్బులో పరమేశ్వరరావు భోజనాని కుపక్రమించిన సమయంలోనే నుంగంబాకంలో మల్లేశ్వరరావు యింటి తలుపు తట్టుతోంది ఓ 20-22 ఏళ్ళ యువతి-పనిపిల్ల తలుపు తెరిచింది.

"రత్నప్రభ వుందా! సుజాత వచ్చిందని చెప్పు."

పని పిల్ల లోపలికి వెళ్లి చెప్పింది. రత్నప్రభ గాలికి ఎగిరిపోతున్న ఆకులా నడవలోంచివచ్చి "లోపలికిరా సుజాతా! ఆహా ఎంత కాలానికి కనిపించావు" అంది సంబరంగా.

"నేను చాలా త్వరగా వచ్చేశానేమిటి ? ఎవరూ రా లేదుగా!" అంది లోపలికివచ్చి కూర్చుంటూ.

"నువ్వు ఫస్టు. అయినా నేను పిలిచింది మరో యిద్దరినేలే! మనకు హైస్కూలులో డాన్సు టీచరుగా పని చేసిన హస్నాబా గారిని-మిసెస్ మార్తాండశాస్త్రిని. వాళ్ళు వస్తారు లే మరో పది నిముషాల్లో. మనం ముందు టీ త్రాగుదాం" అంది.

పనిపిల్లనుచూసి "లక్ష్మి, ఎవరు వచ్చినా నేను ఇంట్లో లేనని చెప్పు. హస్నాబాను గారిని-మిసిస్ మార్తాండశాస్త్రిని మాత్రమే లోపలికి పంపు." అంది.

లక్ష్మి సరేనన్నట్లు తల వూపింది. "ముందు మాకు టీ తెచ్చి పెట్టు" అంటూ పురమాయించి సుజాతతో కబుర్లలో పడిపోయింది.

"రత్నా! నువ్వు వెనక చాలా బొద్దుగా వుండేదానివి. ఉత్సాహంతో ఉరకలు వేస్తూ, అసలు నడిచే దానివా? పరుగు లేకాని. ఏమిటి ఇలా చిక్కిపోయావు." అని అడిగింది సుజాత టీ తాగుతూ.

"ఈ యింట్లోకివచ్చి నాలుగు రోజులయింది. ఇంకా సొంతం సర్దుకోనే లేదు. ఇంతకు మునుపు మైలాపూర్‌లో వుండేవాళ్ళం. అది మా శ్రీవారి మేనమామ ఇల్లు. ఆయన వ్యాపారంలో దెబ్బతిన్నాడు. ఇల్లు అమ్మివేసి అప్పులుతీర్చి ఎక్కడికో వెళ్ళాడు. ఇల్లుకొన్నవాళ్ళు 24 గంటలలోగా ఖాళీ చేయమని లేకపోతే తట్టబుట్ట వీధిలో గిరవాటు వేస్తామన్నారు. వాళ్లు అన్నంతపనీచేసే రౌడీ వాళ్లలాగే కనిపించారు. ఇంక చేసేది లేక ఖాళీచేసి అప్పటికప్పుడు ఒక బ్రోకరు చూపించిన ఈ చిన్న యింట్లోకి వచ్చాం."

"సుజాతా! నీ పరిస్థితి ఎలా వుంది?" బాగా డబ్బు సంపాదిస్తున్నట్టున్నావు." అంది రత్నప్రభ ఆమె కట్టుకున్న పోలిస్టర్ చీరచూస్తూ.

"ఏదోలే! రెండేళ్ల క్రితం నువ్వు పెళ్లి చేసుకుంటున్నావని చెప్పారు. మీ ఆయన ఎవరూ? ఏళ్లవారి కోడలివా?" అని అడిగింది సుజాత.



కాదులే! ఆ రోళ్ళ పెళ్ళి కొడుకుని పెళ్ళి చేసుకోమని మా సవతి తల్లి శత విధాల పోరింది. నేనే వద్దని త్రోసి పారేసి మల్లేశ్వరరావు గారిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాను. అందర్నీ కాదని ఆయన వెంట వచ్చాను."

"అంటే లేచి వచ్చావేమిటి? ఇంతకీ మీ ఆయనేం చేస్తున్నారు?"

ప్రస్తుతం ఒక ఎలిమెంటరీ స్కూల్లో పనిచేస్తున్నా అది పని చేస్తున్నట్లు లెక్కకి రాదులే. మా పరిస్థితి న్యాయంగా చెప్పవలసివస్తే ఏమీ బాగా లేదు."

మరి మీ నాన్న చాలా డబ్బున్నవాడే గదా! పోనీ ఏమన్నా సాయం చేయమని అడగలేకపోయావా? మీ నాన్న బాగున్నాడా? ఆయన పేరేమిటి? మరచిపోయాను."

"మా నాన్నగారా! రామకృష్ణప్రసాద్. ఆయన దగ్గర లక్షలు మూలుగుతున్నాయి. అయితేనేం ఆయనగారు పుష్పావతిని మళ్ళీ పెళ్ళి చేసుకున్నాక చాలా మారిపోయాడు. పుష్పావతి రాజావీర వెంకటసత్యనారాయణ జమీందారుగారి సోదరీమణి. వారానికి మూడు రోజులు అన్నగారింట్లోనే పూనమల్లిలో వుంటుంది. మా నాన్న వాళ్లుండేది చెంగల్పట్టులో. మా వారు పొలం కొనుక్కొని వ్యవసాయం చెయ్యాలనుకుంటున్నారు. ఓ పదివేలు సాయం చెయ్యమని మా నాన్నకు వ్రాశాను. కాని మా సవతి తల్లికి

నేనంటే కోపం. ఇవ్వనివ్వదు. ఆ రోజే సత్యాన్ని పెళ్లాడక మల్లేశ్వరరావుని కట్టుకున్నానని కోపం."

ఇంతకీ మీ శ్రీ వారెలా వుంటారు?"

పేరుకు తగినట్లే చాలా అందంగా వుంటారు. మల్లేశ్వర రావు అన్న పేరుకు తగినట్టే ఎప్పుడూ గ్లాస్కో పంచలు, షర్టులు ధరిస్తారు. కాని ఉద్యోగం సరైందిలేదనే నా విచారం."

ఇంతలో వీధి తలుపు ఎవరో తట్టారు. లక్ష్మి వెళ్లి తలుపు తీసింది. హస్నాబాను!

"టీచరమ్మగారా! రండి-రండి! మీ పూర్వ విద్యార్థిని నా క్లాస్‌మేట్ నా డియరెస్ట్ ఫ్రెండ్-సుజాత కూడా ఇక్కడే వుంది." అంది రత్న.

"నమస్కారం టీచర్!" అంటూ సుజాత నమస్కరించింది.

"ఇప్పుడు నేను మీ టీచర్ను కానుగదా!" అంది హస్నాబాను.

"అదేమన్నమాట" అంది సుజాత.

అంతే మరి. ఏదో పొట్టకూటికోసం ఎంప్లాయిమెంట్ ఏజన్సీ నడుపుతున్నాను. చిన్నప్పుడు నిన్ను రత్నా అని, ఈమెని సుజా అని పిలిచేదాన్ని. సుజాత బాగా డబ్బుతో మసలుతున్నట్టుంది. ఆ ఒరిస్సా కవి మార్తాండశాస్త్రిని పెళ్ళి చేసుకున్న సరస్వతి కూడా మీతో పాటు చదువు



కున్నదేగదా! ఆమెను చూసి వచ్చాను. ఆమె భర్త హోటల్ బృందావన్‌లో ఏదో పేచీ పడి నువ్వు ఇంక నాకు అక్కర్లేదు." అంటూ వెళ్ళిపోయాడట. పాపం ఒకటే ఏడుపు."

"అతనో పెద్ద కవిగారు. కాని కోపంలో మటుకు మార్తాండశాస్త్రి అన్నందుకు సార్థక నామధేయుడు." అంది రత్నప్రభ.

"బాగానే వుంది. ఇంతకీ ఆవిడ దగ్గర డబ్బేమీ లేదా?"

లేదనుకుంటాను. వుంటే ఎందుకేడుస్తుంది? హోటల్ బిల్లు మాత్రం చెల్లించి చక్కా పోయాడట."

"పోనీ ఇక్కడకి తీసుకురాకపోయారా?"

"బాగుంది. మీతో చెప్పకుండా ఎలా వెంట పెట్టుకు రాను?"

"పోనీ నేను వెళ్ళి తీసుకురానా?" అంది సుజాత.

"వద్దులే! రెండు రోజులు మా యింట్లో వుండమన్నాను. నువ్వు రేపు రా చూద్దువుగాని."

"అలాగే వస్తాను."

హస్నాబాను టీ త్రాగి "పని వుందమ్మా వెళ్లి వస్తాను." అంటూ వెళ్లి పోయింది.

"రేపు వస్తాను మీ యింటికి. ఇప్పుడు ప్లేబాయ్స్ క్లబ్బుకు వెళ్లి రాజా వీరవెంకటసత్యనారాయణరావుగారిని

చూడాలి." ఆనందభవనంలో 4, 5 వేల పుస్తకాలున్నాయట. విభాగాలుచేసి కేటలాగు వ్రాసి బీరువాల్లో వేర్వేరు భాగాలలో సర్ది. నవలలు, నాటకాలు, జ్యోతిష గ్రంథాలు, శాస్త్రగ్రంథాలు, తెలుగు ప్రబంధాలు అన్నీ వేటికవి విడదీసి వ్రాయాలి. 3, 4 నెలలుంటుంది పని. మార్చిలో నా పుట్టిన రోజువరకూ ఉదరపోషణకు బాధ పడక్కర్లేదు. ఆ తర్వాత సంగతి తర్వాత చూసుకోవచ్చు. అప్పటికి నాకు ఏదన్నా పనిచూసి పెట్టండి హస్నాబాను గారూ!" అంటూ సుజాత కూడా ఆమె వెనకే బయటకు వచ్చింది.

"రత్నా! నీ సంగతి మీ నాన్న ఆనందభవన్‌లో వుంటే మాట్లాడుతాను. మీ సవతి తల్లి కనిపిస్తే నాలుగు జాడిస్తాను. నేనే కనక నీ పరిస్థితిలోవుంటే పదివేల రూపాయల చెక్కు ఇచ్చే వరకూ సత్యాగ్రహం చేసేదాన్ని." అంది సుజాత.

"అమ్మా! ఇందాక పి. పి. రావు గారట వచ్చారు." అంది చటుక్కున గుర్తువచ్చిన లక్ష్మి.

"పి. పి. రావు గారెవరే!" అంది ఆశ్చర్యంగా సుజాత.

"నువ్వు చూడవలసిన మనిషేనే సుజాతా; చాలా తెలివైనవాడు. చాలా గొప్పవాడు. చాలా మంచివాడు. మా వారికి ప్రాణస్నేహితుడు. మా ఫామిలీ ఫ్రండు."



"అలాగా! ఏదో ఒక టైములో చూడకపోములే!" అంటూ నవ్వింది సుజాత.

# 6

సుజాత మౌంట్ రోడ్డులో ప్లేయర్స్ క్లబ్బుకింకా ఫర్లాంగు దూరంలో వుండగా ఎండకాస్తుండగానే పెద్ద వాన వచ్చింది. ఖరీదైన తన చీర తడిసిపోతుందని భయపడి సుజాత ఒక బట్టలకొట్టు దగ్గర ఆగింది. ప్లేయర్స్ క్లబ్బులో భోజనం ముగించి, బయట వర్షం కురుస్తుండడంతో ఆ క్లబ్బులో పేకాడుతున్న వారు క్లోక్‌రూం దగ్గర పెట్టుకున్న గొడుగుల్లో మంచిది చూసి పరమేశ్వరరావు వెంటనే ఆ గొడుగు ఎవరిదనికూడా అడగకుండానే బయటకు తెచ్చాడు.

ఇప్పుడే ఆ దుకాణంలో సిగరెట్లు కొనుక్కునివస్తాను. అంటూ ముందుకు నడిచాడు గొడుగుని విప్పుకుని.

వెల్లింగ్‌టన్ టాకీసు ప్రక్క రెడీమేడ్ గార్మెంట్స్ దుకాణంలో ఒదిగి నిలబడ్డ సుజాతను చూశాడు.

"అరే! ఇదేదో నైన్ వండర్‌లావుందే! మిస్ ! మిమ్మల్నెక్కడో చూసినట్టుందే! ఇలా అడిగినందుకు క్షమించండి" అన్నాడు.

"ఇప్పుడే చూసివుంటారు. ఇక్కడే చూసి వుండవచ్చు. అయితే నేను ప్లేయర్స్ క్లబ్బులో రాజాగారిని చూడాలి.

దయవుంచి గొడుగులో అక్కడకు తీసుకువెడతారా ?" అ
అడిగింది.

"వెరీగ్లాడ్ లీ : రండి" అన్నాడు భుజం భుజం తగ
లుతూ ఏదో కబుర్లు చెప్పుకుంటూ బయలుదేరారు.

"మీ పేరు ?" అని అడిగాడు.

"సుజాత"

"రాజాగారిదగ్గర ఉద్యోగం చేస్తారా ?"

"అవును. ఆయన పెర్సనల్ లైబ్రరీకి కేటలాగు
తయారు చెయ్యాలి."

"ఆయన వుండేది పూనమల్లెలో కదూ."

"అవును. అన్నీ కుదిరితే ఇవాళో-రేపో వెళ్ళాలి"

"రైటో ! ఆయనను నేనుకూడా చూస్తాను, రండి.
ఇది వెయిటింగ్ రూము. నేను చూసివస్తానుండండి" అంటూ
పరమేశ్వరరావు వెళ్ళి "ఆయన ఎవరితోనో మాట్లాడు
తున్నారు. ప్లీజ్ ! వెయిట్ ఫర్ సే ఏ క్వార్టర్ ఆఫ్
యనవర్."

"సరే"

అయితే మీకు టిఫిన్—కాఫీ పంపమంటారా ?

"డోంట్ ట్రబుల్ యువర్ సెల్ఫ్."

"నో మెన్షన్ ! నో ట్రబుల్ ఎట్ ఆల్ అని"
"బాయ్" అన్నాడు.



'సార్ !' అంటూ ప్రక్కనే నిలబడ్డాడు వెయిటర్.

"ఈవిడకు టిఫిన్-కాఫీ ఇయ్యి బిల్లు నేనిస్తాను."

ఆ వెయిటర్ "అలాగే సార్" అంటూ వెళ్ళాడు.

రాజావీర వెంకటసత్యనారాయణరావు గారు ప్లేయర్స
క్లబ్బుకు వచ్చి మహాకవి మార్తాండశాస్త్రిని కలుసుకొన
డానికి ముందు బుక్ సెంటర్ హౌస్‌కి వెళ్ళి గార్డెనింగ్ హార్టి
కలర్స వగైరాల మీద పుస్తకాలేమన్నా వున్నాయా అని
అడిగాడు.

రెండు పుస్తకాలు కొన్నాడు. టైము చూసుకున్నాడు
మహాకవిగారు తన కోసం వెయిట్ చేస్తుంటారని గ్రహించి
కారులో కూర్చున్నాడు. అయితే బుక్ సెంటర్‌లోనే కళ్ళ
జోడు కాస్తా మరిచిపోయాడు. కారు దిగగానే కళ్ళజోడు లేక
పోవడంతో క్లబ్బు మెట్లమీద తూలి పడ్డాడు.

డ్రైవరు చూసి కారులోంచి దిగి లోపలికి తీసుకు
వెళ్లాడు. అక్కడే ఒక కుర్చీలో కూరున్న పరమేశ్వరరావు
మీద పడ్డాడు రాజాగారు.

"సారీ! సారీ! మీకు ఏమైనా డామేజ్ కాలేదు కదా"
అని అడిగాడు.

"ఏమీ కాలేదులెండి" అన్నాడు పి. పి. రావు.

"నా కళ్ళజోడు ఎక్కడ మర్చిపోయివచ్చానో గుర్త
లేదు బాబూ! కళ్ళజోడు కనబడకపోతే గబ్బిలంలా నేన
పగలు ఏమీ చూడలేను."

ఇంతలో సుమారు 35 ఏళ్లున్న వ్యక్తి వచ్చి
"నమస్కారం" అన్నాడు.

"నమస్కారం అని బదులు చెప్పాడు రాజాసాబ్.

"మార్తాండశాస్త్రిని నేనేనండి" అంటూ అ
మెల్లగా ఆయన చెవిలో గొణిగాడు.

"అలాగా! మంచిది. మనం ఓ టేబుల్ దగ్గ
కూర్చొని మాట్లాడుకుందాం" అన్నాడు రాజాసాబ్.

పరమేశ్వరరావు రాజాసాబ్‌ను తన టేబుల్ దగ్గ
తన కుర్చీలోనే కూర్చోపెట్టి ప్రక్క టేబుల్ దగ్గరవున్న
మరో కుర్చీలాగి "ఇలా కూర్చోండిసార్." అంటూ వెయ
టర్‌ని పిలిచాడు.

"వెయిటర్! ఆయనెవరు?" అని అడిగాడు.

"రాజాగారిని కలుసుకోడానికి బరంపురంనించి వచ్చా
రండి! ఆయన పేరు మార్తాండశాస్త్రిగారట"

"మైగాడ్! ఈయనేనా మహాకవి" అంటూ బయట
వెళ్ళి సిగరెట్ ప్యాకెట్ కొని రాజాగారిని కలుసుకోవా



వచ్చి వర్షానికి జడిసి తడిసి పోకుండా తను తస్కరించిన గొడుగులో తీసుకువచ్చాడు.

వెయిటింగ్ రూంలో కూర్చుని టిఫిన్ ఆరగిస్తున్న సుజాత "ఏయ్! మిస్టర్ ఇంకా వాన కురుస్తోంది. ఈ గొడుగులో యింటికి వెళ్లి రేపు ఉదయం తిరిగి పంపిస్తాను. మీ అడ్రసు" అంది సుజాత

శ్రీ గురునాథరావుగారు- కేరాఫ్. ప్లేయర్స్ క్లబ్ అని పంపండి చాలు."

"మీ పేరు గుర్నాథరావా?"

"సారీ! నా పేరు గుర్నాథరావు కాదు. ఆ గొడుగు యజమాని పేరు."

ఇంతలో గుర్నాథరావు హాలులో నిలబడి తన గొడుగు పోయిందని రంకెలు వేస్తున్నాడు. పరమేశ్వరరావు వెళ్లి "ఏమిటండీ రావు గారూ! గందరగోళ పడుతున్నారు?" అన్నాడు.

"నా గొడుగు తీసుకు వెళ్లావటగా! ప్యూన్ చెప్పాడు. ఇంకా గందరగోళం పడుతున్నానంటా వేమిటి?"

తీసుకున్నమాట నిజం. కాని అది మీదని తెలియదు. నాకు సిగరెట్ స్మోకింగ్ అలవాటు. నేను మీదని తెలియక పోయినా ఆ రూములోవున్న గొడుగుల్లో ఒకటి తీసుకుని షాపుకి వెళ్ళి సిగరెట్లు ప్యాకెటుకొనే సరికి అక్కడ ఒక

బ్యూటిఫుల్ గరల్ కనిపించింది. ఆ చిక్కుల్లో పడ్డ చిన్నారి చీరతో సహా తడిసి పోతున్నా నంటే పాపం అని జాలిపడి మీ గొడుగు ఇచ్చాను. రేపు ఉదయానికి మీకు అందు తుంది. కాస్త శాంతం వహించండి. కొత్తది కావాలంటారా ఈ క్షణంలో కొని యిస్తాను.

"నాది నలభై రూపాయలకు కొన్న ఫస్టుక్లాసు గొడుగు. నీ బోడి గొడుగు పాతిక్కి-ఇరవైకి కొన్నది ఎవరికి కావాలి? అయినా నాగొడుగు దానం చేయడాని నువ్వెవడివోయ్?" అని అడిగాడు తీక్షణంగా.

"ఇదుగో! ఓయ్, గీయ్ అనమాకండి. మర్యాదగా నేను చెప్పింది వినండి. నేను దానం చేయలేదు- అరువిచ్చాను. దానం చేయడానికి అరువు ఇవ్వడానికి చాలా తేడా వుంది అంటూ తీవ్రంగానే జవాబిచ్చాడు పరమేశ్వరరావు.

పి. పి. రావు ఒట్టి కాకీరకం అని ఇదివరకే తెలిసి గురునాధరావు ఇతగాడితో వాదన పెంచుకోవడం దేనికి "ఆల్ రైట్! రేపు మార్నింగ్ కి ఎలాగైనా అందేటట్లు చూడు." అంటూ తన దారిని తను చక్కా పోయాడు ఇంక అట్టే ప్రసంగించకుండా.

రాజా వీర వెంకటసత్యనారాయణ రావు గారికి తన కవితల సంపుటి అంకితమిచ్చి సత్కారం పొందాలని ఆశి చాడు మహాకవి మార్తాండశాస్త్రి.



తను వ్రాసిన కవితలు వినిపించాలని ఉవ్విళ్ళూరాడు. అవి వరదలా ఉదరగోళంనుంచి పొంగిపొరలి బయటకు వస్తున్నాయి.

"మిస్టర్ శాస్త్రీ! కడుపునిండా తినండి. నేను రావడంలో కొంత ఆలస్యం జరిగింది. బుక్ సెంటర్ లో గార్డెనింగ్ మీద పుస్తకాలు రెండుకొన్నాను. మీకు గులాబీలంటే ఇష్టమేనా?"

"అయ్యో! గులాబీలంటే ఎవరి కిష్టం ఉండదు? పువ్వుల్లో రాణీపువ్వుగదా! అందుకే దానిమీద ఒక వచన గేయం రాశాను.

"ముళ్ళున్నా వాసన తరగని గులాబీల

సుగంధం ఎవరికి తెలియదు ?

"ఆగండి! నా తోటలో 11 రకాల గులాబీలున్నాయి. ప్రత్యేకంగా కడియంనర్సరీ నుంచి తెప్పించాను. మీరు చూసి తీరాలి."

"తప్పకుండా చూస్తాను. మురికి వాడలమీద ఒక కవిత వ్రాశాను. దాన్ని "విభాతం" పత్రికవాళ్ళు ప్రచురించి పాతిక పంపారు."

"మల్లెలు-మొల్లలు – పారిజాతాలు – సన్నజాజులు. నైట్ క్వీన్ లున్నాయి మన తోటలో" రాజాగారు తన ధోరణిలో తను చెప్పుకు పోతున్నారు.

మార్తాండశాస్త్రికి ఒళ్ళు మండింది. "ఈ ముసలాడి[కి] తన గొడవే తనదిగాని నా మాటవిని చావడు—నా కవితలు వినడు. ఏం గార్డెన్ క్రేజీ! ఛీ! చెవిటి మాలోకంలా వున్నాడే" అనుకున్నాడు మంటగా.

ఇంతలో "కుమారి సుజాతగారు మీ కోసం వెయిట్ చేస్తున్నారు" అన్నాడు వెయిటర్.

"వెయిటర్! రోడ్డు కవతలవైపున షాపులా క[న]పిస్తోంది. ఏ షాపు అది?" అని అడిగాడు రాజాసాబ్.

"అది పూల అంగడి సార్."

"మైగాడ్! మిష్టర్ శాస్త్రి! జస్ట్ ఒన్ మినిట్." అంటూ కారు డ్రైవరు చెయ్యి పట్టుకొని రోడ్డు కావల వైపునున్న ఆ పూల అంగడిలోకి వెళ్ళి పూలరకాలు ప[రి]శీలిస్తూ పావుగంట గడిపాడు. ఈలోగా పి. పి. రావు కా[ఫీ] కప్పు చేత్తో పట్టుకుని వచ్చి రాజాగారి కుర్చీ ఖాళీగా వుండ[డం] గమనించి అందులో తనే కూర్చుని "రాజాగారు ఎక్కడికి వెంచేశారు?" అని అడిగాడు శాస్త్రిని.

"అదిగో ఆ పూల అంగడిలో వున్నాడు. ఆయన మీకు స్నేహితులా!" అని అడిగాడు మార్తాండశాస్త్రి.

"ఏదో కొద్ది పరిచయం."

"ముసలాడికి పూలపిచ్చి జాస్తిలా వుంది. వీడితో 15 రోజులు ఎలా గడపనాని నా కవితా సంపుటి "వాడలా



పేటలా!" అన్నది వీడికా అంకితమిచ్చేది? ఛీ! ఛీ! పిచ్చి మాలోకం నేను ఇప్పుడే పోతాను. రేపు విజయవాడలో సన్మానముంది. నా కవితాగానముంది. ఈ వృద్ధజంబుకంతో పూనమల్లి వెళ్ళి ఎవడుంటాడు? ఛీ! ఛీ!" అంటూ బయటకి వచ్చేసి వెళ్ళి టాక్సీని పిలిచి సెంట్రల్ అంటూ ఎక్కి కూర్చున్నాడు.

## 7

మహాకవి మార్తాండశాస్త్రి వెళ్ళిపోగానే సుజాతని కలుసుకోవడానికి వెయిటింగ్ రూమ్‌కి వెళ్ళాడు పరమేశ్వరరావు. ఇంతలో బుక్ సెంటర్ వాళ్లు రాజావీరవెంకటసత్యనారాయణగారికి బాగా ఎరుగుదురు కనుక ఆయన మరిచిపోయిన కళ్ళజోడును నౌకరుచేత అక్కడికి పంపించారు.

అది పెట్టుకునే సరికి ఎక్కడలేని ఉత్సాహం వచ్చింది రాజాగారికి. సుజాతను చూసి పలకరిస్తూ "అమ్మాయి, నాకు తగని మతిమరుపు. కళ్ళజోడు బుక్ సెంటరులో మర్చిపోయాను. పాపం వాళ్లు పంపించారు. మీరు నాతో కారులో వస్తారా?" అని అడిగాడు.

రేపో ఎల్లుండో వస్తాను. నా చీరలన్నీ లాండ్రీలో వున్నాయి. అవి రేపు సాయంత్రానికిగాని రావు" అన్నది సుజాత.

"సరే! మీ యిష్టం. మహాకవి మార్తాండశాస్త్రి

ఇవాళ నాతో వస్తాడు. ఈమారి మహాదేవి అనే కవయిత్రి ప్రస్తుతం మా యింట్లోనే వుంది. మీరు రేపురండి. వస్తే రేపట్నించే మీ కా జీతం లెక్క. నెలకి నాలుగు వందలు యిస్తాను. మా పుస్తకాల కేటలాగు తయారు చేయడానికి 2 నెలలుగాని, మూడు నెలలుగాని పడుతుందని నా అంచనా. మీకు అడ్వాన్స్‌గా వందరూపాయలు" అంటూ ఓ పచ్చ నోటు ఆమె చేతిలో పెట్టాడు.

ఆమె థాంక్స్ అంటూ ఆ డబ్బు తీసుకుని పర్సులో పెట్టుకుని ఆటో రిక్షా ఎక్కి హస్నాబాను గారింటికి వెళ్లి తనకి ఉద్యోగం కుదిరిందని చెప్పడానికి వెళ్లిపోయింది.

రాజాసాబ్ లోపలికి వచ్చేసరికి మార్తాండశాస్త్రి కూర్చున్న కుర్చీలో కూర్చున్నాడు పరోపకారి పరమేశ్వర రావు.

"మిష్టర్ శాస్త్రి! క్షమించాలి. మిమ్మల్ని అనవసరంగా కూర్చో పెట్టాను. నాకు పూవులంటే తగని మక్కువ" అన్నాడు.

తెలుస్తూనే వుంది. మీరు ఆ పూల అంగడివాడితో మాట్లాడిన తీరు గమనిస్తూనే వున్నాను."

ఆ తర్వాత సుజాత అన్న యువతితో మాట్లాడటానికి దగ్గర దగ్గర పది నిముషాలు పట్టింది. క్షమించండి."

"మీరు పెద్దవారు అంతమాట అనకండి." అన్నాడు పి. పి. రావు.



కళ్ళజోడు లేక పోవడంవల్ల మార్తాండశాస్త్రిని- పి. పి. రావుని పేర్లు అడిగి తెలుసుకోని పొరపాటో ఏదో గాని పి. పి. రావునే మార్తాండశాస్త్రి అనుకున్నాడు రాజా గారు.

దానికి తగినట్టే ఆ యింట్లో ప్రవేశానికి పథకాలు ఆలోచిస్తున్న పి. పి. రావుకి అతను సరాసరి "శాస్త్రిగారూ!" అని పిలవడంతో పరమానంద భరితుడయ్యాడు, దానికి తగినట్టే కోపంతో మార్తాండశాస్త్రి వదిలి వెళ్ళిన కవితలు అతని జేబులోకి దారి తీశాయి.

"మీ కవితలు వినిపించుదురుగాని, పూనమల్లి నా కారులో రండి.

ఇప్పటికే చాలా టైమయింది. సిగర్ తెప్పించనా, సిగరెట్లు తెప్పించనా।

"సిగరెట్లే కాలుస్తాను. చుట్టలుకూడా కాలుస్తాను. కాని స్పెన్సర్ చుట్టలే కాలుస్తాను."

"మీ కవితలు అచ్చయినాయా?"

"ఏవో కొన్ని మాత్రం మీకు ఒక సంపుటి అంకిత మిద్దామనుకుంటున్నాను." అంటూ కోపావేశంలో అక్కడే పడేసి పోయిన మార్తాండశాస్త్రి కవితలు జేబులోంచి తీశాడు.

"వాడలా। ఇవి మురికి వాడలా। పేటలా ఇవి మురికి పేటలా।" అన్నది చదువుతాను వింటారా?"

"నాకు అభ్యంతరం లేదు కాని మనం అక్కడికి వెళ్లాక రేపు సాహితీగోష్ఠి ఏర్పాటు చేస్తాను. మీరు-మహాదేవిగారు మీ కవితలు వినిపింతురుగాని."

"సుజాత గారు మనతో వస్తారా?"

"ఆవిడ రేపు వస్తానంది."

"బాయ్! స్టేట్ ఎక్స్‌ప్రెస్ 555 ఒక టిన్ను తీసుకురా" అని ఇరవై రూపాయల నోటిచ్చి పంపాడు రాజాసాబ్. ఆ టిన్ను రాగానే పి. పి. రావుకిచ్చి మనం కాస్త కాఫీ త్రాగి పోదాం" అన్నాడు.

ఇద్దరూ కాఫీ త్రాగి కబుర్లు చెప్పుకుంటూ 5 గంటలకు కారులో కూర్చున్నారు. డ్రైవరు పూనమల్లి వైపు పోనిచ్చాడు.

మార్తాండశాస్త్రి సెంట్రల్‌కు వెళ్లిపోయాడు. ఇక రాడు కనక నిశ్చింతగా నిర్భయంగా మహాకవి మార్తాండ శాస్త్రిగా తనే వ్యవహరించినా అడిగే వాడుండడు. ఆయన వదిలి వెళ్లిన కాగితాలలోని గేయాలు బట్టీపట్టి అప్పగించేయవచ్చు. కుమారరాజాను కలుసుకుని నెక్లెసు అపహరణావకాశాలు పరిశీలించవచ్చు." అని మనసులోనే మహదానంద పడిపోతున్నాడు పి. పి. రావు.

"మీకు ఆనందభవనంలో కావాలంటే ఓ గది స్తా . లేదా విడిగా వుండాలంటే ఔట్ హౌస్ కాళీగానే



వుంది. అది మీ బసకు ఏర్పాటు చేస్తాను." అన్నాడు రాజాగారు.

"మీ యిష్టానుసారం చెయ్యండి సార్." అన్నాడు పి. పి. రావు.

స్టేట్ ఎక్స్‌ప్రెస్ సిగరెట్ అంటించాడు పి. పి. రావు తన జీవితంలో చార్మినార్, పనామాలు తప్ప ఏనాడూ స్టేట్ ఎక్స్‌ప్రెస్ కాల్చి ఎరుగని పి. పి. రావు.

"ఇంక త్రీ కాసిల్స్ సిగరెట్ టిన్ తెప్పిస్తే చాలు. బహుశ రాజాగారు కాస్త విస్కీ రుచి చూడకపోతారా? ఆయన కాకపోతే మానె అక్కడ విస్కీ-బ్రాందీలు రుచి చూసే వాళ్ళే దొరక్కపోతారా? అనుకున్నాడు సాలోచనగా పి.పి. రావు.

"మీరు కవిలా కనిపించరు. కవిలా మాట్లాడరు. ఏమిటి కారణం?" అని అడిగాడు రాజాగారు.

"కవి ఎలా మాట్లాడుతారు?"

మీరు మిస్ మహాదేవిని చూశారుగాదు. అయినా వెళ్లాక చూస్తారుగా! మొన్న తోటలో పూల మొక్కల పెంపకాన్ని గురించి తోటమాలి సుందరానికి చెబుతూంటే ఆ కవయిత్రి అక్కడకి వచ్చింది.

"దేవతల కన్నీటి చుక్కలే చెట్ల ఆకులమీద హిమ

బిందువులు" అని ఒక పద్యంలో రెండులైన్లు చదివి "రా
గారూ! మీరు ఏకీభవిస్తారా ఈ భావంతో" అని అడిగిం
"మిస్ మహాదేవి ఆనందభవనంలో వుంటుందా ?"

"ఆహా! 15 రోజులనించీ వుంటోంది. నా చెల్లె
తగని సాహిత్యవుపిచ్చి పట్టుకుంది లేకపోతే నానా అప
శపు రచయితల్ని-రచయిత్రుల్ని ఎందుకు ఆహ్వానించి భవ
మంతా నింపుతుంది. ఆఫ్ కోర్స్! అపభ్రంశంలో మిమ్మల్
కూడా చేర్చాను. క్షమించండి. మీ మాట వేరు-మీలో
ప్రత్యేకత వుంది. మిమ్మల్ని కలుసుకోనడమే సంతోషం
అన్నాడు రాజా వీర వెంకటసత్యనారాయణరావు.

"అయితే ఆనందభవన్‌లో ఎవరెవర్ని కలు
కోవాలి?" అని ప్రశ్నించాడు పి. పి. రావు. మార్తా
శాస్త్రిగా చలామణి అవుతున్న పరోపకారి పరమేశ్వరరా

"ఎవర్నీ కలుసుకోనక్కర్లేదు. నన్ను-మా చెల్లె
పుష్పావతిని-అంతరాష్ట్రీయ ఆంతర్భాషా కవయిత్రి మి
మహాదేవిని."

"మిస్ అంటున్నారు ఆమె వయస్సెంత వుంటుంది

"ఓ ముప్ఫయి అయిదో-ముప్ఫయి ఆరో వుం
యని నా అంచనా."

"రైటో" అన్నాడు పి. పి. రావు.



కారు బాక్ సీటులో కాళ్ళు చాచుకుని పడుకోబోతే ఆ కాళ్ళు తన మీదుగా పోయే ప్రమాదం ఏర్పడనున్నదని గ్రహించిన పి. పి. రావు. "మీరు కాళ్లు చాపుకుని పడుకోండి. నేను ఫ్రంట్ సీటులో కూర్చుంటాను" అన్నాడు. అలా అన్నవాడై కారు ఆపనక్కర్లేకుండానే బాక్ సీటులోంచి ఫ్రంట్ సీటులోకి తన బ్రీఫ్ కేస్‌తోపాటు దూకాడు.

బ్రీఫ్ కేస్ తెరచి తాను బుక్ సెంటర్‌కి పరుగెత్తి కొన్న మహాకవి మార్తాండశాస్త్రి ఖండకావ్యాలున్న రెండు పుస్తకాలు తీశాడు. అవి చదవ నారంభించాడు. "నేను కవిని. అవ్యంతాలను గానంచేసేను కవిని." అన్న రెండు లైన్లు చదివి "పుస్తకంచూసి చదవడమేగా! అనవసరంగా ఇప్పట్నుంచి కంటికి శ్రమ ఇవ్వడం దేనికి ?" అనుకొని ఆ రెండు పుస్తకాలూ బ్రీఫ్ కేసులోనే పడేసి కళ్లు మూసుకుని కూర్చున్నాడు.

కారు మాత్రం మంచి స్పీడ్‌గా పోతోంది. పూనమల్లి ఇక రెండు ఫర్లాంగులు వుండనగా ఇంజన్ ట్రబుల్ సంభవించింది. డ్రైవరు వేలాయుధం తనకి తెలిసిన దగ్గరలోనేవున్న ఒక మెకానిక్కును పిలుచుకువచ్చి. కారు రిపేరు చేసే సరికి పెట్రోలు అయిపోయింది! పెట్రోలు బంకు దగ్గరకు కారుతోసుకుంటూ వెళ్లి పెట్రోలు పోయించుకునే సరికి మరో గంట. ఎలాగైతేనేం! పూనమల్లిలోవున్న ఆనందభవన్ ఆవరణలో కారు ఆగే సరికి రాత్రి ఎనిమిదిన్నర అయింది.

పుస్తకం దయవుంచి ఏదైనా సందేశం వ్రాసి సంతకం చేయండి. అంది కుమారి మహాదేవి.

మార్తాండశాస్త్రి వ్రాసిన కవితా సంపుటంలో తాను చదివిన మొదటిదైన

"అది నిర్మేఘ మాసాభ్రవీథి
ఇదినిస్తులా నంద తారకా
మణిహార విలసితంబైన
చైత్ర బహుళ మాస నిశీథిని."

అని వ్రాసి పి. ఎస్. మార్తాండశాస్త్రి-మహాకవి-కవి కోకిల-కవికుంజరేత్యాది బిరుదాంకితుడు అని వ్రాశాడు.

'నిర్మేఘ మాసాభ్ర వీథి' "ఆహా! ఎంత చక్కని కవిత! అభ్రవీథి! అంటే!" అని అడిగింది.

అభ్రవీథి అని అప్పగించాడేగాని అర్థం తెలియని పి. పి. రావు ఆవలించి "అబ్బ! కారు ప్రయాణంలో నడుము విరిగి నట్లయింది" అన్నాడు.

శర్మ నౌకరు కుర్రవాడితో ఆరు కప్పుల కాఫీ తెప్పించాడు. ట్రేలో-అందరికీ తలా ఒక కప్పు అందించాడు.

"మాఘ మాసాభ్ర వీధి అంటే అర్థం కాలేదా! అభ్ర అంటే ఆకాశం కదూ." అంది పుష్పావతి.

"రక్షించింది" అనుకున్నాడు పి. పి. రావు.



"సరేగాని ఇక భోజనాలు జేద్దాం" అన్నాడు రాజా వీరవెంకటసత్యనారాయణరావు.

"శర్మగారూ భోజనాల ఏర్పాటు చూడండి" అంది పుష్పావతి. శర్మ మరోసారి పి. పి. రావుకేసి తీక్షణంగా చూసి లోపలికి నడిచాడు వడిగా.

"స్నానం చేస్తారా? వేడినీళ్ళు వున్నాయి." అన్నాడు నౌకరు.

"చేస్తాను." అని జవాబిచ్చాడు పి. పి. రావు.

అరగంట ముందు వచ్చిన లక్ష్మీకాంతారావు స్నానం చేసి తల తుడుచుకుంటూ వస్తూ పి. పి. రావుని చూసి "హల్లో!" అన్నాడు. అతని సంబోధనలో భయంతోంచింది. ఈ పి. పి. రావు తనని డబ్బుకోసం బ్లాక్ మెయిల్ చేస్తాడేమోనని.

"ఇష్!" అన్నాడు రావు.

"ఒరే బాబూ! మహాకవి మార్తాండశాస్త్రిగారికి మేడమీద రెండో అంతస్థులో గది ఇయ్యి. రేపు ఉదయం జౌట్‌హౌస్ తుడిపిస్తాను. అక్కడ వుంటారాయన. ప్రశాంతంగా వుంటేగాని కవిత్వం రాయలేరు గదా" అన్నారు రాజాగారు.

"పి. పి. రావును పట్టుకుని మహాకవి మార్తాండ శాస్త్రిగా చెబుతాడేమిటా?" అని ఆశ్చర్యపోయాడు కాంతారావు.

# 8

రాజాగారు-మహాకవి మార్తాండశాస్త్రిగారు వచ్చారనవి
భోజనానంతరం మిస్. మహాదేవితో టీ త్రాగుతున్న
పుష్పావతి శర్మ వగైరా అమాంతంగా ఇవతలకి వచ్చార

"నా మొక్క-లెలా వున్నాయో!" అంటున్న రాజా
గార్ని చూసి విసుక్కు-ంది పుష్పావతి.

"వాసన తెలుస్తుందికదా! ఇదుగో నువ్వు ఆహ్వా
నించిన మరో కవి మార్తాండశాస్త్రిగారు" అంటూ పరిచయ
చేశాడు వీర వెంకటసత్యనారాయణరావు.

"నమస్కా-రం! చివరకు మీరు రావడం నా
బ్రహ్మానందం కలిగించింది. శర్మగారూ! కవిగారికి ముం
కాఫీ తెప్పించండి" అంది పుష్పావతి.

రాత్రి తొమ్మిది గంటలకుకూడా కళ్ళజోడుతో
ప్రత్యక్షమయిన శర్మ కళ్ళజోడు అద్దాల్లోంచి నిశితంగ
చూశాడు.

ఆ చూపు తన గుండెల్లో దాచుకున్న అబద్ధా
చీల్చి చెండాడేటట్లుగా భావించినవాడై "నేను శాస్త్రి
కాదని వీడు గ్రహించాడా? లోగడ శాస్త్రిని చూ
వుంటాడా?" అని కంగారు పడ్డాడు పి. పి రావు.



"ఇదుగో కవయిత్రి మహాదేవి" అంటూ పరిచయం చేసింది పుష్పావతి.

"చివరకు మీరు వచ్చారు - సంతోషం" అంది మహాదేవి.

చివరకు - చివరకు అంటూ ప్రతివారినోటి వెంట వస్తున్న మాటలు అర్థంకాక సతమతమయ్యాడు మార్తాండ శాస్త్రిగా మారిన పి. పి. రావు.

ఇప్పటికి ఇద్దరు చివరకు-చివరకు అన్నారు. ఈ చివరకు అన్నమాటలోని ఆంతర్యం ఏమిటి? ఏదో కారణం లేందే వీళ్లు ఇన్నిసార్లు ఎందుకంటారు?" అని మథన పడ సాగాడు పి. పి. రావు.

ఆ రోజు సాయంత్రం 5 గంటలకు రైలు స్టేషన్‌నుంచి పూనమల్లిలోని ఆనందభవన్‌కి ఫోనుచేసి "నా రాక-నా ఉనికి రద్దు చేసుకుని విజయవాడ వెళ్లిపోతున్నాను." అంటూ ఫోన్ చేశాడు మహాకవి మార్తాండశాస్త్రి.

అన్నగారు సరిగా మర్యాదచేసి వుండడని చాలా బాధ పడింది పుష్పావతి. టెలిఫోన్ మెసేజ్ అందుకున్న శర్మ అందుకే అనుమానంగా చూశాడు. అది తెలియక పి. పి. రావు తికమకలో పడ్డాడు.

మీ రచనలు-మీ కవితలు చదివాను. మిమ్మల్ని చూశాను. చాలా సంతోషం. ఇదుగో ఆటోగ్రాఫ్

అయినా పైకి కనిపించనీయకుండా "మిష్టర్ ! నా గదిలోకిరండి. స్నానంచేసి. అక్కడ యిద్దరం మాట్లాడుకుని భోజనానికి క్రిందికి దిగుదాం" అన్నాడు లక్ష్మీకాంతారావు.

"వీడు మార్తాండరావు కాదు" అంటూ ఎక్కడ చెబుతాడో అని హడలిపోయిన పి. పి. రావు నీళ్ళన్నీ ఒక్క సారి గుమ్మరించుకుని తాను ఆ సాయంత్రమే-ప్లేయర్స్ క్లబ్బు పక్కనేవున్న రెడీమేడ్ బట్టల షాపులో ఒకలుంగీ. ఒక పైజమా ఒక షర్టు వాటిని పెట్టుకోవడానికి ఓ సెకండు హ్యాండ్ బ్రీఫ్ కేసు కొన్నాడు.

పరోపకారి పరమేశ్వరరావు లుంగీ ధరించి తిన్నగా మొదటి అంతస్తులోని కాంతారావు గదికి వెళ్ళాడు,

"నిన్న మా నాన్నగారు మహాకవి మార్తాండశాస్త్రి అన్నారేమిటి కథ?" అని అడిగాడు కాంతారావు.

"అదంతా ఒక పెద్ద కథ. వింటానంటే చెబుతాను."

"చెప్పండి."

"పి. పి. రావు ప్లేయర్స్ క్లబ్బులో నాన్నార్ని కలుసుకున్న మార్తాండశాస్త్రి తన కవితాగానానికి అవకాశం ఇవ్వనందుకు కినిసి టాక్సీమీద సెంట్రల్ స్టేషన్‌కి పోవడం. తన్నే మార్తాండశాస్త్రిగా కళ్ళజోడు దొరికిన మీదట రాజాగారు అనడం- సవివరంగా చెప్పాడు. అంతా చెప్పాక

"సరేగాని. మీ మేనత్త మెడలోవున్న హారమేనా అపహరించాల్సింది ?"



"అవును."

"దొంగిలిస్తాను. దానికేం ఢోకా లేదు. ఇంతకు ముందు ఎక్కడా దొంగతనాలు చేయకపోయినా యిప్పుడు చెయ్యగలననే ధైర్యం విశ్వాసం వున్నాయి. దొంగలించాక ఏం చెయ్యాలి?"

"నాకు తెచ్చి ఇవ్వాలి."

"తెచ్చి ఇచ్చాక మీరేం చేస్తారు?

"మా మామయ్య రామకృష్ణప్రసాద్ కిస్తాను.

"ఆయనేం చేస్తారు ?"

"ఆ హారంలోని వజ్రాలు తీయించి అమ్మేస్తే 14, 15 వేలు వస్తుంది. కాసుధర ఎలా పెరిగిపోయిందో తెలుసా! పదివేలు మా వదిన రత్నప్రభ కిస్తారు. ఓ రెండు వేలు నా కిస్తారు. నా కిచ్చేదానిలో నీకు అయిదు వందలు ఇస్తాను."

"రత్నప్రభ ఎక్కడ వుంది? ఆమె నీకు వదినా !"

"అవును. మద్రాసు నుంగంబాకంలో వుంటుంది. ఆమెభర్త మల్లేశ్వరరావు నానా ఇబ్బందులూ పడుతున్నారు. అతడు పొలంకొని స్వంత వ్యవసాయం చేసుకుంటాడు. ఈ బడిపంతులు ఉద్యోగం మానేయాలని అతని అభిప్రాయం. అప్పుడు హాయిగా బ్రతుకుతారు. నేను గిండీ రేస్ కోర్సులో ముసలి రెడ్డిషానే బుకీగా వుంటాను లేదా పార్ట్‌నర్ గా చేరుతాను. వేలు సంపాదించుకుంటాను."

రత్న-మల్లిక్ నాకు బాగా తెలుసు. వాళ్ళ యింట్లో నేను చాలాసార్లు భోజనం చేశాను. మొన్నకూడా వాళ్ళ యింటికి వెళ్ళాను. వాళ్ళకి డబ్బు ఇవ్వడం కోసమే మీ అత్తయ్య నక్లెసు దొంగిలించాలంటే నువ్వు నా కేమీ యివ్వక్కర్లేదు. ఫ్రీ సర్వీస్- అన్నాడు పి. పి. రావు ఆవేశంగా.

"నీకు ముట్టచెప్పేది నువ్వు వాడుకో. ఎలాగైనా నెక్లెసు కొట్టెయ్యడానికి చూడు. ఆ తర్వాత మా అత్త ఏడిస్తే మామయ్య కొత్త నెక్లెసు తీయించిన ఈ వజ్రాలు అమర్పించి ఇస్తాడు."

"రైటో."

అయితే నిన్ను మిస్టర్ మార్తాండశాస్త్రి అనే పిలుస్తాను. ఏమైనా మందు అలవాటుందా?"

"కొంచెం."

లక్ష్మీకాంతా రావు బీరువాలోంచి విస్కీ సీసా తీసి, కూజాలో నీళ్ళు కలిపి ఓ గ్లాసు పి. పి. రావు ముందుంచి మరో గ్లాసులోది తాను గడగడా త్రాగేశాడు.

"అమ్మయ్య. ఇప్పుడు నీ యిష్టం వచ్చినన్ని పద్యాలు రాస్తాను. నేను వచన కవితలో స్పెషలైజు చేశాను."

"నీ కవిత్వ పైత్యమంతా వర్ణించవలసింది అత్తయ్య దగ్గర. నా దగ్గర కాదు. రా భోజనానికి పోదాం" అన్నాడు కాంతారావు ది గ్రేట్ కుమార రాజా ఆఫ్ ఆనందభవన్ ఫేమ్.



# 9

డైనింగ్ టేబుల్ దగ్గర కూడా శర్మ తన కళ్ళజోడులోంచి తనని చూస్తూన్న తీరును చూసి పి పి. రావు కొంచెం తొట్రుపడ్డాడు. రాజావీర వెంకటసత్యనారాయణరావు భోజనం చేయగానే తోటలోకి నడిచాడు.

"శాస్త్రీజీ ! మనంకూడా తోటలోకి వెళ్ళి రాజా గారిని చూద్దామా రాత్రిపూట పూల సువాసనలు ఆఘ్రాణిస్తే మనస్సు ఆనంద లోకాల్లో విహరిస్తుంది కదా!" అంది కవయిత్రి కుమారి మహాదేవి.

"ఓహో! ఈ విడగారు కవిత్వంకూడా వెలగబెడుతోందే సంభాషణల్లో అనుకున్నాడు పి. పి. రావు.

"అవును నిజమే ! పూల సౌరభం ఆధ్యాత్మికంగా మనస్సును మహోన్నత శిఖరాలకుగొని పోతుంది కదండీ" అన్నాడు పి. పి. రావు.

ఆహా! ఎంత గొప్పగా చెప్పారు. శాస్త్రిగారూ! అంది మహాదేవి.

హాలులో శ్రీమతి పుష్పావతిదేవి శర్మతో "చాలా గొప్పవాడు అంది."

"ఎవరి మాట?"

"మహాకవి మార్తాండశాస్త్రి."

"అవును. చాలా గొప్పవాడే."

"మా అన్నయ్య మర్యాదలో ఏదో లోపం వచ్చి వుంటుంది. కనుకే ముందు రానని టెలిగ్రాం ఇచ్చి ఆ తర్వాత బాగుండదనుకున్నాడో ఏమో మనస్సు మార్చుకుని వచ్చాడు."

"అలాగే కనిపిస్తోంది." అని జవాబిచ్చాడు శర్మ.

శ్రీమతి పుష్పావతి దేవి మేడమీదకు వెళ్ళిపోయింది.

దీపం ఆర్పేసి శర్మ ఒక్కడూ గడ్డం క్రింద చెయ్యి పెట్టుకుని కూర్చున్నాడు. ఆ చీకటిలో అతని మెదడు మాత్రం జెట్ విమానం ఇంజనులా పని చెయ్యసాగింది.

ఆ మర్నాడు ఉదయం "సుజాత గారు మధ్యాహ్నం మూడు గంటలకు యిక్కడకు చేరుకుంటామని ఫోన్ చేశారు" అన్నాడు శర్మ.

అయితే శాస్త్రిగారూ! ఆమెను రిసీవ్ చేసుకోవడానికి నేను బస్‌స్టాండుకు వెడతాను. మీరు కూడా వస్తారా? అన్నాడు రాజావీర వెంకటసత్యనారాయణరావు.

"మీ కెందుకంత శ్రమ. నేను వెళ్ళి తీసుకువస్తాను. "చిన్న కారుందిగా" అన్నాడు పి. పి. రావు. ఉరఫ్ మార్తాండశాస్త్రి.

"అలాగే తీసుకురండి. ఫియట్ కారులో వెళ్ళండి. మరచిపోకండి. పుష్పా! ఇందాకట్లో అనగా కాఫీ అడిగితే పంపలేదేం?" అన్నాడు రాజాసాబ్.



"పంపానే!" అంటూ "శర్మగారూ! అన్నయ్యకి కాఫీలు" అంది ఆశ్చర్యం అణచుకుని.

శర్మ వచ్చి "అదుగో కాఫీ కప్పుమీద నర్సరీ వాళ్ళు పంపిన కేట్లాగు పెట్టారు" అన్నాడు.

"మైగాడ్! నేను చూడనేలేదు. అంటూ కప్పు తీసుకుని కాఫీ ఒక్క గుక్కలో తాగి "సుందరం, ఆ మడిలో మల్లె అంటు నాటావా?" అన్నాడు గట్టిగా.

పి. సి. రావు ఫియట్ కారులో బయలుదేరి వెళ్ళాడు.

సుజాత అప్పుడే అక్కడికి వచ్చింది. ఆమెని చూసి వెంటనే గుర్తుపట్టిన పి. పి. రావు "వీర వెంకటసత్యనారాయణరావు గారి తరఫున నేను స్వాగతమిస్తున్నాను. కుమారి సుజాతగారూ! మనకు పెట్టె బేడా ఏమైనా వున్నాయా!"

అసలు పెట్టె బేడా లేకుండా రెండు మూడు నెలలు ఉద్యోగం ఎలా చేయడం? అదుగో క్లీనర్ కుర్రాడు బస్సు టాపు మీది కెక్కాడు. ట్రంకు పెట్టె-బెడ్డింగు దింపుతున్నాడు. మీరు దయ వుంచి అందుకుంటారా!"

దయ వుంచక్కర్లేకుండానే అందుకుంటాను. మనం పాత స్నేహితులమేగా!"

"పాత స్నేహితులమా!" అంది ఆశ్చర్యంగా ఈ లోగా పి. పి. రావు ట్రంకు అందుకుని డిక్కీలోకి తోశాడు.

"మనం ఒకసారి మద్రాసులో కలుసుకున్నాం. వావలో తడుస్తుంటే మీకు గొడుగిచ్చానుగా."

"దాన్ని మరునాటి ఉదయమే ప్లేయర్స్ క్లబ్‌లోని గురునాథంగారికి పంపివేశాను. మీరెప్పుడు వచ్చారు?"

"నువ్వు రాజాగారిని కలుసుకున్ననాడే రాజాగారితో పాటు కారులో వచ్చాను. నా ప్రక్కనే కూర్చో అన్నీ చూపిస్తాను."

ఆమె మీరు మీరు అని ప్రారంభించి నువ్వు అని ఏకవచనంలో సంబోధన మొదలు పెట్టేసరికి ఒకింత రిచ్చ పాటు చెందిన కుమారి సుజాత ఫ్రంటు సీటులో కూర్చోగానే "బస్సు ప్రయాణంలో అలసిపోయావేమో కాస్త టీ తీసుకురమ్మంటావా?" అని అడిగాడు పి. పి. రావు.

"వద్దులెండి."

"ఎందుకు మొహమాట పడతారు? నేనేం పరాయి వాడినా" అంటూ టీ రెండు బిస్కట్లు తెచ్చాడు.

ఒక్క బిస్కట్టు తింటూ టీ త్రాగి "ఇకపోదాం" అంటూ రెండో బిస్కట్టు తింటం ప్రారంభించింది.

చెంపకు చారెడు కళ్ళు, మనిషి ఒడ్డు పొడుగు, చక్కని రంగు. దేముడు ఈ అందాలబొమ్మను ఎవరికోసం సృష్టించాడో కదా; కారులో ఆనందభవన్ సమీపిస్తూ ఇదంతా రాజాసాబ్ గారి తోట. మనం వెంటనే భవనం



లోకి వెడితే శర్మ నీకు వెంటనే లైబ్రరీ పని పురమాయిస్తాడు.

"శర్మ ఎవరూ?"

"సెక్రెటరీ టూ రాజాసాబ్!" అని కారు గేటు దాటగానే ఆపకుండా కుడివైపు మళ్ళించాడు.

"ఇదంతా తోట. అవి గులాబి మొక్కలు. ఇటు బంతిపూల మొక్కలు, అదిగో మల్లెపందిరి. ఆ వెనక బత్తాయి, నారింజ, కమలా ఫలాలు చెట్లు, అది చెరువు. ఆ చెరువులో నీళ్లు గొట్టం ద్వారా తోటమాలి సుందరం మొక్కలకు పడతాడు." అంటూ కారు మేడ వెనకాల నుంచి ఉత్తరపువైపు మళ్లించాడు.

"మనం ఇవన్నీ చూస్తూ టైం వేస్ట్ చేయడం దేనికి? తోట అంతా రేపో, ఎల్లుండో ఆదివారమో చూడచ్చుగా: ముందు శర్మగారిని, రాజాగారిని చూడాలి. లైబ్రరీ చూడాలి. దయచేసి కారు గుమ్మంలో ఆపండి. ప్లీజ్" అంది సుజాత.

సుజాతను చూడగానే రాజాసాబ్ తోటలోంచి ముందుకువచ్చి ఓ మిస్ సుజాత! గుడ్ ఆఫ్టర్ నూన్! "ఈయన మహాకవి మార్తాండశాస్త్రి" అంటూ పరిచయం చేశాడు.

సరస్వతి ఇంకా హోటల్‌లోనే వుందా?"

"ఏ సరస్వతి ?"

"ఏ సరస్వతి అన్నంతవరకూ వచ్చిందా ? మీ
భార్య సరస్వతి మాట. మహాకవి మార్తాండశాస్త్రికి
భార్య. సరస్వతీ నామధేయురాలు ఉన్నట్టు ఓం ప్రథమంగా
తెలుసుకున్న పి. పి. రావు ఆ సంగతి తర్వాత మాట్లాడు
కుందాం" అన్నాడు.

"కారులోంచి ట్రంకుపెట్టె వీరయ్య తీసుకువె
లోపల ఆమెకు ప్రత్యేకించబడిన గదిలో పెట్టాడు.

"శర్మగారెవరూ ?" అని అడిగింది.

"ఆయనే" అన్నాడు మార్తాండశాస్త్రి.

"శర్మగారూ! నమస్కారం ఇప్పుడే పని ప్రారం
స్తాను. ఇవాళ మంచిది. లైబ్రరీ చూపించండి." అంది.
శర్మ చిన్న చిరునవ్వు విసిరి "రండి ఇదుగో శ్రీమ
పుష్పావతిగారు. రాజాగారి చెల్లెలు. ఈవిడ ప్రోద్బల
మీ రాకకు కారణం. అన్నాడు శర్మ.

పుష్పావతి పేరు రత్నప్రభ చెప్పగా విన్నది జ్ఞాప
నికి వచ్చి "రత్నప్రభకు తండ్రి సహాయం చెయ్యకుండ
అడ్డు పడుతున్నది ఈ మహాతల్లేనా ?" అనుకుంది సుజా

సుజాత లైబ్రరీ వున్న గదిలోకి శర్మతో వెళ్ళి
గ్రంథసాగరంలో మునిగిపోయిన తరుణంలో కాస్త విస్కీ
తాగితే బాగుండుననుకున్నాడు పరోపకారి పరమేశ్వ
రావు.



హాలులోనే తటాలున తారసపడ్డ లక్ష్మీకాంతారావు
"శాస్త్రీజీ ! ఒక్కమాట నా గదిలోకి రండి" అన్నాడు.

రావు గదిలోకి రాగానే తలుపు గడియవేసి కాస్త
మెక్డోల్ విస్కీ, చల్లని కూజా నీళ్లతో నింపిన గ్లాసు
అందించి. బ్రదర్ ! నువ్వంటే శర్మకు అనుమానంగా వుంది"
అన్నాడు.

"కొత్తగా ఏం జరిగింది ?"

"ఏం జరుగలేదులే ! వాడు నీకేసి చూస్తున్న తీరు.
అలా అనిపించింది."

కళ్ళజోడు పెట్టుకున్నవాళ్ళు ఎటు చూస్తున్నారో
చెప్పలేము. మా యింటి ప్రక్కన ఓ అమ్మాయి వుంది.
అమ్మాయి అంటే బొత్తిగా 10, 12 ఏళ్ళ పిల్లకాదు. పాతి
కేళ్లుంటాయి కళ్లజోడు అద్దాల్లోంచి చూసేది. దానికి పిల్లి
అని పేరు పెట్టాను ముద్దుగా. స్వచ్ఛంగా వున్న పెరుగు
గిన్నె కేసి కూడా అలాగే రెప్పవాల్చకుండా ఏ చీమలైనా
చచ్చాయేమోనని అనుమానంగా చూస్తాడు. అంచేత వాడి
చూపులను గురించి మనం బాధపడవలసిన పనిలేదు.

"మరోమాట ఓ కొత్త దాసీ పిల్ల వుందే !"
"అవును. ఈ రోజే పనికి కుదిరింది."
"పేరు ?"
"జయకుమారి అది డిటెక్టివ్‌లా వుంది. దాన్ని

మిస్టర్ శర్మగారే ప్రవేశపెట్టారు."

"ఓ పని చెయ్యి. అది డిటెక్టివ్ అవునో కాదో తేల్చి వేయవచ్చు."

"ఏమిటది ?"

జయా! ఎంత అందంగా వున్నావు అంటూ ముద్దు పెట్టుకో; ఒక్కసారి కావలించుకో, ఛీ. ఏం పని ? మీ అంత స్తేమిటి ? నా అంత స్తేమిటి ? అంటే అది డిటెక్టివ్: అలాకాక అయిదురూపాయలివ్వండి. మీ గదిలోకి ఎవరూ చూడకుండా వస్తాను. తుడవడానికి అన్నట్లు. అప్పుడు..." అని నసిగిందనుకో! అది దాసీ పిల్లే! సందేహం లేదు అన్నాడు.

సరే! నీ చిట్కా ప్రయోగించి చూస్తాను. ఇంకో మాట లైబ్రరీకే టలాగింగ్ కావచ్చిందే—"

"సుజాతా!"

"ఆమెతో అనుకూలంగా నన్ను గురించి ఓ మాట పడెయ్యి."

"ఆమె నిన్ను ఎరుగునా."

"చాలా బాగా ఎరుగును. ఆమె ఒప్పుకుంటే పెళ్ళి చేసుకుంటాను. నేనెప్పుడు పెళ్ళి ప్రస్తావన తెచ్చినా నవ్వేస్తుంది."

సరే, మాట్లాడి అవకాశం లభించగానే నీ గురించి



ఒకటేమిటి ? పదిమాటలు చెబుతాను. అంటూ కుమార రాజా లక్ష్మీకాంతారావు టేబుల్ మీద ఉన్న త్రీ కాజిల్స్ టిన్ను చూసి ఒకటి తీసుకుని కాలుస్తూ మరొకటి జేబులో పడవేసుకున్నాడు.

భవనం వెలుపలకి వచ్చి సిగరెట్ కాలుస్తుంటే లైబ్రరుతో పరిచయం చేసుకుని తన పని ఏమో తెలుసుకున్న సుజాత బయటకు వచ్చి, శాస్త్రిగారూ! అమృతాంజనం వుందా ? అని అడిగింది.

"అప్పుడే తలనెప్పి వచ్చిందా తల్లీ !" అన్నాడు.

"బస్సు ప్రయాణంతో తల దిమ్ముగా వుంది."

"మన దగ్గర రబెక్స్ వుంది. అది కూడా ఎఫెక్టివ్ గానే పనిచేస్తుంది. కణతలకు రాయమంటావా ?"

"వద్దు. అంతపని చెయ్యొద్దు. నా చేతికివ్వండి చాలు" అంది సుజాత రబెక్స్ అందుకొంటూ.

"అనాసిన్ కూడా వుంది కావాలంటే. వేసుకుని కాస్త కాఫీ త్రాగండి 'రండి. కాఫీ యిప్పిస్తాను." అంటూ వంటింట్లోకి దారితీశాడు పి. పి. రావు. సరిగ్గా అదే సమయంలో కాంతారావు పనిపిల్ల జయకుమారిని కావలించుకుని ముద్దు పెట్టుకుంటున్నాడు.

"మైగాడ్" అన్నాడు పి. పి. రావు.

దీనికి దేముణ్ని ఎందుకు పిలవడం ? కాంతి స్వభా

వమేఅంత. వాడు సిగ్గు, లజ్జ కాశీలో వదిలేశాడు.” అంటూ నవ్వింది.

“ఆహా! ముత్యాలహారంలా ఏమి ఆ పలువరుస” అన్నాడు పి. పి. రావు. ఆమె బుగ్గలు ఆ కాంప్లిమెంటుకు కెందామరలైనాయి.

“కాంతారావుని గురించి మీ అభిప్రాయం ఏమిటి”

“వాడు వట్టి న్యూసెన్సు. వాడిని గురించి నాకు ప్రత్యేకంగా ఏ అభిప్రాయమూ లేదు. మీరు ఒరిస్సా నుంచి వచ్చిన కవిగారేనా?”

“అవును.”

“మరి సరసు నెరగనంటారేం? ఆమె నేను బాల్య స్నేహితులం. క్లాస్‌మేట్లం కూడా.”

“సరే అదేగా నేను ఆ తర్వాత మాట్లాడుకుందాం అన్నది.” అంటూ ఆపాడు శాస్త్రి. పి. పి. రావు సంభాషణ ఆపేసి పనివున్నట్లు ఆవతలకి వెళ్ళిపోయాక సుజాత ఒక అయిదు నిముషాలు అక్కడే కూర్చుని ఆలోచించసాగింది. మహాకవి మార్తాండశాస్త్రి సరస్వతిని నరకయాతన పెట్టేవాడని ఆమెతో తగవుపడి, హోటల్ బిల్లు చెల్లించో, చెల్లించకుండానో ఏదో చేసి వెళ్ళిపోతే హస్నాబానుగారు వెళ్ళి ఆదుకుని, ఆమెను తన యింటికి తీసుకువెళ్ళి ఆదరించిందనీ. విన్నప్పటినించీ సుజాతకు సరస్వతి మీద అభిమానంతో మార్తాండశాస్త్రి మీద అగ్గి మీద గుగ్గిలంలా పడిపోతోంది. నానా తిట్లూ తిట్టింది. ఇప్పుడు ఆ మార్తాండ శాస్త్రి, ఆ మహాకవే తనతో యిచ్ఛకాలు చెబుతున్నాడు. తనమీద అధికారం చెలాయించబోతున్నాడు. ఇంతకీ అతనిలో ఏదో ఆకర్షణ వుంది. ఆ మాట కాదనలేకపోతోంది. ఉన్నట్టుండి చెరువు గట్టుమీద. సిమెంటు తిన్నె మీద కూర్చుంటాను. అక్కడకు వస్తే అన్నీ మాట్లాడుకుందాం అన్నాడు. ఆ మాట విని వెళ్ళనా, మాననా అని తర్కించుకుంది. స్నేహితురాలు సరస్వతిని గురించి నాలుగూ ఝాడించడమే మేలనుకుంది. పి. పి. రావును కలుసుకోవడానికి వెడుతూవుంటే మధ్య దారిలో ఆటకాయించాడు రాజాగారి పుత్రరత్నం లక్ష్మీకాంతారావు.



“తరుణీమణీ, ఎక్కడకు పయనము” అన్నాడు.

మెట్లు దిగి చెరువువైపు నడవబోతుంటే “దివి నుండి భువికి దిగివచ్చె, దిగివచ్చె పారిజాతమే నీవై నీవై” అని పాడి ఈ పాట ఎందులోదో గుర్తులేదు. బహుశ ఆదుర్తి డైరక్టు చేసి వుండాలి. పేరా జ్ఞాపకం రావడంలేదు. మిస్ అన్నాడు.

“నీ సినిమాపాటలు కట్టిపెట్టు. నాకు అవతల బోలెడు పని వుంది.” అంటూ చెరువుగట్టువెపు బయలుదేరింది..

తిన్నగా ఆగట్టు చేరేసరికి పి. పి. రావు కూర్చుని

వున్నాడు సుజాత వచ్చి పక్కనే కూర్చుంటూ "నీ పేరు-
నీ తత్వం నాకు బాగా బోధపడ్డాయి." అంది.

"పేరు నేతిబీరకాయ పెనువేప విత్తండ్రు పద్యం
వ్రాసిందెవరో గుర్తు లేదు కాని సుందరీమణి. సుజాతామణీ!
పేరాలో ఏముంది? ప్రతి మానవుడికి పుట్టినప్పుడు తల్లి
దండ్రులు ఏదో పేరు పెడతారు. సపోజ్ ధర్మారా
వంటారనుకో. వాడు ఉట్టి అధర్మపరుడు కావచ్చు.
ఈశ్వరరావు అని పెట్టారనుకో-వాడు నాస్తికుడు కావచ్చు
ఏమంటావు?" అన్నాడు.

పాపం: సరస్వతి ఎంత ఏడుస్తోందో కదా: ఆమెతో
సమాధానపడి ఏలుకోకూడదా:"

ఇక ఆమె ఆ మార్తాండశాస్త్రి భార్య సరస్వ
సమస్తుభ్యం ప్రసక్తి లేకుండా చెయ్యాలని నిశ్చయించు
కున్నాడు.

నీకు నా బాధలు తెలియవుగదా! నా మనస్సులో
బద్ధలైన అగ్ని పర్వతాలు వెడల్రగక్కే-వా ఎంత ఉ
ద్రవకరమైనదో వూహించలేవు గదా! ఆమెతో సమాధా
పక్షం ఇక కలలోనివార్త. ఆమెను డైవర్స్ చేసినట్లే లె
రెండు రోజుల క్రితమే హోటల్‌లో వున్నారయ్యే ఆప్
డైవర్సా?" డైవర్సు అంటే చట్టరీత్యా కాదు. చట్టరీత్యా
కోర్టుకు దరఖాస్తు చేసి విడాకులు ఇవ్వడానికి ఏడాది దా
దేకుతుంది. కాని ఆమెను నేను మానసికంగా డైవర్
చేశాను."



"కారణం?"

ఇదుగో నీ పారణం అని ఓ ముద్దతీసి ఆకులో పెట్టింది.
పగలే త్రాగుతుంది త్రాగుబోతు రాస్కెల్. వంకాయ
కూర మరి కొంచెం వెయ్యవే బాగుంది. అంటే కారం
కూరిన గుత్తి వంకాయలు నా ముఖాన గిరాటేసింది. ఆ
కారం నా కంట్లోపడి. నేనులబోదిబోమంటూ ఏడుస్తుంటే
నవ్వుతోంది. ఇంకా దానితో నెయ్యమా! గత ఆరు
నెలల్లోనూ ఆరు సార్లు కయ్యానికి దిగింది. కర్రపుచ్చుకుని
కొట్టింది."

"నిజమా!"

"అక్షరాలా నిజం."

నాతో చిన్ననాడు చదువుకుంది. ఎంతో వినయంగా
వుండేది.

"చిన్నతనంలో వినయంగా వుండవచ్చు. పెద్దయ్యాక
ముఖ్యంగా పెళ్ళి అయ్యాక మారిపోతారుగదా!"

ఇలా మాట్లాడి నిజంగా సౌజన్యమూర్తి అయిన
సరస్వతిని ఒక్క రౌడీగా చిత్రించడం పి. పి. రావుకి బాధా
కరంగా నేవున్నా సుజాతకు తనపట్ల కలిగిన వైమనస్యం
తొలగి ఆ స్థానంలో సామనస్యం దానితో పాటు కించిత్తు
ప్రేమ, ఒకింత అనురాగం కలగాలంటే మరో మార్గం లేదు.
అనుకున్నాడు. మళ్ళీ గుక్క తిప్పుకోకుండా "సుజాతాదేవీ!

నా బాధ తప్ప ఎవరికి చెప్పుకోను." అంటూ ఆమె చెయ్యి అవసరాన్ని మించి ఎక్కువసేపే తన చేతిలో పెట్టుకుని,

"నీ కళ్ళు నీలాలు-నీ కేశాలు నీలాలు. నీ మాటల్లో మధురిమలు. నిన్ను చూస్తే నే సరిగమలు."

చూశావా నీ సౌందర్యం చూడగానే నాలో ఆశు కవిత్వం ఎలా పొంగిందో, వరదల్లోవున్న కృష్ణానదికూడా ఇలా పొంగి వుండదు."

సుజాత చిరునవ్వు విసిరింది. ఆమె బుగ్గల్లో గుంటలు ఏర్పడ్డాయి.

ఆహా! నీ బుగ్గల్లో నవ్వినప్పుడు గుంటలు చూసి తీరాలి. ఇది నాకు సుదినంకాకపోతే నీ కెందామరల వంటి నీ బుగ్గల్లో గుంటలు కనిపించేవా? నీ పెదవులపై చిందులాడిన మధుర మందహాసం చంద్రికల్ని గమనించగలిగి వుండేవాణ్ణా!"

"అబ్బ మీ పొగడ్తలకేమి వూరుకుందురు. నిజంగా నేను అంత అందంగావున్నానా?"

"కావాలంటే ప్రమాణం చేస్తాను నిన్ను సుజీ అనిపిలుచుకునే భాగ్యం నాకు ఏనాటికైనా కలుగుతుందా! నా ప్రాణాలన్నీ నీమీదే వున్నాయి."

"చీకటి పడిపోయింది ఇంక రండి పోదాం"అంది సుజాత.

ఇద్దరూ మౌనంగా నడిచి ఆనందభవనంలోకి వెళ్ళిపోయారు.



మరో రెండు రోజులు ఏ ప్రత్యేకతా లేకుండానే గడిచిపోయాయి.

మార్తాండశాస్త్రిగారూ: మహాకవిగారు మాట అన్నాడు కుమారరాజా సాబ్ లక్ష్మీకాంతారావు.

మార్తాండశాస్త్రిగా చలామణి అవుతున్న పి.పి.రావు తిన్నగా మేడమీద కాంతి గదిలోకి వెళ్లాడు.

ముందు కాస్త విస్కీ-ఇచ్చి మాట్లాడవయ్యా"అన్నాడు పి. పి. రావు.

విస్కీ- యిచ్చి నీ గుట్టు రట్టయింది. ఇక శీఘ్రబుద్ధి పలాయనం. అని "యిక్కడినించి తప్పుకుంటే మర్యాద" అన్నాడు కాంతారావు.

"ఏమైంది?"

"వాడే! ఆ శర్మ లేడూ."

"ఏం చేశాడు!"

"నువ్వు మార్తాండశాస్త్రివికావని కనిపెట్టేశాడు!"

"ఎలా కని పెట్టాడు?" అని అడిగాడు ఆత్రంగా.

అసలు మార్తాండశాస్త్రి తను విజయవాడ వెడుతున్నానని టెలిగ్రాం యివ్వడానికి ముందు ఉత్తరం రాశాడు. ఆహ్వానాన్ని అంగీకరించానని. నువ్వు కుమారి మహాదేవి ఆటోగ్రాఫ్ పుస్తకంలో ఓ గేయం పాదాలు వ్రాసి మార్తాండశాస్త్రి సంతకం చేశావు. ఆ ఉత్తరంలో దస్తూరి

మహాదేవి ఆటోగ్రాఫ్ పుస్తకంలోని దస్తూరి సంతకాలు ఒక్కలా లేవట. నువ్వు దొంగవన్నాడు. నువ్వు ఇక్కడే మన్నా నకిలీ పనిచేస్తే నాలుగు తన్నడానికి నన్ను కూడా సిద్ధంగా వుండమన్నాడు.

పి. పి. రావువింటూ త్రీకాజిల్స సిగరెట్ వెలిగించాడు.

"భాయ్! నన్ను ఇంకా వాడేకారణాలచేత అనుమానిస్తున్నాడు?"

కవి గిరజాలు పెంచుకుంటాడట. సింగ్లీ కటింగ్ చేయిస్తాడట. నీకు అవేవీ లేక క్రాప్ కురచగా చేయించావట. కనుకనే కవిలా కనిపించావని కుమారి మహాదేవి అందిట."

"సరే! శర్మ నన్ను అనుమానిస్తున్నాడు. అయితే వాడనుమానిస్తున్నట్టు మనకు తెలుసుననే సంగతి వాడికి తెలియదు. ప్రశాంత మనోహరమైన ఈ ప్రదేశంలో వాడు పాములాంటివాడు. అటువంటివాడి ఉనికి నిజంగా నాకే కాదు. అందరికీ డేంజరస్."

నువ్వు ఏదో ఒక దొంగల ముఠాకు చెందినవాడవని మిస్ సుజాత నీ చెవ్వు చేతల్లో మెలిగే మరో దొంగ అని నీ గ్యాంగ్ మెంబర్లింకా రాగానే నువ్వు ఏదో సంచలనం కలిగించే పని చేస్తావనీ వాడి నమ్మకం."



అలాంటి అనుమానంతో పొగిలిపోవడమే వాడిగతి. వాడి కర్మాన వాడేపోతాడు, చివరకు మనకే జయం. మనమే విజయపతాకాన్ని ఆనందభవనం ఆవరణలో ఎగురవేస్తాం. చూస్తుండు" అన్నాడు.

ఓ పది నిముషాలు నన్ను మీరెవరూ డిస్టర్బ్ చేయకండి. చాలా అర్జంటుగా అన్ని విషయాలూ ఆలోచించాలి" అంటూ పి. పి. రావు తోటలకేసి వెళ్ళిపోయాడు. ఒక మూల కూర్చుని ఆలోచనలో పడిపోయాడు.

# 11

సుజాతా; మైడియరెస్ట్ స్వీట్ డ్రీమ్ గరల్; ఎంతసేపూ ప్రాణం విసిగేటట్టు ఆ లైబ్రరీలో పుస్తకాల మధ్య మునిగిపోతావు?"

వాళ్ళ దగ్గర జీతం తీసుకోవడంలా! పనిచేయకపోతే బాగుంటుందేమిటి!

ఏడ్చాడు. చవటశర్మ. చచ్చు శర్మ. పుచ్చు శర్మ. వాడికి ఈ సువిశాల భవనంలో భయపడే డార్లింగ్‌వి నువ్వు ఒక్కత్తివే."

లైబ్రరీకి విభాగాలెందుకు? కేటలాగులెందుకు? కొన్ని సంవత్సరాలుగా ఎలావుందో అలాగే యథాపూర్వకంగా వుండిపోతే ఏం పోయింది? [illegible]

టున్నారు. ఈ కేటలాగింగ్ అంతా పుష్పావతి. శర్మగార్ల ఆలోచన. అది చెయ్యనిద్దూ అయిదున్నరదాకా ఈ పనిచేసి బయటకు వస్తాను. అప్పుడు మాట్లాడుకుందాం."

ఈ శర్మ అనే పదార్థాన్ని గురించి మనం తర్క వితర్కాలు వాదోపవాదాలు జరపడం అభిలషణీయం మాత్రమే కాదు అవసరంకూడా.

"అవన్నీ నేను వచ్చేవరకు మీ మనసులోనే అట్టి పెట్టండి" అంటూ లైబ్రరీలోకి వెళ్ళిపోయింది సుజాత.

పి. పి. రావు తోటలో రావి చెట్టు నీడను కూర్చు న్నాడు కుర్చీ వేసుకుని. జేబులోంచి పనామా ప్యాకిట్ నుంచి సిగరెట్ తీసి వెలిగించాడు. పొగవదులుతూ ఆలో చనా సాగరంలో మునిగిపోయాడు.

అతని చేతిలో ఒక పుస్తకం ఉంది. ఆ పుస్తకం పేజీలు కాసేపు తిరగవేశాడు పి. పి. రావు. అది డిటెక్టివ్ నవల. అగాథాక్రిస్టీ వ్రాసినది అలా చదువుతూనే ఒక కునుకు తీశాడు.

"ఇదుగో నిన్నే! టీ త్రాగు" అన్న కలకంఠ కంఠం విని ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు. తేనీటి కప్పుతో సాక్షాత్క రించిన తరుణి సుజాత.

అటూ, ఇటూ చూసి ఎవరూ లేరని గ్రహించి



"సుజీ! మై డార్లింగ్ నువ్వే తెచ్చావేమేటి? వంటమనిషి లేడా?"

ఉన్నాడు వాడి పని కాచడంవరకే పరిమితం. కప్పుల్లో పోసి తెచ్చుకోవడం, త్రాగడం మన పని. ఇంటిల్లిపాదీ మద్రాసులో మ్యాట్నీ సినిమా చూడ్డానికి, ఆ తర్వాత రాజావీర వెంకటసత్యనారాయణరావుగారు బ్రహ్మదేవ్ కళా ప్రదర్శన ప్రారంభోత్సవంచూసి ఉపన్యాసంవిని రావ డానికి వెళ్ళారుగా. అందుచేత నేనే తీసుకువచ్చాను."

సర్వజ్ఞ సింగమ భూపాలుడు ఏమయ్యాడు? అదే శర్మ

"శర్మకూడా వాళ్ళందరితో పాటు చనియె."

"అమ్మో" ఆనందభవనంలో చివరకు కుక్కలుకూడా కవిత్వం చెబుతాయ్.

"అయితే నేను కుక్కనా?"

"నీ మాటకాదే బుల్లెమ్మా! అసలు ఈ భవనంలో కవితాభారతి నర్తిస్తుంది. రాత్రిపూట నిద్రపోతుండా మెలకువగావుంటే "గజ్జెలందియలు ఘల్లుఘల్లు మన గంతులు వేయమ్మ గాన భారతి." అన్నట్లు గజ్జల రవళి వినిపిస్తుంది. శర్మ లేడుగా కాస్సేపు కూర్చుందూ! నీ సౌందర్యామృతం ఒక గ్లాసెడు త్రాగుతాను. ఈ టీ త్రాగాక."

"పనికాస్త పూర్తిచేసి వస్తానుండు."

"ఎంత సేపట్లో!"

"జస్ట్! ఆఫ్ ఎన్ అవర్"

"రైట్" అన్నాడు పి. పి. రావు.

మళ్ళీ కళ్ళు మూసాడు. పది నిముషాలయింది. చెట్ల ఆకులు గలగల మంటూ జోకొడుతున్నాయి. ఈ చల్లనిగాలి వీస్తోంది. తోటలోని పూల మొక్కలనుంచి సుగంధవీచికలు వ్యాపిస్తున్నాయి. ఇంతలో గేటు తలుపులు తెరచిన సవ్వడి అయింది. పి. పి రావు అర్థనిమీలిత నేత్రాలతో గేటునైపు చూశాడు. ఎవరో యువకుడు తనవైపే వస్తున్నాడు. మంచి హుషారుగా వున్నాడు.

అతను తిన్నగా పరమేశ్వరరావు దగ్గరకే వచ్చాడు

"రాజావీర వెంకటసత్యనారాయణగారు లేరా!"

"ఏం? ఎందుకు?"

"నన్ను ఆహ్వానించారు లే."

"నీ దేవూరు?"

"ఛత్రపూర్! గంజాం జిల్లా. ఒరిస్సా.

"నీ పేరు?"

"మహాకవి మార్తాండశాస్త్రి."

"ఎందుకు వచ్చావు?"

"రాజాగారు ఆహ్వానించారు. నేను ముందురానని టెలిగ్రాం ఇచ్చానులే తర్వాత మనస్సు మార్చుకుని వచ్చాను."



పి. పి. రావులేచి కూర్చున్నాడు. సిగరెట్ ముట్టించి ఓ దమ్ము లాగాడు.

"అయ్యా! మార్తాండంగారూ! వాళ్ళంతా లేని సమయంలో నన్ను కలుసుకున్నావు కనుక సరిపోయింది. వాళ్ళంతా వుండగావస్తే ప్రాణముల్లి పోలీస్‌స్టేషనుకు అక్కటిన్నించి కిల్పాకు పిచ్చి ఆస్పత్రికి పంపి వుండేవాళ్లు. మహాకవి మార్తాండశాస్త్రి నా డియర్ ఫ్రెండ్ అతన్లా చెప్పకుంటూ ఇక్కడ ఒకడు చెలామణి అవుతున్నాడు. అసలు మార్తాండుడు బెజవాడ వెళ్లాడు. ఇక్కడున్నది ఆతని ప్రతినిధి. అందులోనూ ఏకైక ప్రతినిధి.

"నాకు నువ్వెవరో తెలుసు. నీ నాటకమంతా బూటకమని రాజాగారితో చెప్పి చక్కాపోతాను."

"చెబుతావు. చెప్పినందువల్ల నీకు పైసా కూడా దక్కదు. అసలు నువ్వు చెప్పినా ఇక్కడ వినేవాళ్లెవరూ లేరు. అసలు నీ పేరు, వూరు సరిగ్గా చెప్పు." అన్నాడు పి పి. రావు కళ్లెర్రచేస్తూ. "కుక్కుటేశ్వరరావు అన్నాడా వ్యక్తి భయపడుతూ

"అయితే నీది కుక్కుటేశ్వరమా? రామేశ్వరమా? ఏదో నిజం చెప్పు? ఒక్క ప్రశ్న: నిర్మేఘ మాఘమాసా ర్థమిథి అంటే అర్థం?"

"నాది ఏదీకాదు. నెల్లూరు. నువ్వు అడిగినదానికి అర్థం నాకు తెలియదు."

"శీఘ్రబుద్ధిః పలాయన హః అదుగో గేటు! వచ్చిన దారినే పో। ఇదిగో సిగరెట్టు- ఇది కాల్చుకుంటూ పో." అన్నాడు పి. పి. రావు తన ఎత్తు చిత్తయి విజయం నూటికి నూరుపాళ్ళు తనదేననుకుంటూ రాగా, పరాభవం జరగకుండా, పరాజయం ఎదురయినందుకు దుఃఖభారంతో క్రుంగిపోయి, ఏ కర్రతోనో కొట్టకుండానే నడుం విరిగినంత పని జరిగినందుకు మరింత నీరసపడి షార్టుకట్ ద్వారా పొలాల మీదుగా బస్సు స్టాపు వైపు నడిచాడు కుక్కుటేశ్వరరావు.

ఇంతకూ దురదృష్టం తనని వెంటాడుతోందే అని బాధపడ్డాడు. ఏదీ మూడేళ్ళయింది. తనను విజయమార్గంలో నడిపించి సుఖ సంతోష సాగర తరంగాల్లో ముంచెత్తిన తలోదరి మాయమై, ఇద్దరూ సింగపూర్ నుంచి ఓడలో మద్రాసు వచ్చారు. ఆ ప్రయాణం సాగిన పదిరోజులు ఓడలోని వారందరితోనూ, తాను ఆమె పేకాడిన రోజులు, తాను పేక కలిపితే, ఆవిడకే మూడు ఆసులు మూడు రాజులు పడేవి, తన్మోరులో రోజుకు నాలుగయిదు వందలు వచ్చేవి. రూపాయి పావలా కోసం చిన్నతగవుపడి, తెగతెంపులు చేసుకుని, వివాదపడి వెళ్ళిపోకపోతే తామిద్దరికీ పెళ్ళి జరిగివుండేది. ఇప్పుడు ఎక్కడ వుందో-"

ఆనాటి నుంచి దారిద్ర్యం తన్ని నీడలా వెన్నాడుతూనే వుంది. ఆమె రాజాగారి ఆనందభవనంలో వుంద



వచ్చినందుకు నిరాశే ఎదురయింది. మళ్ళీ రావాలి రేపు." అనుకుంటూ కుక్కుటేశ్వరరావు బస్సుస్టాపు చేరుకున్న సమయానికే, కుమారి మహాదేవి సినిమా దీపాలారిపోగానే మొదలయిన తలనెప్పి ఇంటర్వెల్ సమయానికి దుర్భరం, సుస్సహంకావడంతో బయటపడి ఎస్ప్లనేడ్ లోని బస్ స్టాపులో పూనమల్లి బస్సు ఎక్కింది. పూనమల్లి చేరుకుని మైలుదూరం చల్లనిగాలిలో నడుస్తూ వచ్చింది చక్కగా.

ఆనందభవనంలో ప్రవేశించి తనే వంటింట్లోకి వెళ్లి వంటమనిషి నడిగి టీ త్రాగి- అమ్మయ్య అనుకుని తన గది లోకి వెళ్ళి పడుకుని నిద్రపోయింది.

మర్నాటి ఉదయం చెరువుగట్టుదాకా వెళ్లింది. అక్కడ మామిడిచెట్టు కొమ్మ మీది నుంచి "రాణీ" అని వినిపించింది.

ఎవరా అని అటూ ఇటూ మహాదేవి చూస్తుండగానే కొమ్మ మీది నుంచి గభాలున దూకిన కుక్కుటేశ్వరరావుని చూసి "నువ్వా! ఇన్నేళ్ళు ఎక్కడ చచ్చావు?" అని అడిగింది అమాంతంగా కావలించుకుంటూ.

"ఎంత ముద్దుగా! మరెంత ముచ్చటగా మాట్లాడేవే. నిన్న నీ కోసం వచ్చాను. చూశాను. ఇక్కడ ఏం చేస్తున్నావు?" "కవయిత్రిగా పడి తింటున్నాను. కవిత్వ తత్వ విచారణలో పడ్డాను. ఈ భవనంలో ఎలాగయినా ప్రవే

శించు. రెండురోజులలో నీకు ఒక పకడ్‌బందీ పథకం వివరిస్తాను. కొన్ని వేలు లాభిస్తాయి." అంది.

"మార్తాండశాస్త్రినని చెప్పుకుంటున్న సుబ్బారాయుడున్నాడా ?"

"ఆ ! ఉన్నాడు."

"వాణ్ని కలుసుకుంటాను."

"'వాడు ఏమయినా హంగామా చేసి నువ్వు జైలు బర్డ్‌వని చెబితే"

"ఇదుగో ! ఇటు చూడు. దీని గుండుతో వాడి కపాలమోక్షం చేస్తాను."

కుమారి మహాదేవి అతనికేసి చూసింది. కోటు జేబులోంచి చిన్న జర్మన్ రివాల్వర్ తీసి చూపించాడు. ఆమె మనస్సు కుదుటపడింది.

## 12

మహాదేవి ఎలియాస్ జయప్రదా రాణి తన పల్ల పెంచుకున్న నైమనస్యాన్ని పూర్తిగా మర్చిపోయి, ఎక్కడ లేని ప్రేమానురాగం వర్షించడంతో ఉక్కిరి బిక్కిరి అయిన కుక్కుటేశ్వరరావు ఆమె ఆలింగనం ఒత్తిడి తట్టుకోలేక అమాంతంగా అక్కడ పచ్చిక మీద కూలబడ్డాడు. ఆమె ఆ వూపులో అతని ఒళ్ళోపడి ఆ తర్వాత మెల్లగా లేచి దగ్గరలోనే కూర్చుంది.



"ఏమైంది? డి. యస్. ఆర్. యుడును కలుసుకున్నావా ?"

"కలుసుకున్నాను, వాడు మార్తాండుడు కాదు. అయితే నా పాచిక పారలేదు. నేను మార్తాండశాస్త్రిని కానని తెలుసు. వాడి రహస్యం బయటపెడతానని భయపడ్డాడు. నేను వాడికి వేరే మార్గం ఉభయతారకమైంది సూచించాను. ఏదయినా ఉద్యోగం యిప్పించమన్నాను. తనకు కారు డ్రైవరు కమ్ అటెండర్ బాయ్‌గా వుండమన్నాడు. సరేనన్నాను." "ఒరే నాయనా! నువ్వు కూడా పుష్పావతిగారి నక్లెస్ కోసమే వచ్చావా ?" అని అడిగాడు.

"అంతేనన్నాను. ఇంతకూ నువ్వు చెప్పదలుచుకున్న పథకం ఏమిటి?"

"అదే యాభై వేలు చేస్తుందా నక్లెస్. ఒకటే పని చెయ్యాలి. మార్తాండశాస్త్రినని చెప్పుకొంటున్న దిబ్బడు కవితాగానం చేస్తాడు. బహుశా రేపు రాత్రికి జరగవచ్చు. రేపు రాత్రి ఏడు గంటలకు రాజాగారు పెద్ద విందు చెయ్యబోతున్నారు. ఆ విందుకు తర్వాత మహాకవి మార్తాండ శాస్త్రి రచించిన పద్యాలు చదువుతాడు. సరిగా ఆ సమయానికి నువ్వు ఎలక్ట్రిక్ మెయిన్ ఎక్కడుందో చూసుకుని ఆ స్విచ్ ఆఫ్ చెయ్యి. కవితలు చదివే హాలేమిటి మొత్తం భవనం చీకటిలో మునిగిపోతుంది. నేను పుష్పావతి వెనకాలే

కూర్చుని తటాలున ఆమె మెడలోంచి వజ్రాలహారం లాగేస్తాను. నువ్వు మెట్ల దగ్గర తచ్చాడుతూ వుండు. నేను ముందు హాలు మొదటి కిటికీతీసి హారం మెట్లపక్కనున్న పచ్చిక మీదకు గిరవాటు వేస్తాను. నువ్వు దాన్ని తీసుకుని లైట్లు ఆన్ చేసి పారిపో ఆ తర్వాత ఏదో ఒక సాకున నేను బయటికి వచ్చేస్తాను. రాళ్లు తీయించేసి కరిగించు కాసుల బంగారం అమ్మేద్దాం. ఏడాదిదాకా మనం ఏ దొంగతనం చెయ్యక పెళ్ళి చేసుకోవచ్చు. పిల్లల్ని కనవచ్చు."

"నేనా?"

"కనేది నేను. కనేట్లు చేసేది నువ్వు. మనం ఒంటరిగా ఇలా కలుసుకోవడం కుదరకపోవచ్చు. నువ్వు ఎంత చురుకుదనంతో ప్రవర్తిస్తే అంత మంచిది. దీన్ని గురించి పది రోజులుగా ఆలోచిస్తున్నాను. నువ్వెక్కడ చచ్చావో తెలియక తికమకపడుతున్నాను. ఇది ఒకరివల్ల జరగదు. నీ సహాయం అవసరం వుండాలి."

"ఇప్పుడు మార్తాండశాస్త్రిగారిని డబ్బాకొట్టుకుంటున్న సుబ్బారాయుడెక్కడ వున్నాడు."

తోటలోనే వున్నాడు. అక్కడ ఓ ఔట్‌హౌస్ వుంది. అతనికి ప్రత్యేకించి యిచ్చారు. దానిలో కుర్చీలు, బల్లు, వ్రాతపరికరాలు. ఓ మంచం పరుపు దిండు అన్నీ పెడతారట.



వాళ్ళూ లైబ్రేరియన్ సుజాత తోడు దొంగల్లా వున్నారు.

"నాకూ అలాగే తోస్తోంది. మరి నేను వెళ్ళిరానా?"

"వెళ్ళు."

మహాదేవి ఆనందభవనం వైపు వెళ్ళగా కుక్కుటేశ్వరరావు తోట వైపు నడిచాడు.

వెడుతూ వెడుతున్న మహాదేవి రేపటితో పి. పి. రావు సుజాతల అశాసౌధం పేకమేడలా కూలిపోవాలి నా రొట్టె నేతిలో పడాలి అనుకుంది.

ఆమె స్వభావతః మంచిదే. అయితే కవిత్వం వ్రాయనారంభించడానికి ముందుగానే. ఇంకా అంతకంటే స్పష్టంగా చెప్పాలంటే బాల్యంనించే ఆమెకు చేతివాడితనం అబ్బింది. హస్తలాఘవాన్ని బాగా యింప్రూవ్ చేసుకుంది ఎక్కడైనా సందు దొరికితే దాన్ని చీర కుచ్చిళ్ళలోనో జాకెట్‌లోనో దాచేస్తుంది. దాన్ని ప్రియుడు కుక్కుటానికిస్తే దాని నతడు అమ్మివేసి డబ్బు తెస్తాడు. ఇద్దరూ జల్సా చేస్తుంటారు. జల్సా చేశాక ఆవిడలో కవిత్వం పైత్యంలా ప్రకోపిస్తుంది. టేపు రికార్డరు లేదుగాని జ్ఞాపకశక్తి రికార్డులా పనిచేసి ఏ చిత్తు కాగితం కనబడినా ముందు బరికేసి ఆ తర్వాత ఫెయిర్‌గా మంచి కాగితంమీద రాస్తుంది. ఆ తర్వాత డైరీలోకి ఎక్కిస్తుంది.

మహాదేవి తిన్నగా పి. పి. రావు దగ్గరకు వచ్చి "కవిగారూ, కవిగారూ అంటూ పిలిచింది. ఆనందభవనం వెలుపల తోటలో నడుస్తున్న పి. పి. రావు ఉలిక్కిపడి వెను దిరిగి చూశాడు.

"ఓ! మహాదేవిగారా! రండి రండి" అన్నాడు.

"మీ కవితాగానం వినడానికి ఎదురుచూస్తున్నాను."

"నేను కూడా మీ పద్యాలు-గేయాలు వినాలని ఉవ్విళ్లూరుతున్నాను."

"ఏ సమయంలో కోరితే అప్పుడు నా కవితలు విని పిస్తాను. అంది కుమారి మహాదేవి.

"రాణిగారి తోట. అందులోని పూల మొక్కలు చూసినప్పుడు కవిత్వం దానికదే పుట్టుకొస్తుంది. ఏమం టారు?" అన్నాడు పి. పి. రావు ఉరఫ్ మహాకవి మార్తాండ శాస్త్రి.

"నిజం శాస్త్రిగారూ, మీ మాట అక్షరాల నిజం. కం హృదయం సుగంధం విరజిమ్మే పూలు చూసినప్పుడు పరవశించి పోతుంది కదా!" అంది కుమారి మహాదేవి

ఇలాగే కాసేపు పిచ్చాపాటీ మాట్లాడుకున్నారు.

"ఒళ్ళు చిరాగ్గా వుంది. స్నానం చేసి వస్తాను." అంటూ మహాదేవి ఆనందభవనంలోనికి వెళ్ళగానే "ఏయ్! నిన్నే!" అని వినిపించడంతో పి. పి. రావు ఆగాడు. వెను తిరిగి చూశాడు.



"ఏమిటి గొడ్లు కాచేవాడిలా ఏయ్. గోయ్" అంటావు "పేరు పెట్టిపిలవలేవా?" అన్నాడు పి. పి. రావు కొంచెం తీక్షణంగా.

"పేరు పెట్టిపిలవనా, నువ్వు స్వయంగా మంచిరోజు, వర్జ్యం, వారంకూడా చూడకుండా పెట్టుకున్న దొంగపేరు మహాకవి మార్తాండశాస్త్రి అని పిలవనా! నీ నిజనామధేయం పెట్టి పిలవనా! అలా పిలుద్దామంటే నీ అసలు పేరు నాకింకా తెలియదే!"

"తెలియక పోవడమే మంచిది; ఇంతకీ నువ్వనే దేమిటి?"

"ఏముంది! నీ మెడడు తీసేస్తానంటాను."

"అబ్బో! నిజంగా తీసేవాడిలాగే మాట్లాడు తున్నావే?"

"ఎంతోసేపు కావాలా? ఇదిగో రివాల్వరు చూశావా? దీనితో నిన్ను ఒక్క క్షణంలో కైలాసానికి పంపగలను."

"రైటో! ఓం నమశ్శివాయ అనే పంచాక్షరిని తల క్రిందులుగానో, ఒంటి కాలిమీదో నిలబడి సంవత్సరాల తరబడిన తపస్సు చేసి శివ సాక్షాత్కారం పొందడానికి ప్రయత్నించనక్కరలేకుండా ఒక్క దెబ్బతో కైలాసానికి పంపిస్తానన్నావు. ఇంతకీ శివుడు నీ ఫ్రెండా!"

"ఈ కబుర్లు చెప్పి కాలక్షేపం చెయ్యాలనుకుంటు న్నావా! నేనడిగింది ఏం చేశావోయ్!"

"ఓయ్, గీయ్ అనకు. గూబ గుయ్యిమనగలదు. నేనే మన్నా నీ బావమరిదిననుకున్నావా! ఓయ్, గీయ్ అన డానికి?"

ఆ మాటలన్నీ తర్వాత చూద్దాంగాని నాకు ఆకలి వేస్తోంది. నీ బంధువుననో, స్నేహితుడిననో చెప్పి ముందు టిఫిన్, కాఫీ లిప్పించు. నేను రెండు మూడురోజులుంటాను. భోజనానికి ఏర్పాట్లు చెయ్యి."

"చెయ్యకపోతే."

"నీ బ్రతుకు రామకీర్తన పాడుతుంది." అంటూ తన చేతుల కండరాల బలాన్ని ప్రదర్శిస్తూ కసరత్ చేయ సాగాడు."

"నువ్వు స్వీడన్ వెళ్ళి బాడీ మాసేజ్ నేర్చుకొని వుండవలసింది. బలంగా దున్నలా వున్నావు. అందరికీ కాళ్ళు, ఒళ్ళు పడుతూ బోలెడు సంపాదించుకోవచ్చు."

"ఏయ్! ఈ చొప్పదంటు కబుర్లు కట్టిపెట్టమని ఇందాక నే వార్నింగ్ యిచ్చాను. నా తడఖా చూస్తావా?" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

ఇంతలో యజమాని వగైరా ఎవరూ లేకపోవడంతో కాస్త రోడ్డుమీదకు వెళ్ళి టీ కొట్టులో రెండు బిస్కట్లు



తిని, టీ తాగి అక్కడే చుట్టకాల్చి ఈవతలకి వచ్చిన వంట మనిషి సుబ్బయ్యను చూశాడు.

"సుబ్బయ్యా." అంటూ పిలిచాడు.

ఆ పిలుపు వినగానే సుబ్బయ్య టపీమని ఈవతలకి "ఏమండీ కవిగారూ పిలిచారు?" అంటూ దగ్గరగా వచ్చాడు.

"ఇతను నా నౌకరు. మేనత్తకు జబ్బుగా వుందని తిండివనం వెళ్ళాడు. ఇప్పుడు నా ఉత్తరాలు తీసుకొని ఇక్కడకు వచ్చాడు. ముందు కొంచెం టిఫిన్ యిచ్చి కాఫీ యియ్యి 2, 3 రోజులుంటాడు. నా నౌకరు కనుక మా అందరితోనూ గాక నీతో భోజనం చేస్తాడు. కాస్త ఈ ఉపకారం చేసి పెడతావా?" అయ్యో, బాబూ! ఇది ఉపకారమా? రానయ్యా ముందు ఉప్మా తిందువుగాని బాబూ! తమరికి కూడా కొంచెం ఉప్మా తెచ్చిపెట్టనా! వేడివేడిగా వుంది ఇప్పుడే తయారు చేశాను. నిమ్మబద్ద పిండమంటారా?

"శెభాష్! పిండు. నాకు ఒక ప్లేటు తెచ్చి యియ్యి. అన్నాడు పి. పి. రావు. కుక్కుటేశ్వరరావుతో లోపలకు వెడుతున్న సుబ్బయ్యను పిలిచి "వాడి దగ్గర రివాల్వరుంది. వాడు కొంచెం దుడుకుపిల్లాడు. దానిని నాకు తెచ్చి యియ్యి." అన్నాడు రహస్యంగా పి. పి. రావు.

అలాగేనన్నట్టు తలవూపాడు సుబ్బయ్య.

లోపలకి రాగానే "తంబీ! ఆ కోటు చిలక్కొయ్యకి తగిలించి కూర్చో." అన్నాడు సుబ్బయ్య.

కుక్కుటేశ్వరరావు అలాగే చేసి పీట వాల్చుకుని కూర్చోగానే సుబ్బయ్య ప్లేటు నిండా తీసి ఉప్మా పెట్టాడు.

"బాబాయ్, నీకు పుణ్యం వుంటుంది. మరో ప్లేటులో కూడా ఉప్మా తెచ్చి పెట్టు. రెండు కప్పుల కాఫీ యియ్యి. ప్రొద్దుటినించి పొట్టలో ఏమీ పడలేదు" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

అలాగే అంటూ మరో ప్లేటు ఉప్మా అతని ముందు పెట్టి, ఒక ప్లేటుతో పి. పి. రావు దగ్గరకు వచ్చి "సార్! మీ రివాల్వర్ ఇదుగో." అని కుక్కుటేశ్వరరావు జేబులోంచి సంగ్రహించిన రివాల్వర్ యిచ్చాడు.

"శెభాష్ సుబ్బయ్యా! శెభాష్! అంటూ మెచ్చుకుని ఉప్మా తింటూ కాసిని మంచినీళ్లు, కాఫీ యియ్యి." అన్నాడు.

సుబ్బయ్య లోపలకి వెళ్లిపోయాడు ఇది వాడి దగ్గర లేకుండా, నా దగ్గరే వుంటే ప్రమాదం ఏమీ వుండదు." అనుకుని సంతుష్టిపడ్డాడు పరోపకారి పరమేశ్వరరావు. ఉరఫ్. మహాకవి మార్తాండశాస్త్రి.

# 13

రివాల్వర్ కుక్కుటేశ్వరరావు దగ్గర వుండటం కంటే, తన జేబులో వుండటం వల్ల కొంచెం నిశ్చింతగా విశ్రాంతి తీసుకోవచ్చునని పి. పి. రావు విశ్వసించాడు. రివాల్వర్ వంటి మారణాయుధాలు, ఎలా సంపాదించినవైనప్పటికీ, ఆ మనిషి (కుక్కుటేశ్వరరావు) స్వభావంలో కొంచెం తొందరపాటు, ఉద్రేకం వున్నాయని పి. పి. రావు గ్రహించక పోలేదు. ఈ విధంగా తలచుకుంటూ తోటలోని సిమెంటు తిన్నెపై పడుకొని అర్ధనిమిలిత లోచనుడై ఆలోచనాధీనుడై వున్న పి. పి. రావు "ఏయ్" అన్న సంబోధన విని వులిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"అరే! అబ్బీ! నిన్ను నా నౌకరుగా నాకు వాహన యోగం లేకపోయినా డ్రైవరుగా నియమించుకున్నానన్న సంగతి మరచిపోయి ఏయ్! అంటావేం? నౌకర్లు యజమానిని ఎక్కడైనా ఏయ్ అనడం చూశావా? విన్నావా?" అని అడిగాడు.

"నేను యింతవరకూ ఎవరికీ ఎక్కడా నౌకరుగా చేసిన పాపాన పోలేదే?" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"ఇప్పుడు నువ్వు నాకు నౌకరువు కావా?"

"కాను."

అరే! ఇక్కడ ప్రవేశించడానికి నౌకరు పనినేగా సాధనంగా వినియోగించుకుంది నువ్వు నౌకరుగా మెలగవలసినది వంటవాడు సుబ్బయ్యతో. నీ మకాం వాడి గదిలోనే అది గ్రహించు. అలా చెప్పకపోతే ఒరే! బాబూ నీకిక్కడ వుండే అవకాశం లేదు."

"ఆ సుబ్బయ్యగాడు అస్తమానం కడుపునొప్పి అని ఏడుస్తాడు. వాడి కడుపు నొప్పి రోదనం వింటుంటే నాక్కూడా కడుపు నెప్పి పట్టుకునేట్టుంది" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

వాడి కడుపు నెప్పి రోదనం విన్నప్పుడు నువ్వు కొంచెం సానుభూతి చూపించి వుండాలి. మధ్యనవచ్చి నా పగటి కలలు పాడుచేశావు."

సరేగాని, నువ్వు చాలా తెలివైన వాడివి. కాకపోతే సుబ్బయ్య ద్వారా నా రివాల్వర్ లాగేస్తావా! ఒక్కమాట నువ్వు పుష్పావతిగారి నెక్లెసు కొట్టేస్తావు. అందుకే వచ్చావు. అందుకే తోటలోని ఔట్‌హౌస్‌లో నీ మకాం పెడదామనుకుంటున్నావు. ఇంతకీ ఆ నెక్లెసు ఎక్కడ దాస్తావు! నా చేతి కియ్యి. నేను భద్రంగా ఎవరికీ కనిపించకుండా జాగ్రత్తగా దాస్తాను. నీ యిష్టం వచ్చినట్టు చేసికో; కాని నాకు మటుకు వాటా యివ్వాలి."



"అసలు నీకు నక్లెసుమాట మహాదేవి చెప్పిందేమిటి?" అని అడిగాడు పి. పి. రావు తకీమని.

మరే! నువ్వు మహాకవిగా చెలామణి అవుతున్నట్టే ఆమె ఒకచోట కవియిత్రిగా చెల్లుబడి అవుతోంది. ఆమె పుష్పావతిగారిని మద్రాసులో కలుసుకుని తను వ్రాసిన ముత్యాలసరాలు వినిపించి ఇక్కడ మన్ననలు పొందుతోంది. అఫ్‌కోర్స్. ఆమె నాకు కొంచెంగా సూచించిన మాట నిజమే ననుకో ఒకవేళ నాకేమీ యివ్వకుండా నువ్వే ఆ నెక్లెసును లాగేద్దామనుకుంటే నీకు నౌకరుగా ఆ ఔట్‌హౌస్‌లో ప్రవేశించి సంపూర్ణమైన హోదా కొనసాగించగలను. ఇది మాత్రం మరచిపోకు బ్రదర్." అని కుక్కుటేశ్వరరావు అక్కడినించి వెళ్ళిపోతూ "ఏం నీ పగటికలలకు అంతరాయం కలిగిందా?" అని అడిగాడు.

నిజంగా పి. పి. రావు అంతవరకూ ఆలోచించిన విషయమే అది. ఆ నెక్లెస్ అపహరిస్తే ఎక్కడ దాచడం! ఎలా బయటికి తీసుకుపోవడం! ఎలా ఆ రాళ్లు తీయించి అమ్మడం. నమ్మి రాజాసాబ్ చిన్నకొడుకు రేసులపిచ్చి లక్ష్మీకాంతారావు కివ్వడమా? రామకృష్ణప్రసాద్ కివ్వడమా ఏది సబబు? ఏది లాభదాయకం? అంటూ పది నిముషాలు ఆలోచించి తనగదిలోంచి వంటవాడు సుబ్బయ్యను ఫోనులో పిలిచాడు.

"ఏం బాబూ!" అన్నాడు సుబ్బయ్య.

"నుక్కేశ్వరరావు చెప్పాడులే! నువ్వు కడుపు నెప్పితో బాధపడుతున్నావని నిజమేనా?"

"నిజమే బాబూ."

"ఏమిటి నీ జబ్బు లక్షణాలు"

అన్నం తినగానే ఓ అరగంట సేపు కడుపులో భూకంపం వచ్చినట్లుంటుందండీ."

"బహుశా అజీర్తి రోగమై వుంటుంది. రెండు రెన్నీ బిళ్ళలు వేసుకుని నమిలి మింగి మంచినీళ్ళు తాగు. తప్పకుండా సర్దుకుంటుంది. రెండు బిళ్ళలు పదిహేను పైసలనుకుంటాను. ఏ మందుల షాపులోనైనా దొరుకుతాయి. నేను పద్యాలు వ్రాసుకోవాలంటే నాకు ఏకాంత స్థలం కావాలి ఇతరుల రొద వింటూంటే కవిత్వం వ్రాయడానికి అవకాశం తగ్గిపోతుంది తోట ఉత్తరపు వైపున బోట్ హౌస్ నాకిప్పిద్దూ.

"బాబయ్యా! మీరు రాజాగారిని అడిగాక గానీ ఆయన ఒప్పుకున్నారంటే! ఇక పుష్పావతమ్మగారి చెపిన కూడా పడేసి మధ్యాహ్నానికల్లా మీ పెట్టె బేడా అక్కడ చేరుస్తాను. ఆ గది చాలా చిన్నదండీ; శుభ్రం చేయిస్తాను."

చిన్నది. పెద్దది అనే సమస్య లేదు. ఈజీ ఛైర్ ఇస్తే దానిలో బయట కూర్చుని ఆలోచించి పద్యాలు



వ్రాసేస్తాను. రేపు రాత్రి కవితాగానం చెయ్యాలిగదా. దానికి ముందు పెద్ద విందు చెయ్యాలన్నారు రాజాగారు. దాని కప్పుడే అతిథులు వస్తున్నారు. వారంతా నా కవిత్వం వింటారు."

"సరే బాబూ! మధ్యాహ్నం 2 గంటలకల్లా రెడీ చేయిస్తాను."

"థాంక్యూ" అంటూ రిసీవర్ హుక్‌కి తగిలించి పి. పి. రావు మరో సిగరెట్ ముట్టించాడు.

ఆ మధ్యాహ్నమే పి. పి. రావు తన బస బోట్ హౌస్ లోకి మార్చాడు.

"శర్మగారూ." అంటూ పిలిచింది సుజాత.

"ఏం? ఎందుకండీ సుజాతగారూ!"

"నాకు టౌన్‌లో చాలా అర్జంటు పనులున్నాయి. మధ్యాహ్నం ఆఫ్ ఇవ్వగలరా, రేపు ఉదయం ఆరుగంటల నించీ రాత్రి ఎనిమిది గంటల వరకూ పని చేస్తాను. ఒక ఫ్రెండును కలుసుకోవలసిన పని వుంది. రమ్మన్నాను. నా కోసం వెయిట్ చేస్తూ వుంటుంది.

"సరే! వెళ్ళి రండి మధ్యాహ్నం కాస్త టైం వుంటే మీ పని నేను చేసి పెడతానులెండి."

"థాంక్స్" అంటూ సుజాత తన స్నేహితురాలు సరస్వతిని కలుసుకోవచ్చని ఉవ్విళ్లూరుతూ ఆదరా బాదరా

భోజనం చేసి టైము చూసుకుంది. మధ్యాహ్నం రెండున్నర గంటలయింది. ఇవతలకు వచ్చింది.

"సుజీ! మై డార్లింగ్. జస్ట్ వర్డ్" అంటూ కుమార రాజాసాబ్ అడ్డు తగిలాడు.

తొందరగా వెళ్ళాలనుకున్నందుకు సుజాతకి కాంతారావు సుజీ, మై డార్లింగ్ అనేసరికి ఒళ్ళు మండింది.

డార్లింగ్, గీర్లింగ్ లు కట్టిపెట్టు. అర్జంటుగా ఫోనుకు వెడుతున్నాను."

"ఒకే ఒకమాట అన్నానుగా, విని వెళ్లు, మై డియరెస్ట్, స్వీటెస్ట్-

"ఏమిటా మాట ?"

మన మ్యారేజి మాట!"

"నేను చాలా చెడ్డదాన్ని, గయ్యాళి గంపను. నీ బ్రతుకు బండలు చేసి నిన్ను నడివీధిలో పెట్టగలను."

"నన్ను అసమానంగా సుఖపెట్టగలవు. సినిమాలోలా డ్యూయెట్లు పాడగలవు. నన్ను నీ అనురాగ వాహినిలో ముంచగలవు."

"మరే, ముంచుతాను- చచ్చినా తేల్చను. అయినా డబ్బులేనిదాన్ని నన్ను కట్టుకొని నువ్వేం సుఖపడతావు. డబ్బులేనివాడిని నిన్ను పెళ్లాడి నేనేం సుఖపడగలను?"

"నువ్వు డబ్బున్న మనిషినా పెళ్ళాడేది ?"



"డబ్బున్న మనిషిని."

"అలా అయితే నాకు ఇవాళో, రేపో రెండు వేల రూపాయలు వస్తాయి. వాటితో గిండీ రేస్ కోర్సులో బుక్ పార్ట్‌నర్ గా చేరతాను. బోలెడు డబ్బు వస్తుంది. సుమారు సీజన్‌లో నెలకు 4, 5 వేలు వంతున నెల నెలా గిట్టుబాటవుతుంది."

"రెండువేలు ఎలా వస్తాయి ?"

"మా రామకృష్ణప్రసాద్ మామయ్య యిస్తాడు."
"ఎందుకిస్తాడు ?"

"ఎందుకేమిటి ? అడిగాను. ఇస్తానన్నాడు."

వెంటనే పదివేలు అడిగిన రత్నప్రభనలా అట్టె పెట్టి ఈ దగుల్బాజీకి రెండువేలిస్తానన్నందుకు సుజాతకి ఎక్కడలేని కోపమూ వచ్చింది. ఆయనగారు కనబడితే నాలుగూ పెట్టి దులిపి పారేయాలనుకుంది."

"కాంతీ, విసిగించకు. నిన్ను పెళ్లాడలేనూ, నీకు నామీద ప్రేమ వుందని తెలుసు. కాని నేను నిన్ను ప్రేమించలేను. పెళ్ళి చేసుకోలేను. నన్ను పోనీ పూనమల్లి ఫోనులోకి."

"నేనూ వస్తాను."

"వీల్లేదు. నేనొక్కర్తినే వెళ్ళాలి."

"పోనీ గేటుదాకా వస్తాను."

"సరేరా," అంది గేటుతో నైనా వదులుతాడని.

గేటుదాకా వచ్చి "మైడియర్ సాయంత్రానికి తిరిగి వచ్చేయి. మహాకవి మార్తాండశాస్త్రి కవితాగానం వుంది. అంతకుముందు పసందయిన విందు భోజనం వుంది."

"విందుకేంలే, రోజూ చేస్తున్నది విందు భోజనం లాగే వుంటుంది." అంటూ ఒక చిన్న మధుర మందహాసం అతనిపై సారించింది.

దానికి ఉబ్బితబ్బిబ్బయి పోయాడు కాంతి. ఆమె టౌనులోకి నడిచే వెళ్లాలని బయలుదేరింది. ఇంతలోనే వెనక నుంచి చప్పట్లు వినిపించాయి "ఆగు సుజీ, ఆగు" అంటూ ఆ ప్రాంతంలోనే దొరికిన ఒక రిక్షాలో కూర్చుని సుజాత నిలబడిన చోటుకి వచ్చి రిక్షాలోంచి దిగిపోయి "రిక్షాలో వెళ్లు. డబ్బులు నేనిచ్చేశానులే; నడిచి వెడితే అలసిపోతావు. దగ్గరగా ఆరు ఫర్లాంగులుంది." అన్నాడు కాంతారావు. పూనమల్లిలో రాజా వీర వెంకట సత్యనారాయణరావుగారు నిర్మించిన విజయమహల్ సినిమా థియేటర్ దగ్గర సుజాత రిక్షాలోంచి దిగిపోయింది. తన స్నేహితురాలు, మహాకవి మార్తాండశాస్త్రి భార్య సరస్వతిని విజయమహల్ కాంటీన్‌లో తన్ను కలుసుకోమని చెప్పింది. కాంటీన్‌లో సరస్వతి లేదు. ఇంకా రాలేదనుకొంది. థియేటరు మెట్ల మీద నిల



బడి వున్న సమయంలో ఆ థియేటరు బిల్డింగ్‌లోనే ఒక ప్రక్క వున్న నేషనల్ హెయిర్ కట్టింగ్ సెలూన్ నించి బయటకు వస్తున్న రామకృష్ణప్రసాద్‌ను చూసింది.

రామకృష్ణప్రసాద్ చక్కగా క్రాప్ చేయించుకుని, గడ్డం గీయించుకుని శిరోజాలకు షాంపు పట్టించి తలదువ్వించుకుని బయటకు వస్తూ సుజాతను చూసి "హల్లో!" అన్నాడు.

ఆయనను చూడగానే రత్నప్రభ గుర్తు వచ్చింది. కోపంతో శరీరమంతా వూగిపోయినా ఆ ఉద్రేకాన్ని ఆపుకుని "సార్, రెండు నిముషాలు మీతో మాట్లాడాలి" అంది.

"రా అమ్మా," అంటూ విజయమహల్ మేనేజరు గదిలోకి తీసుకువెళ్ళాడు. రెండు సమోసాలు, టీ తెచ్చి కాంటీన్ బాయ్ ఆమె ముందు వుంచాడు. రామకృష్ణప్రసాద్ టీ మాత్రమే త్రాగాడు.

"నేను మాట్లాడదలచింది మీ అమ్మాయి రత్నను గురించి అంది ఠపీమని.

"ఆ! అయితే రత్నను నువ్వెరుగుదువా!"

"చిన్ననాటినుంచి ఎరుగుదును. మేము కలిసి చదువుకున్నామండీ! పాపం వాళ్ళు చాలా యిబ్బందుల్లో వున్నారు. నేను యిక్కడకు బయలు దేరిన రోజుకు ముందు రోజున రత్నయింటిలో నేను టీ త్రాగాను."

"సరే, ఆమెకు సహాయం చేయాలనేవుంది. కాని నా యిబ్బందులో..."

"ఇబ్బందులంటారు. కాంతికి రెండువేలు ఇస్తానన్నారట?"

ఆ మాటకి పచ్చి వెలక్కాయ గొంతులో పడింది రామకృష్ణప్రసాద్‌కి.

"నీకు చెప్పాడా?"

"అవును."

"నువ్వెవరికి చెప్పావు?"

"ఎవరికీ చెప్పలేదండీ."

"చెప్పకమ్మా! వెధవనోట్లో నువ్వుగింజ నానదు. వూరంతా వాగుతున్నాడేమో కదా ప్రారబ్ధం. అయినా మా ఆవిడకు కొత్త నెక్లెస్ కొంటానుగా, దీనిలో దొంగతనం ఏముంది? పిల్లకు పంపడం కోసమేగా ఈ బాధలన్నీ."

"మీరంటున్నది నా కర్థం కావడంలేదు. కాని నిజంగా మీ కామెకు సాయపడవలిస్తే ఏం చేయవలసినా నేను చేస్తాను."

"అంతేనమ్మా! వాడివల్లకాదు. అయితే కర్తవ్యం చెబుతాను విను," అంటూ రామకృష్ణప్రసాద్ ఆ రాత్రి విందుకు తర్వాత కవితాగానంలో భార్య మెడలోని నెక్లెస్



తస్కరించి యిస్తే రాళ్లు పీకించి బంగారం అమ్మి కూతురు కోరిన పదివేల రూపాయలు పంపగలను" అంటూ చెప్పేశాడు.

"అయితే అదే తపని నేను ఎలాగైనా తెచ్చి యిస్తాను చూడండి" అంది.

"మనస్సులో పెట్టుకో: ఎవరితో నన్నావా! పుష్పావతి నా ప్రాణం తీసేస్తుంది." అన్నాడు రామకృష్ణప్రసాద్ దీనంగా.

"మీకేం మాటరాదు. సరేనా!" అంది. ఇంతలో సరస్వతి వచ్చింది.

"నా స్నేహితురాలు వచ్చింది. సెలవిప్పించండి" అంది సుజాత.

అంతేగాని మహాకవి మార్తాండశాస్త్రి భార్య అని మాత్రం చెప్పలేదు.

సుజాత పూనమల్లి హౌసుకు వెళ్ళిందని తెలియగానే కవితాగానం రాత్రి విందు తర్వాత కదా అనుకుంటూ పి. పి. రావు వెళ్ళాడు. థియేటర్ ఫాయిర్‌లో వారు నిలబడివుండగా సుజాత పి. పి. రావు అలా వెడుతుండగా చూపించి "ఆయనేనా నీ భర్త?" అని అడిగింది.

"వాడెవరో నాకు తెలీదు. మా వారికి రాజమండ్రిలో సన్మానమట. రేపు రాత్రి నన్ను రమ్మని బతిమాలుతూ ఒక

ఉత్తరం రాశారు. నేను ఇవాళ మెయిల్‌కే వెళ్ళిపోతున్నాను అంటూ ఆ ఉత్తరం ఆ రోజే మనియార్డరు చేసిన వంద రూపాయలు చూపించింది. సుజాత నిర్ఘాంతపోయినా కనిపించనీయలేదు పైకి.

సరస్వతికి టిఫిన్, టీ యిప్పించి సుజాత తిరిగి వచ్చింది ఇంటికి. తోటలోని తన కుటీరంలో కూర్చుని ఆ నాటి రాత్రి చదవవలసిన మహాకవి మార్తాండశాస్త్రి రచనలు, కవితలు వల్లిస్తున్నాడు పి. పి. రావు.

# 14

"కనిగారూ! నేను టౌనులోకి వెళ్ళి వచ్చాను."

"అంటే మద్రాసుకా ?"

"మద్రాసు సిటీ పూనమల్లి టౌన్ క్రిందే లెక్క. అది గ్రామం కాదుగా; అక్కడకు నా ఫ్రెండ్ సరస్వతి వచ్చింది. మీరు విజయమహల్ సినిమా థియేటరు ముందు నించే వెడుతున్నారు. అవునా?"

"నువ్వు చూశావా ? నేను నీ కోసమే వచ్చాను. తిరిగి వచ్చేటప్పుడు మద్రాసు నుంచి తిరిగి కారులో వస్తున్న రాజాగారు కనిపించారు. కారులో వచ్చారు. ఇంకా పది నిముషాలు కూడా కాలేదు"



"మీరు భలే నాటకం ఆడారే; సరస్వతి త్రాగుతుందని కంచం విసిరేసిందని అసలు ఆమె మిమ్మల్ని ఎరగనంది. ఎప్పుడూ చూడలేదంది. మీ యిద్దర్నీ కలపాలనీ, సంసారం నిలపాలని ఉద్దేశించే నేను సరస్వతికి రమ్మని టెలిఫోన్ చేశాను."

"దీనిలో నాటకం ఏమీ లేదు. కళ్ళజోడు బుక్ సెంటర్‌లో మరిచిపోయి-దృష్టి సరిగా ఆనక ఆయన క్లబ్బులో తూలిపడితే నేను నా కుర్చీ యిచ్చాను. మార్తాండశాస్త్రి గారికి మరో కుర్చీ వేశాను. అక్కడ కూర్చున్నంత సేపూ రాజాసాబ్ తనతోట-పూల మొక్కల గురించే మాట్లాడి బోరు కొట్టారని పైగా టిఫిన్, కాఫీ లిప్పించి కనీసం సిగరెట్ అయినా ఆఫర్ చేయక-ఎదుట పూల అంగడి కనిపిస్తే ఒకసారి-నువ్వు వచ్చావని ఒకసారి పరుగెత్తి కళ్ళజోడు తిరిగిరాగానే-మార్తాండశాస్త్రి ననుకోని క్షమార్పణ చెప్పడమేగాక కారులో తనకూడా యిక్కడికి రమ్మంటే-నిన్ను చూసి నిలబడలేక కనీసం ఆయన పరువునైనా దక్కించడానికి నిన్ను చూడాలని మార్తాండశాస్త్రిని నేనే అని నాటకమాడాను. ఒకరి నష్టం. మరొకరి లాభం అన్నారు. మార్తాండశాస్త్రి సన్మానాన్ని 1116 రూపాయల బహుకృతిని పోగొట్టుకున్నాడు. నాకు నువ్వు దక్కావు. వర్షంలో తడుస్తున్నప్పుడు గొడుగు యిచ్చానే అప్పుడే నిన్ను ప్రేమించాను.

ప్రేమించడమేనా! నీకిష్టమైతే పెళ్లాడటానికే సిద్ధంగా వున్నాను. అయితే కలువ రేకుల్లాంటి నీ పెద్దకళ్ళను చూసి ప్రేమ మాటంటే విరుచుకుపడతావేమోనని నిజంగా భయపడ్డాను

ఓ సుజాతా! ఓ నా హృదయాధిష్టాన దేవతా! నీ సౌందర్యం చూసి ఎందరు ప్రేమించారు? ఎదురుగా కాంతారావు నిన్ను ప్రేమించేస్తున్నాడు. కనీసం దయవుంచి నీ లవర్స జాబితాలో అట్టడుగున నా పేరు కూడా చేర్చు. బాగా ఆలోచించే- నీ మనస్సు కుదిరితే ఇంటర్వ్యూ గ్రాంటు చెయ్యి. లేదా! "ఆర్" అని కేపిటల్ లెటర్సలో ఒక అక్షరం చీటి మీద రాసి పంపించు. రిజెక్టెడ్ అని అర్థం చేసుకుని, నా కర్మాన్ని నేను నిందించుకుని వరసగా డజన్ల నిట్టూర్పు విడిచి కళ్ళలో నీరు ఇంకిపోయే వరకూ ఏడ్చి వూరుకుంటాను. ఇంతకీ నా కవితాగానం వినడానికి వస్తావా?"

"రాను"

"వండర్! ప్రతిదానికీ ఓనని చెప్పేదానివి ఇవాళ నేను అడగ్గానే నో అని నిర్మొహమాటంగా చెప్పినందుకు నిన్ను అభినందిస్తున్నాను." అంటూ పి. పి. రావు సిగరెట్ అంటించాడు.

పి. పి. రావు చిత్తశుద్ధి ఆమెకు నచ్చింది. అతడు



మాట్లాడిన తీరు ఆమె హృదయానికి హత్తుకుపోయింది. ఎందరో ఇంతకుముందు ఆమెను ప్రేమించామన్నారు. పెళ్లాడమన్నారు. డబ్బున్నా లేకపోయినా, పి. పి. రావు మనసువిప్పి చెప్పినందుకు సుజాత ఎంతో సంతోషించింది. పెళ్ళి చేసుకోవాలనే కోరిక కలిగితే పి. పి. రావును తప్ప మరొకర్ని పెళ్లాడకూడదనుకుంది. కాంతారావు పట్టి చపల చిత్తుడనుకుంది.

"మీరు నా కోసమే పూనమల్లి వచ్చారు" అని అడిగింది.

నా హృదయాన్ని కోసి చూస్తే హనుమంతుని హృదయంలో సీతారామలక్ష్మణులున్నట్లు నీకు సమాధానం లభిస్తుంది.

"ఒకవేళ నువ్వు మార్తాండశాస్త్రి కావని, మహాలేకపోయినా నటికైవి కూడా కాదని అందరితోనూ వెల్లడిస్తే నన్ను వారించేవారెవరు?" అంది.

"నీ దయాంతఃకరణ, నీ హృదయంలోని మార్దవం, నీ స్నేహానురాగాలు అంతపని చెయ్యనివ్వవు" అన్నాడు.

అతనితో జీవితం ఒకక్షణం కూడా నిరుత్సాహంగా వుండదని ఆమె గ్రహించింది. అతడు తనని తప్పక సుఖపెట్ట గలడనుకొంది.

ఒకవేళ యిబ్బందిపడినా, అతని సరస సంభాషణలో ఏ కష్టనిష్టూరాలు లెఖ్ఖలోకి రావనుకుంది."

ఇంతలో శర్మ గంట వాయించి "సుజాతాదేవిగారూ! మహాకవి మార్తాండశాస్త్రిగారూ! రాజాగారు రమ్మంటున్నారు. విందు భోజనం చేసి వెంటనే అతిథులందరూ తమ సీట్లలో వుండగానే కవితాగానం చెయ్యమని శ్రీ వీరవెంకట సత్యనారాయణరావు జమీందారుగారూ, వారి సోదరీమణి శ్రీమతి పుష్పావతీ దేవిగారు మీకు చెప్పమన్నారు" అన్నాడు.

సుజాత "నేను విందులో పాల్గొంటాను. కాని మీ కవితలు వినలేను. క్షమించండి." అంది సవినయంగా.

ఇద్దరూ విందులో ఒకరి సరసను ఒకరు కూర్చున్నారు. విందారగించారు. తనకోసం అమర్చబడిన వేదిక దగ్గరకు పి. పి. రావు ఉరఫ్ మహాకవి మార్తాండశాస్త్రిగారు వెళ్ళడం, సు-తె సిగ్గుసం ఒక్కసారే జరిగాయి. పి. పి. రావు వేదిక దగ్గర నిలబడగానే ఒక్కసారి సీట్లలో తనవైపు తిరిగి ఉత్కంఠతో తన కవితల నాలకించడానికి ఉద్యుక్తులై వున్న పెద్దలను, పిన్నలను, యువతులను, స్త్రీలను చూశాడు. ఒకసారి గొంతు సవరించుకున్నాడు. రేడియోలో ఉదయం స్విచ్ ఆన్ చెయ్యగానే వెంకటేశ్వర సుప్రభాతం వినిపించినట్టు పి. పి. రావు కంఠం.

ఆర్యులారా! మీరందరూ మహానుభావులు.

మీకందరికీ వందనములు. ఇపుడు కవితాగానం చేస్తాను వినండి, అంటూ ప్రారంభించాడు.



"వాడలా! ఇవి మురికి వాడలు గాని
పేటలా యివి మురికి పేటలు గాని

ఇటు చూసిన చెత్తా చెదారం. అటు చూసిన మురికి కాల్వలు

వీధి మధ్య పీనుగల పెంటలు.
కాల్వలై పారు మానవ రుధిరం.
భయం గొలుపు నరుల కంకాళాలు.

ఇది మహా క్షామ సమయం. తిండిలేక
తిప్పలు లేక మానవుల ఆక్రందనలతో
మరుభూమిగా తోచెను దేశం"

అని ఆగాడు. ప్రేక్షకుల హర్షధ్వానాలతో హాలు మారుమ్రోగింది.

ఇది మన పాప ఫలితమా; లేక శాపమా ఏదో
తెలియక నోట దిక్కు తెలయక నిలబడ్డ
యాత్రికునివలె- చుట్టు క్రమ్మిన కారు మేఘాలను
చూసి తుఫాను రేగునని భయపడ్డ ప్రయాణీకునివలె
ప్రస్తుతం మాస్నమేగాని, మహా మారణ
హోమం నుంచి తప్పుకొనే మార్గాన్నే మనం
ఆలోచించడమే లేదు, అని పి. పి. రావు మళ్ళీ ఆగగానే

ప్రేక్షకుల హర్షధ్వనాలు మిన్నుముట్టాయి.

హత్యలు-అత్యాచారాలు-ప్రేమలు విడాకులు
పసిపిల్లలు పాలు లేక తల్లులు తిండి లేక
తండ్రులు పనులు లేక దౌర్భాగ్యంలో-దారిద్ర్యంలో
మునిగి రోదిస్తున్న రోజులివి. మళ్ళీ ప్రేక్షకుల చప్పట్లు,

సరిగ్గా ఇదే సమయంలో దీపాలారిపోయాయి. "కరెంటు పోయింది. వచ్చేవరకూ కవితాగానం సలిపి వేయుదునా."

"చదివింది చాలు! చీకటిలో మీరేం చదువుతారు?" అని ఒక ప్రేక్షకుని కంఠం వినిపించింది.

"అయ్యో! నా నక్లెస్!" అంటూ పుష్పావతి కెవ్వున కేక వేసింది.

ఇంతలో ముందు హాలు కిటికీ తలుపులు తెరవబడ్డాయి. మెట్లమీద కూర్చున్న సుజాత తన ప్రక్కనే ఏదో ధడేల్ మని పడ్డ శబ్దంవిని అటు చూసింది

పుష్పావతి కంఠసీమనంత వరకూ అలంకరించిన వజ్రాల హారం కను రెప్పపాటు కాలంలో తీసుకుంది.

"ఎక్కడ దాచనా?" తిరిగి లైట్లు వస్తాయేమో అనుకుంది. మెట్ల ప్రక్కనే వరుసగా సోల్జర్లవలెవున్న పూల కుండీలను చూసింది. మూడవ కుండీలో పెరుగుతున్న పెద్ద క్రోటన్ మొక్క ఆకుల మధ్య పడవేసింది. మూడు-మూడు-మూడు అని పదిసార్లు మనసులో అనుకుంది. తిరిగి లోపలకు పరుగెత్తింది.



కొంచెం ఆలస్యంగా వచ్చిన కుక్కుటేశ్వరరావుకు నెక్లెస్ కనబడలేదు.

శర్మ మెట్ల దగ్గరకు వచ్చాడు. సుబ్బయ్యా! అని అరిచాడు.

ఏ మూలనోవున్న సుబ్బయ్య పరిగెత్తుకుంటూ వచ్చాడు శర్మ దగ్గరకి.

సుబ్బయ్య రాగానే 'జయ'ను ఇలా పంపు అన్నాడు శర్మ. ఇంతలో హారం కనిపించని కుక్కుటేశ్వరరావు స్విచ్ ఆన్ చేసేసరికి భవనమంతా లైట్లు వచ్చాయి. ప్రేక్షకులు ఒక్కొక్కరే లేచి వెళ్ళిపోగానే శర్మ తివాచీ క్రింద వెతికాడు ఆ కుర్చీలన్నీ అటుఇటు తిప్పి హారం ఎవరైనా అక్కడ పెట్టారేమో అని చూచాడు.

ఇంతలో పైకి పని మనిషిగా చెలామణి అవుతూ ఆ యింటి ఆనుపానులన్నీ తెలుసుకోవడానికి వచ్చిన డిటెక్టివ్ జయరానే వచ్చింది.

"ఏమిటి పిలిచారట? దేనికి?" అని అడిగే వరకూ ఆమె వచ్చినట్టే గ్రహించని శర్మ "అబ్బ ఎంత చడీచప్పుడు లేకుండా వచ్చావు? అని అడిగాడు ఆశ్చర్యంగా.

"అది నాకు అలవాటే! ఏమిటి విశేషం?" అంది జయ.

"పుష్పావతీదేవి డైమండ్ నక్లెస్ పోయింది."

"ఎప్పుడు?"

మహాకవి మార్తాండశాస్త్రినని చెప్పుకుంటూ నాటకం ఆడుతున్నవాడు పద్యాలు చదువుతుండగా దీపాలు ఆరిపోయాయే అప్పుడు.

"వెంటనే ఎందుకు చెప్పలేదు? ఇప్పుడు ఇంత నింపాదిగా చెబుతున్నావేమిటి? దీపాలు ఆరిపోయినప్పుడు అసలు ఏం జరిగింది?"

అంతా కల్లోలంగా మారింది. విందుకు వచ్చిన వాళ్లు, కవితాగానం వింటున్న వాళ్ళు అంతా పెద్ద మనుషులే.

అయితే పెద్ద మనుషులు మాత్రం 50 వేల రూపాయల నెక్లెస్ దొరికితే అలా వదిలి వేస్తారా? అదేం చేదా? విషమా? అయితే ఆ మార్తాండశాస్త్రి నంటున్న వాడిని చూడలేకపోయావా! వాడే దొంగ అని నా అనుమానం.

"మొట్టమొదట నేను సోదా చేసిందే వాడిని. అతడు తన జేబులన్నీ దులిపి చూపించాడు."

"జేబులు దులిపి చూపించాడులే లేకపోతే మెడలో ధరిస్తాడా!"

చివరకు నెక్లెసు వాడికే అందుతుంది. దాచడానికి వాడికే చోటుంది. ఎక్కడో తోటలో గదా వుంటున్నాడు.

"మిష్టర్ శర్మ, ఇది ఒకడి పనిగాదు. దీనిలో కనీసం ముగ్గురు పాల్గొని వుండాలి. ఒకరు నెక్లెస్ లాగేశారు. ఆ తర్వాత కిటికీలోంచి గిరవాటేశారు. మరొకరు అక్కడే



వుండి తీసుకున్నారు దాన్ని. వేరొకరు దాచి వేశారు. ఇందులో తోడు దొంగలు సుజాత, పి. పి. రావులు. ముందు వాళ్ల గదులు వెతకాలి" అంది జయ.

అదే నేనూ అనుకున్నాను. రంజి. దీపాలు ఆరిపోయి, కవితాగానం నిలిచిపోగానే సింహద్వారం ప్రక్క మెట్ల మీద మార్తాండశాస్త్రి కనిపించాడు. అతడు సుజాతతో మాట్లాడుతున్నాడు. ఆ సుజాతమ్మ కవితాగానం వినడానికి రానంది. మెట్లమీదనే కూర్చుంది.

"చెప్పలేదూ! ఆ మార్తాండశాస్త్రి పేరు పెట్టుకున్న ప్రబుద్ధుడూ సుజాతా, భాగస్వాములు. వీళ్ళుగాక మరొకడున్నాడు. మార్తాండుని నౌకరునని చెప్పుకుంటున్న దొంగ. వాడు తన పేరు రావు అన్నాడు. వాడిలో నౌకరు కుండే వినయం, నమ్రత; మచ్చుకైనా లేవు. దొంగతనాలు చేసి, ఆ వచ్చిన డబ్బుతో దర్జాగా బ్రతుకు వెలగబెట్టే లక్షణాలే గాని" అంది డిటెక్టివ్ జయ.

మనం జాగు చేయరాదు. వెంటనే చర్య తీసుకోవాలి. లేకపోతే నెక్లెస్ చేయి దాటుతుంది. ఆనందభవనం ఆవరణ నుంచే దాటించవచ్చు." అన్నాడు శర్మ.

చర్య తీసుకోవాలి. నిజమే కాని తెలివితక్కువగా మాత్రం కాదు. అది యింతవరకూ తోటలోనో_ కాదు భవనం ఆవరణలోనే వుంది. మూడుపాళ్ళు భవనంలోనే_ మెట్లకు చేరువుగా ఏ కిటికీల్లోనో దాచబడి వుండవచ్చు. సరే కాసేపు వేచి చూద్దాం అంది జయ.

# 15

నెక్లెసు పోయినప్పటినించీ శర్మకి నిద్ర పట్టడం లేదు. రెండవ అంతస్తులోని అతని గదిలో మంచంమీద పడుకొనే పొర్లాడుతున్నాడు. ఏ మాత్రం శబ్దమయినా వినిపిస్తే ఉలికిపడుతున్నాడు. మిస్ జయ అందరి గదులూ వెదికింది. ఫలితం శూన్యమని శర్మతో చెప్పి ఉదయమేగాని రాత్రివేళ యిక ఎవరినీ సోదా చేసినా లాభం వుండదంది.

కాసేపలో పడుకుని శర్మ వంగపండు రంగు లుంగీ, చొక్కా ధరించాడు. రెండో అంతస్తులోని తన గది నుంచి బయటకు వచ్చాడు. బాల్కనీ మీద నిలబడ్డాడు. బయట ఆవరణమంతా నిబిడాంధకారబంధురంగా వుంది. ఆచీకటిలో ఏమైనాకనిపించక పోతుందా, ఏమైనావినిపించక పోతుందా అన్న శిలా విగ్రహంలా అరగంట నిలబడ్డాడు.

క్రిందకు దిగి బయటకు వెడితే ఏమన్నా లాభం వుంటుందేమో అనుకున్నాడు. టేబుల్ మీద వున్న తన కళ్ళజోడు ధరించాడు రెండవ అంతస్తునుంచి మొదటి అంతస్తు దగ్గరకు వచ్చాడు. కుమారరాజా లక్ష్మీకాంతారావు అజాగ్రత్తగా, అలక్ష్యంగా అక్కడే పడవేసిన గోల్ఫు బంతి మీద అడుగువేసి 16 మెట్లమీద నించి క్రిందకు జారి మొదట అంతస్తులో పడ్డాడు. నడుం విరిగి పోయిందేమోనని ఒకింత సేపు తొట్రుపాటుతో నడుం పట్టుకుని చూసుకున్నాడు.



మొదటి అంతస్తులోని గదిలో వున్న సుజాత అంతకు ముందే తన గదినించి బయటకు వచ్చింది.

వస్తూ చీకటిలో వరండాలో వున్న ఒక చిన్న టేబుల్ తన్నింది. ఆ తాపుకు ఆ చిన్న టేబులు, దానిలోని ఫ్లవర్ వేజ్, రాజాసాబ్ గారి ఫోటో అన్నీ క్రింద పడ్డాయి. ఆ సవ్వడికి ఇంట్లోవాళ్ళందరూ లేచి బయటకు వస్తారేమో అని భయపడింది. అయిదారు నిముషాలు నిరీక్షించింది ఎవరూ రాలేదు తిన్నగా సింహద్వారం వద్దకు వచ్చింది.

గడియగా వేయబడిన ఇనుపకడ్డీ తీసింది. మెల్లగా ఇనుపకడ్డీ తీసింది. మెల్లగా తలుపులు తెరిచింది. పూల కుండీల వైపు నడిచింది.

రెండవ అంతస్తులోంచి, గోల్ఫు బంతి మీద అడుగు వేసి మెట్లు దిగనక్కర లేకుండానే జారి మొదటి అంతస్తులోకి జారిపడిన శర్మకు మళ్ళీ జారి పడకుండా, ఈసారిజారి పడితే శరీరంలోని ఏ భాగమైనా లోపించకలదనే భయంతో లైటు ఆన్ చేశాడు.

అకస్మాత్తుగా చీకటిలోకి నడిచిన అందాల భామ సుజాత ఒకటి, రెండు నిముషాలు ఆగింది. వంగ పండు రంగు లుంగీ ధరించిన శర్మనుచూసింది. శబరిమలై వెళ్ళే భక్తుడిలా చీకటి ఛాయలో కలిసిపోయే నల్లలుంగీ అయినా ధరించి వుంటే బాగుండుననుకుంది. తాను నెక్లెసు పడవేసిన పూల

కుండీ నెత్తుకుని ఆ అంధకారంలోనే పరుగెత్తి గుబురుగా పెరిగిన మల్లె పందిరిలో పెట్టింది. ఆ తర్వాత మెల్లగా నడచి వచ్చి శర్మ ఎక్కడ వున్నదీ ఆ చీకటిలో గమనించలేక లోపలకు వెళ్ళి గడియ వేసి లైటు ఆర్పి వేసింది.

దీపం ఆర్పివేయబడటం గమనించిన శర్మ బయట లుంగీతో చలిగాలిలో నిలబడ్డం కంటే రాత్రి అంతా పడుకుని తెల్లవారగానే బయటకువచ్చి వెదకవచ్చు ననుకున్నాడు. శర్మ కవి అయివుంటే ఆ తోటలోని పూలమొక్కల నుంచి వీచే సుమధుర సౌరభానికి పరవశించి పోయేవాడు. శర్మ కవికాడు గనక ఆ తోటలో ఎటుసించి అయినా ఏ పామైనా వచ్చి కాటు వేయవచ్చని భయపడ్డాడు. హడావుడిగా పరుగెత్తుకు వచ్చాడు. దీపాలు ఆరిపోయి చీకటిలో మునిగిపోయి వున్న భవనం సింహద్వారం తట్టాడు. బదులు లేదు. తపీమని తన్నాడు. కాలి వ్రేళ్ళకు దెబ్బ తగిలింది కాని ఫలితం లేక పోయింది. దభీదభీమని తలుపులుబాది ఇంటిల్లిపాదినీ విందుకు వచ్చి రాత్రికి అక్కడే వుండిపోయిన కొందరు అతిథులను లేపేకంటే ఇతర మార్గాలను అన్వేషించడం మంచిదను కున్నాడు. భవనంచుట్టూ తిరిగాడు. గాలికోసం తెరవబడి వున్న గది కిటికీల దగ్గర ఆగాడు. ఆపడుకున్న వారెవరైనా లేచి తలుపులు తీస్తారేమో అని సన్నగా ఈలవేసి అయిదు నిముషాలు ఆగాడు. అయిదు నిముషాలకూ లేవకపోతే ఇంకా గాఢ సుషుప్తిలో మునిగే వున్నట్లు భావించి మరో



గది కిటికీ దగ్గరకు వెళ్ళి ఈలవేశాడు. హాలులోని గోడ గడియారం మూడు గంటలు కొట్టింది. మానవుడు ఏ పరిస్థితినైనా అతి తేలికగా రానున్నది రాక మానదు. కానున్నది కాకమానదు. అనే వేదాంత దృష్టిలో చూడగలిగినప్పుడే సుఖం పొందగలడని ఒక సామెత. దీనికి ఉదాహరణగా ఒక కథకూడా వుంది.

ఒక దేశంలో ఒక పెద్ద మనిషి. ఒక పెద్ద మర్రి చెట్టుకింద పొలంలో పడుకున్నాడట. ఆ పొలంలో అతను పడుకున్నచోట మొక్కలు పెరిగి తెల్లవారేసరికి పది అడుగుల ఎత్తుకు లేచి పోయివున్నదట ఇక ఏమయితే అది అయిందని ఆ మొక్కలమీద అలాగే పడుకునివుండి పోయాడట. అయితే శర్మ అలాటి వేదాంత దృక్పథంలో ఇక రెండు గంటలాగితే తెల్లవారు తుందిగదా. అప్పుడెలాగూ తలుపులు తెరుస్తారని లోపలకి పోవచ్చునని భావించలేకపోయాడు ఊహించలేక పోయాడు.

ఆ తోట సౌందర్యమూ అతన్ని ఆకర్షించలేదు. మామిడి చెట్టుమీద కూర్చుని కోయిల పంచమ స్వరంలో చేస్తున్న కుహూకూజితమూ అతనికి పారవశ్యం కలిగించలేదు. ఎడమ పాదంమీద పుండు జోడు తొడుక్కుని నడవడంతో రేగి మరింత బాధ. నొప్పి కలగడంతో వాటిని వదిలేసి మెట్లమీదనే పడుకుని ఆలోచించసాగాడు.

పుష్పావతిగారి నెక్లెసు డిటెక్టివ్ జయ సూచించినట్లు భవనంలోనే ఎక్కడో వుండవచ్చుననుకున్నాడు లేదా ఏ కిటికీలోనైనా భద్రంగా పొట్లంచుట్టి దాచబడి వుండాలనుకున్నాడు.

ఈ ఆలోచనలన్నీ శర్మ మనో వీధిని సినిమా రీల్సులా తిరుగుతూ వుండగానే- నాలుగు గంటలు కొట్టింది, గోడ గడియారం. ఆ తర్వాత మరో అరగంట కొట్టింది. అప్పటికీ తెల్లగా తెల్లవారలేదు. ఇంకా చీకటిగానే వుంది. ఈదర గాలి వీస్తోంది. లుంగీతో బయట కనిపించటం బాగుండదని భవనం చుట్టూ మరోసారి తిరిగాడు. ఏ కిటికీలోంచి అయినా లోపలికి పోవడానికి అవకాశం వుంటుందేమోనని, అయితే దుర్గంలో అభేద్యంగా సుమారు అర్థశతాబ్దం క్రితం నిర్మించిన చెక్కు చెదరకుండా నిలబడివున్న ఆ భవనంలో ఏ ఒక్క కిటికీ ఎక్కడానికి అతనికి అందుబాటులో కనిపించలేదు.

వరసన కిటికీలు లెక్క పెడుతూ అయిదో కిటికీ దగ్గర ఆగాడు. అది రాజా వీర వెంకటసత్యనారాయణరావు గారి గది. ఇక ఆయనను లేపడమే మంచిదనుకున్నాడు.

సుజాత వచ్చిననాడు శర్మను పిలవడానికి పి. పి. రావు పూలకుండీ గిరవాటేశాడు. దానిని శర్మ రాజాగారికి విన్నవించగా ఆయన- ఆ మాటకు తారుమారుగా భాష్యం చెప్పారు. పూలకుండీని శర్మ మహాకవి మార్కండశాస్త్రి



మీద గిరవాటు వేశాడని, అలాకాదు మొర్రో అని శర్మగారు మొత్తుకున్నా రాజాగారు వినిపించుకోలేదని.

అక్కడ మెట్ల ప్రక్కనవున్న కుండీలను చూశాడు. అసలు అవి పదహారు-పదిహేనే వున్నాయి. పదహారోది వుందనే సంగతి శర్మకు జ్ఞాపకం లేదు. ఒక్కొక్క కుండీనే ఎత్తి-రాజాగారి గదిలోకి గిరవాటు వేయసాగాడు. వన్-టు-త్రీ అని లెక్క పెట్టసాగాడు. మొదటికుండీ రాజాగారి మంచానికి దూరంగా పడింది. రెండోది మంచానికి తగిలి పడింది. మూడవది మంచం మీదనే పడింది. చివరికి పదిహేనవ కుండీ రాజాగారికి తగిలింది.

ఎనిమిది గంటలు ఒక్కసారి పదిగంటలు ఖరాగా నిద్రపోయే అలవాటున్న రాజాగారు పదిహేనవకుండీ తనకు తగలడం నిద్రాభంగమై లేచి కూర్చున్నారు- ఏమిటీ పూల కుండీల వర్షం అని ఆశ్చర్యపోయాడు. వడగళ్ళు కురవడం వుంది కాని కిటికీలోంచి కుండీల వాన ఎలా కురుస్తుంది అనుకున్నాడు. లేచి డ్రస్ చేసుకున్నాడు. కిటికీలోంచి బయటకు తొంగి చూశాడు.

పదిహేను కుండీలు పడినా రాజాగారు మేల్కొననందుకు అదృష్టవంతుడు "ఆహా! ఏమి నిద్ర?" అనుకుని ఆ పచ్చిక మీదనే పడుకున్న శర్మకు ప్రత్యూష మంద పవనాలు వీచడంతో నిద్ర పట్టింది. రాత్రంతా నిద్రలేక పోవడంతో గాఢంగా నిద్రపోయాడు.

తెల్ల వారేసరికి దంతధావనాది కాలకృత్యాలు నిర్వర్తించి తోటలోని బావి దగ్గర స్నానంచేసి దుస్తులు ధరించి టిప్‌టాప్‌గా తయారైన పి. పి రావు ఉరఫ్ మహాకవి మార్తాండశాస్త్రి వచ్చి కిటికీలోంచి బయటకు తొంగి చూస్తున్న రాజావీర వెంకటసత్యనారాయణరావు జమీందారుగారినిచూసి "నమస్కారం రాజాసాబ్," అన్నాడు.

"కవి శేఖరా! ఆ దుర్మార్గుడికి మతి చలించింది. మీ దగ్గర కర్రవుందా లేకపోతే నేనిస్తాను. కర్రతో బాది లేపండి. నా గదిలోకి పదిహేను పూలకుండీలు గిరవాటేశాడు. వాడి బుద్ధి ఒక్కోసారి పెడతలను పడుతుంది. వాణ్ణే ఏం చెయ్యాలి? ఏం శిక్ష విధిస్తే వాడి పొగరుబోతు పనికి సరిపోతుంది?" అంటూ ఒక కర్ర గిరవాటేశారు.

"బాబాయి! శర్మా! తెల్లవారింది. లేమ్మా!" అంటూ పి. పి. రావు అనునయంగా లేపాడు.

"వుండవయ్యా! రాత్రంతా నిద్ర లేదు." అని ధరించిన లుంగీనే ముఖంనించి అరి కాళ్ళ వరకూ కప్పుకుని నిద్ర కొనసాగిస్తున్న శర్మను రాజాగారు కోపంతో "శర్మా! లేవరా! నీకేమైనా పిచ్చెత్తిందా!" అని కేక వేశారు.

రాజాగారి కంఠస్వరం ఖంగుమని దేవాలయంగంటలా చెవికి తట్టడానికి శర్మ వూపి లేపడంతో పై శర్మ లేచి కూర్చున్నాడు.



"ఏం కర్మరా! పూలకుండీలన్నీ నా గదిలోకి గిరవాటేశావు?" అని అడిగారు రాజాగారు.

"పుష్పావతమ్మగారి నెక్లెస్ ఏ పూల కుండీలోనైనా దాచారేమోనని" అన్నాడు.

మా చెల్లెలి నెక్లెస్ పూల కుండీలో దాచవలసిన కర్మ ఏం కాలింది! ఇంట్లో ఇనప బీరువాలు నాలుగైదువుండగా! విన్నారా మహాకవీ! వీడికి పిచ్చెత్తిందనడానికి ఇంకా ఏం తార్కాణం కావాలి?"

"శర్మ చెప్పింది అర్థమయింది లెండి"

ఇంకా వీణ్ణి ఉద్యోగంలో వుంచాలా: నా చెల్లెలు వీడు చాలా మంచివాడు. చాలా తెలివైనవాడు. వినయ సంపన్నుడు గుడ్డుగూసు, తెడ్డు తెలకపిండి" అంటుంది. ఇంతకు ముందే శర్మను బయటకు తోలెయ్యాలనుకున్నాను కాని పుష్ప ఏడుస్తుందని ఊరుకున్నాను. ఇప్పుడు వీడికి ఇవ్వవలసిన జీతం లెక్కచూసి యిచ్చి పొమ్మంటాను. నెక్లెసు కోసం పూల కుండీలన్నీ నా గదిలోకి నా మీద గిరవాటేసిన చవట సర్వీస్ నాకు అక్కర్లేదు. మహాకవి! ఇంకా సూర్యోదయమైనా కాలేదు. కావాలంటే కాస్సేపు నిద్రపోండి. నేను మరో గంట నిద్రపోయిగాని లేవదలుచుకోలేదు." అన్నాడు రాజాగారు.

"నేనింక నిద్రపోను సార్। ప్రత్యూషసమయం.

మందానిలం వస్తున్న సమయం చెట్లమీద పక్షుల కలవరపాటు చేస్తున్న వేళ. బాలభానుడు ఉదయం కాబోతున్నట్లు సూచనగా తూర్పున రక్తచందనం ముద్దలా అరుణోదయం సందడి-తోటలో గులాబులు వికసిస్తున్న వేళ-ప్రకృతి రామణీయకతను సంతరించుకున్న శుభసమయం. చక్కని కవిత వ్రాస్తాను." అంటూ మేడమెట్లవరకు ఆయనను సాగనంపి యువతలకు వచ్చాడు.

వున్న పూలకుండీలు పదిహేను. పదహారుండాలి. రాజాగారి గదిలోకి శర్మ విసరబడినవి పదిహేనుమాత్రమే. శర్మ ఆ కుండీలను తాను గిరవాటేసినది పుష్పావతిగారి నెక్లెస్ కోసం అన్నాడు. అదేక్లూ. పదహారు కుండీలు వుండాలి. దానికోసం వెదికితే అది కనిపిస్తే నెక్లెస్ దొరికినట్టే. పోతే హాలులో తాను కవితాగానం చేస్తున్నప్పుడు అక్కడ ముఖ్యంగా పుష్పావతి వెనకాల కూర్చున్నవారే. ఎవరు లాగేసి కిటికీలోంచి బయటకు గిరవాటేసి వుండాలి. ఆ గిరవాటేసినది మహాదేవి అయి వుంటుంది. సుజాత రాలేదు. కనుక నెక్లెస్ తీసినది కుక్కుటేశ్వరరావే అయి వుండాలి. అంటూ పదహారవకుండీ ఎక్కడవుందో చూడ్డానికి బయలుదేరాడు పి. పి. రావు.

హాలులోని గోడగడియారం ఆరు గంటలు కొట్టింది. సుజాత ఉలిక్కిపడింది అంతవరకూ ఈజీ చైరులోనే పడు



కుంది. రాత్రి తాను దాచిన పూలకుండీల్లోని నెక్లెసు తియ్యాలి. ఆ నెక్లెసును వీలు సమయం చూసుకుని రామకృష్ణప్రసాద్‌కు అందజేసి తరువాత చర్య ఏమిటని అడగాలి. అనుకుంటూ లేచి బయటకు వచ్చింది. ఎవరైనా అడిగితే అసలు తనకి సూర్యోదయానికి ముందుగానే లేచి కొంచెం దూరం షికారుచేసే అలవాటుందని చెప్పవచ్చునను కుంటూ తోటలోకి వచ్చి మల్లె పందిరి దగ్గరకు వచ్చి చూసింది పూలకుండీ లేదు.

# 16

నెక్లెసు పోయిందన్న విచారంతో క్రుంగిపోయిన పుష్పావతి వుదయం ఎనిమిది గంటలవరకూ నిద్రపోయి లేవనే లేదు. లేచి వేడినీళ్ళ స్నానం చేసి తన గదిలోనే సుబ్బయ్య తెచ్చిన వేడి ఇడ్లీలను తిని కాఫీ త్రాగి భర్త రామకృష్ణ ప్రసాద్ గదిలోకి వెళ్ళింది.

భార్య వదన మండలాన్ని క్రమ్ముకున్న విషాద మేఘాలను చూసి దగ్గరగా తీసుకుని "చెక్కుమీద కౌంటర్ సైన్ చెయ్యి. వెధవ నక్లెసుపోతే పోయింది. ఈ పూటే మద్రాసు సిటీకి వెళ్ళి పోయిన నెక్లెస్ కొన్న చోటనే ఎంత ఖర్చయినా కొత్తది కొని తెస్తాను." ఆ మాట అనగానే ఆమె ముఖాన్ని ఆచ్ఛాదించిన విచారమేఘాలు మటుమాయమైనాయి.

వెంటనే తన బీరువా తీసి భర్త చెక్కు పుస్తకం తెచ్చి ఓ చెక్కుమీద సంతకం పెట్టి, భర్తను భోజనం చేశాకో— లేక అంతకు ముందో ఫియట్ కారులో బ్యాంకుకి వెళ్ళి కొత్త నెక్లెసుకు ఆర్డరిచ్చి రమ్మంది.

రామకృష్ణప్రసాద్ ఆ తర్వాత లక్ష్మీకాంతారావును చూశాడు. తనకు నెక్లెస్ దొరకలేదని చెప్పాడు. వాడువట్టి చవట అని వాడివల్ల తను తలపెట్టిన కార్యం నెరవేరుతుందని ఏనాడూ వూహించని రామకృష్ణప్రసాద్ భార్య తనగదిలో కూర్చుని ట్రాన్సిస్టర్ రేడియో వింటూండటాన్ని చూసిన తర్వాత సుజాత కోసం చూశాడు.

తనకు నెక్లెస్ దొరికిందని. అయితే దాన్ని తను ఒక పూలకుండీలో పడవేసిదాన్ని మల్లె పందిరి క్రింద పెట్టి ఆ తర్వాత వెతకడానికి వెళ్ళినప్పుడు అది కనిపించలేదని ఎవరి చేతికి దొరికిందీ తెలుసుకుని తప్పక తెచ్చి ఇవ్వగల ధైర్యం తనకు వుందని చెప్పింది.

ఇంతకీ భార్య మెడలోంచి నెక్లెసు ఎవరు లాగారు? సుజాత దగ్గర లేదు. కాంతారావు దగ్గర అంతకంటే లేదు.

ఇంతకీ అది తన దగ్గరకు చేరేనా లేక పరహస్తం గతం గతః అన్నట్టు మరెన్నటికీ తనకింటపడదా అన్న విచారంతో రామకృష్ణప్రసాద్ క్రుంగిపోయాడు.

బయట తోటలో షికార్లు చేయడానికి బాగా అలవాటుపడిన రామకృష్ణప్రసాద్ ఆ రోజు ఉదయం జలుబుగా



వుందని కొంచెం దగ్గుతూ తన గదిలోనే ముసుగుతన్ని పడుకున్నాడు.

“ఏమండీ! పడుకున్నారు! బ్యాంకుకు వెళ్ళరా?” అని పుష్పావతి అడిగితే 11 గంటలకు లేపమన్నాడు.

సరిగ్గా అదే సమయంలో కుమారి మహాదేవి తోటలో పడమటివైపునవున్న ఒక చెట్టు దగ్గర నిలబడింది. ఇతరులెవరైనా ఆమెను చూసినప్పుడు ఏమిటీపిడ తనలోతనే మాట్లాడుకుంటుంది. అనుకుంటారు. కాని పరిశీలనగా చూస్తే ఆ చెట్టు ఆకులు కొమ్మలు ఒక్కసారి కదలడాన్ని బట్టి ఆ చెట్టు మ్రాను వెనుక ఒక మానవుడు నిలబడివున్నాడని తట్టక మానదు.

కుమారి మహాదేవి “నువ్వు తిండికి తిమ్మరాజువి పనికి పోతురాజువి. అంతా నేనే చేశాను. కిటికీలు తెరిచాను. గిరవాటు వేశాను. మెట్ల ప్రక్కనే నిలబడి అదితీసి నాకు అందిస్తే చాలునన్నాను. 40, 50 వేలు వచ్చేయి. ఇక ఏ దౌర్భాగ్యపు పని చేయకపోయినా సుఖంగా వుండవచ్చు ననుకున్నాను. చిలకకి చెప్పినట్టు అన్నీ సవివరంగా చెప్పాను చివరకు ఏం చేశావు?

“నాకు కనబడందే ఎలాగ చావడం?” అంది అ చెట్టు కాదు చెట్టు వెనకవున్న కుక్కుటేశ్వరరావు.

"ఆలస్యంగా వెళ్ళావు. అందుకే కనబడలేదు. ఆ డబ్బా కవిత్వం వినడానికి సుజాత రాలేదు. నేను బాగా గమనించాను. అది ఆ మెట్లమీదనే కూర్చుంది. నెక్లెసు నేను గిరవాటు వేయగానే అదే తీసి ఉంటుంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నాం. ఏమిటి ప్రయోజనం? దీపాలు ఆరిపోయిన మరుక్షణంలోనే నెక్లెసు లాగేశాను. లాగేసిన ఉత్తర క్షణంలో కిటికీ తెరిచి గిరవాటేసి లోపలకు చక్కాపోయి ఏమీ ఎరగనట్లు మరో మధ్యలో కూర్చున్నాను." అంది కుమారి మహాదేవి.

"నేను నిజంగా చూడలేదు. నా మాటనమ్ము. నేను మెయిన్ స్విచ్ ఆఫ్‌చేసి మెట్లదగ్గరకు వచ్చే సరికి దాని నెవరో ఎత్తుకుపోయి వుండాలి.

"ఛీ! నువ్వు వట్టి వా జమ్మవు. కండరాలుచూసి బీరాలు పలకడం తప్ప ఏమీ చెయ్యలేవు. నిన్న పురమాయించడానికి బదులు నేనే వచ్చి వుంటే సరిపోయి వుండేది. ఇష్! ఎవ్వరో యిటేవస్తున్నారు. ఉండు" అంది కుమారి మహాదేవి.

ఇద్దరు వ్యక్తులు ఆమెను చూడకుండా ఏవో కబుర్లు చెప్పుకుంటూ వెడుతున్నారు. ఇద్దరిలో ఒకరు మహాకవి మార్తాండశాస్త్రిగని చెప్పుకుంటున్న దొంగ, మరొకరు సుజాత.



మహాదేవి కప్పుడు జ్ఞాపకం వచ్చింది. సుజాతే ఆ నెక్లెసు తీసి వుండాలని ఆమె హాలులో లేదని, అప్పుడు ఆ యిద్దరూ ఆమెకేసి చూశారు.

ఓ మహాకవి! ఓ సుజాతాదేవీ! గుడ్ మార్నింగ్, రాత్రి చాలా ఘోరమైన చౌర్యం జరిగింది. ఏమంటారు?"

అనడానికి ఏముంది? అది ఘోరాతి ఘోరమైన దొంగతనం. యాభై వేల రూపాయల నెక్లెసు అది. ఎవరైనా ఎంత డబ్బువున్న వాళ్ళైనా తిరిగి కొనడం చాలా కష్టం అంది సుజాత.

సుజాత కంటే మార్తాండశాస్త్రి మామూలుగా వుండేకంటే చాలా చాలా హుషారుగా వున్నాడని మహాదేవి గ్రహించింది. నిజానికి జీవితమే ఉత్సాహభరితంగా తోచింది పి. పి. రావుకు సుజాతను తనతో తన కుటీరందాకా షికారుకు రమ్మన్నాడు. ఆమె సరేనని రావడం అతనికి అమందానందం కలిగించింది.

మిస్ మహాదేవి! రాత్రి నిజంగా ఆ నెక్లెసు చౌర్యమే జరిగి వుండకపోతే నేను మరోగంట వరకు నిరాఘాటంగా కవితాగానం చేసి వుండేవాణ్ణి. భావ కవుల గీతాలను విని పించేవాడిని. సమకాలీన ప్రాచీన కవుల రచనలలోని వేదాను వివరించి వుండేవాడిని. నన్నయ-తిక్కన-ఎఱ్ఱన పూర్వ కవులనుంచి నేటి దిగంబర కవుల విప్లవ రచనల వరకు సంభ

వించిన కవితలోని పరిణామాలను వివరించి వుండేవాడిని. నేను ఈ తోటలోని పూల మొక్కలను-ఫలవృక్షాలను చూసిన మీదట రాసిన ముత్యాల సరాలను వినిపించి ఉండే వాడిని. అన్నింటినీ మించి రాజాగారు నాకు చేస్తానన్న సత్కారం ఆగిపోయింది. అయినప్పటికీ నేను విచారించ లేదు. జీవితానికి వెలుగు నీడలు రెండూ వున్నాయి. వెలుగు వైపే మనం చూడాలి. నీలి నీడల్ని చూసి మనం క్రుంగి పోరాదు. నేను మహావక్తనంటారు నా స్నేహితులు నేను ప్రసంగిస్తున్నప్పుడు గాని మహాప్రళయంవంటిదేదో సంభవిస్తే తప్ప నా ధోరణి ఆగదు. అలాగే గతరాత్రి జరిగిన దొంగతనం కొంతవరకూ నా కవితా పఠనాన్ని నిలవరించ గలిగింది. దీపాలు ఆరిపోవడం విఘ్నం కలిగించింది. నా నోటికి తాళం పడింది.

"నాకు ఎంతో భయం కలిగించింది మీకు?" అంది కుమారి మహాదేవి సుజాతని చూసి.

"నేను అక్కడకు రాలేదుగా!" అంది.

ఆమె రాలేదు. నా వక్తృత్వం ఆమెను ఈ వరకే మరపించి మురిపించింది. ఈ కవితాగానం తనకి ఓవర్ డోస్ కావచ్చునని భయపడింది. కవితాగానం వినడానికి రానని ఆమె అన్నప్పుడు కొంచెం బాధ కలిగిన మాట నిజం కాని సుదీర్ఘమైన ఆలోచనకు తరువాత కాస్సేపు కాలక్షేపానికి



కబుర్లు చెప్పడం వల్లనే ఆమె హృదయం పరిణతి చెందగల దని గ్రహించాను. మిస్ మహాదేవి! మీ ఆలోచనకు అంతరాయం కలిగించినందుకు క్షమించండి. సుజాతాదేవి రండి పోదాం" అన్నాడు పి. పి. రావు.

ముందుకు కొంతదూరం వెళ్ళగానే వారు తన మాటలు వినజాలరని తోచిన తర్వాత "దేవుడు ఏది సృజించినా ఏదో ఒక ప్రయోజనాన్ని దృష్టిలో పెట్టుకునే సాగిస్తాడు.

అయితే మిస్ మహాదేవిని ఏ అభిప్రాయంతో సృష్టించాడో నాకు యింతవరకూ అంతు చిక్కలేదు. బహుశః పద్యాలు వ్రాసి నాకు అంకితమివ్వడానికి సృష్టించి వుంటాడు. అన్నాడు.

ఆ మాటలకు నవ్వింది సుజాత.

సుజాత పి. పి. రావులు వెళ్ళగానే ఏయ్! కుక్కు! అంది మహాదేవి.

"'ఆ!' ఇక్కడే వున్నాను." అన్నాడు కుక్కుటేశ్వర రావు.

"విన్నావా!"

"ఏమిటని?"

"సుజాత మాటలు. ఆవిడ కవితా పఠన సమయంలో తాను లేనంది. అయితే ఎక్కడ ఉండాలి? నేనిందాక

అన్నట్లే మెట్లమీద ఉంది. నేను హారాన్ని గిరాటు వేయగానే తీసింది. అది యిప్పుడు మహాకవి కుటీరంలో ఎక్కడో వుందని నేను ఖాయీగా చెప్పగలను."

"సరే! సరైన టైము వచ్చినప్పుడు మనం అక్కడకు వెడదాంలే! నువ్వేం భయపడకు." అన్నాడు కుక్కుటేశ్వర రావు.

మహాదేవి "స్నానం చేస్తాను," అంటూ ఆనంద భవనంలోకి వెళ్ళిపోయింది.

సుజాత పి. పి. రావుతో అతని కుటీరానికి వచ్చింది.

"ఈ కుటీరంలో ఏముందని ఇక్కడ మకాం పెట్టారు స్వామీ!"

"ప్రశాంతగా వుంది. ఆనందభవనంలో వున్నవాళ్ళ రొద ఏమీ యిక్కడకు వినిపించదు. చక్కగా ఆలోచించుకోవచ్చు. రమణీయ కవితామాధురి మనస్సులోంచి పొంగి రావచ్చు."

"ఓహో! ఇంకా మీకు మహాకవి మార్తాండశాస్త్రి వాసన వదల్లేదా? ఏం నాటకం? ఏం బూటకం? అంటూ ఆ గదిలో అడుగు పెట్టింది. కిటికీకివున్న తెర తొలగించి చూసింది. క్రోటను కుండీ అక్కడ వుంది."

అరె దుర్మార్గుడా! తాను నెక్లెస్ పెట్టిన క్రోటను కుండీ అదే! అంచు పగిలిపోయింది. అది మెట్ల ప్రక్కవున్న కుండీలో మూడవది.



"ఏముందీ కవిగారూ! కుండీ కిటికీలో పెట్టారేం!"

"అందంకోసం, నేను ప్రకృతి సౌందర్యారాధకుడనని తెలిసే అడుగుతావేం! నువ్వు కావాలంటే తీసుకుపో! అన్నాడు పి. పి. రావు.

"థాంక్స్" అంటూ ఫ్లాస్కులోంచి అతడు గ్లాసులోకి వంచుతున్న కాఫీనికూడా గమనించకుండా ఆ కుండీతో మల్లె పందిరి దగ్గరకు వచ్చింది. క్రింద పెట్టి ఆశగా నెక్లెసు కోసం వెదికింది. కాని ఆ నెక్లెసు అందులో లేదు.

# 17

ఆవేళ గిండీలోని చంద్రభవన్‌లో విందుకు వెళ్ళడానికి ఆనందభవన్‌లోవున్న వారందరూ ఆయత్తమౌతున్నారు. కొందరు కార్లలో బయలు దేరారు. కొందరు స్కూటర్లమీద బయలు దేరారు. శర్మను ఉద్యోగంలోంచి తొలగించి ఇవ్వవలసిన జీతం లెక్కపెట్టి నోటీసు ఇవ్వకుండా తొలగించినందుకు మూడు నెలల జీతం సహా వంట మనిషి సుబ్బయ్యకిచ్చి పంపేశారు.

పుష్పావతి వద్దని మొత్తుకున్నా రాజావీర వెంకట సత్యనారాయణరావుగారు వినలేదు. మరో సెక్రటరీ దొరికే వరకూ తన పనులన్నీ తనే చేసుకుంటానన్నాడు. తనమీద పూలకుండీలు గిరవాటేసినవాడు తన కక్కర్లేదని గట్టిగా నొక్కి వక్కాణించాడు.

ఇక చేసేది లేక అన్నగారి పట్టు భల్లూకపు పట్టని గ్రహించినదే కుష్మావతి మౌనంగా వుండిపోయింది.

శర్మ సగౌరవంగా ఆమె పాదాలు స్పృశించి "అమ్మా! సెలవిప్పించండి. నేను యింతకు ముందు పనిచేసిన దేవప్ప చెట్టియార్ ఇక్కడ యిస్తున్న జీతంకంటే అదనంగా రెండు వందల రూపాయలిస్తానని నెలరోజులనుంచీ కబురు మీద కబురు పంపుతున్నారు కనక వెళ్ళిపోతున్నానని చెప్పాడు.

"రాజాసాబ్ శెలవు" అన్నారు.

"అమ్మా! మీతో రెండు సంగతులు చెప్పాలి." అని ఆ మెగదిలోకి వెళ్ళి ఏదో గుసగుసలాడి— రాజాగారు పంపిన డబ్బు తన బట్టల పెట్టెలో సర్దుకుని వెళ్ళిపోయాడు.

సుజాత కుండీలో నెక్లెసు లేక పోవడంతో ఛీ. ఛీ. ఛీ. అని మూడుసార్లు పైకే అంది.

ఆ ఛీ ఛీ. లు త్రీ ఛీర్స్ అన్నట్లు ఎవరి నుద్దేశించి అంది. పి. పి. రావు ఉరఫ్ మార్తాండశాస్త్రిని గురించి అంది.

మార్తాండశాస్త్రి అసలు పేరు ఏమైతేనేం—మానవత పైశాచికత మూర్తీభవించినవాడు. అనుకుంది. పైకి నిన్ను ప్రేమించానని చెబుతూన్నప్పటికి 50 వేల రూపాయల నెక్లెస్ తన స్వలాభంకోసం అట్టిపెట్టుకున్నాడు." అనుకుంది.

అతడుకూడా గిండీలో కోట్లకు పడగలెత్తిన జయరామి చెట్టియార్ కుమార్తె పెళ్ళి సందర్భంగా చేస్తున్న విందుకు మహాకవి మార్తాండశాస్త్రి వెడతానన్న సంగతి జ్ఞాపకానికి వచ్చిందేమో వెంటనే ఇంతమోసం చేసిన వానికి తగిన శాస్తి చెయ్యాలనుకుంది.



వెంటనే కుమారరాజా, లక్ష్మీకాంతారావువున్న గది లోకి వెళ్ళింది.

ఓ మై డార్లింగ్! నేను నీ కోసం వెతుక్కుంటూ రావడానికి బదులు నువ్వే నా కోసం వచ్చావే! ఓ దేవతా! ఓ మైడియరెస్ట్ ఏంజెల్, ఏమిటి సంగతులు? అన్నాడు

మీ అత్త నెక్లెస్ దొంగలించి తన కిమ్మని రామకృష్ణ ప్రసాద్ నీకు చెప్పాడటగా! అని అడిగింది.

ఆ మాటకు విస్తుపోయిన కాంతారావు "ఏమిటీ! మా మామే నీకు చెప్పాడా" అని అడిగాడు.

"చెప్పాడు. నాకు కూడా ఆ బాధ్యత అప్పగించారు."

"మైగాడ్! అయితే నెక్లెసు ఇప్పుడు నీ దగ్గర వుందా!"

దొరికే చెయ్యి జారిపోయింది. మహాకవి మార్తాండ శాస్త్రి నెరుగుదువా." అంది సుజాత.

"ఆ! బాగా ఎరుగుదును."

"అతడు నిజానికి మహాకవి కాడు, మార్తాండశాస్త్రి కాడు."

"మరెవరు?"

"దొంగ ఇప్పుడు నెక్లెసు వాడి దగ్గరే వుంది."

"వాడి దగ్గరవుంటే మనదగ్గర వున్నట్టే!" అన్నాడు కాంతారావు.

"అదేమిటి అలా అంటున్నావే?"

నెక్లెస్ అపహరించమని మామ మామ నాతో చెప్పాడు.

కాని నాకు ఆ మాత్రం ధైర్యం లేక అతడిని నియమించి తీసుకువచ్చాను.

"అయితే అతడు నీ స్నేహితుడా."

"అవును."

"మహాకవి మార్తాండశాస్త్రిగా ఇక్కడ నటించడానికి నువ్వే తీసుకువచ్చావా!"

"నేను మార్తాండశాస్త్రిగా రమ్మనలేదు. అతడు ప్లేయర్స్ క్లబ్బులో మా నాన్నను కలుసుకున్నాడు. అక్కడ ఏం జరిగిందో కాని మార్తాండశాస్త్రినని చెప్పుకుంటూ వచ్చాడు."

"నేను కలుసుకున్నప్పుడతనికి ఆ పేరు లేదు. అతడు రత్నప్రభను, మల్లీశ్వరరావును బాగా ఎరుగుదునని చెప్పాడు" అన్నాడు కాంతారావు.

"హంబగ్! అసలు వాళ్ళ పేర్లు అతడు ఎన్నడూ విని వుండ లేదనే నేను చెప్పగలను." అంది సుజాత.

"ఇప్పుడేం చెయ్యమంటావు?"

మనం రాత్రి 7 గంటలకు అతని కుటీరాన్ని పూర్తిగా వెదకాలి. నెక్లెస్ సంపాదించాలి అక్కడ దీపంలేదు. ఒక లాంపుగాని, టార్చిలైటుగాని తేగలవా!"

"తెస్తాను."

వీలుంటే రెండు తీసుకురా నన్ను సరిగ్గా హోటలులో సాయంత్రం 6-30కి కలుసుకో, ఒక లైటు నాకియ్యి. ముందు నేనక్కడకు వెడతాను. ఆ తర్వాత నువ్వు నన్ను అక్కడే కలుసుకో!"

"రైటో,"



ఆ రాత్రి ఏడు గంటలకు పి. పి. రావు కుటీరం తలుపులకున్న తాళాన్ని సుజాత బ్రద్దలు కొట్టింది. సుజాత ఇప్పుడు తనకు లభించినట్లేనని సంతోషంతో పొంగి పోతున్న లక్ష్మీకాంతారావు కూడా అక్కడకు వచ్చాడు. కుటీరంలోకి ఇద్దరూ ప్రవేశించారు. దానికి ఒక అటక కూడా వుంది ఆ అటక మీద కెక్కడానికి మెట్లున్నాయి. ముందు గది తలుపులు తెరచి రెండో గదిలోకి వెళ్ళచ్చు. రెండో గదే వంటగదిగా ఉపయోగపడుతుంది.

"నువ్వు రెండోగది వెతుకు!" అంటూ సుజాత ముందుగది క్షుణ్ణంగా వెదక సాగింది. పరుపులు కోసేసింది. దిళ్ళు కోసి దూది అంతా నాలుగు దిక్కులా విరజిమ్మింది. టేబులు తారుమారు చేసింది దాని అరలు బయటకు లాగి పారేసింది! నెక్లెస్ ఎక్కడా కనిపించలేదు.

"రెండో గది అంతా వెదికాను ఏమీ దొరక లేదు." అన్నాడు కాంతారావు.

"అటక ఎక్కు" అంది సుజాత.

"ఆ పని మాత్రం నేను చెయ్యలేను క్షమించు" అన్నాడు కాంతారావు.

"ఏం! ఎందుకని!"

అక్కడ ఎలుకలు బొద్దింకలు వుంటాయి. నాకు బొద్దింకల్ని చూస్తే తగని చిరాకు. ఎలుకలంటే తగని భయం" అన్నాడు.

సుజాతే అటక ఎక్కింది. అక్కడినించి ముందుకు వంగి పొగగూడు దులిపింది. చచ్చిపోయిన ఎలుకలు రెండు క్రింద పడ్డాయి. బ్రతికివున్న ఎలుకలు ఓ నాలుగు క్రిందికి

మాకాయి. ఓ ఇరవై ముప్ఫయి బొద్దింకలు బిల బిల్లాడుతూ కింత పడ్డాయి. వాటిని చూసి "అమ్మో" అన్నాడు కాంతారావు. అలా అంటూ కుటీరం బయటకి వచ్చాడు. తల నిండా పడ్డదుమ్ము దులుపుకుంటూ సుజాత బయటకు వచ్చి కాంతీ అని పిలిచింది.

అక్కడ ఒక వ్యక్తి అటు తిరిగి నిలబడివుంటే కాంతీ, "నిన్నే" అని తట్టింది.

అతడు ఇటు తిరిగి చూశాడు. చేతిలో రివాల్వర్‌తో పి. పి. రావు కనిపించాడు.

"ఓ నువ్వా!" అంది సుజాత.

"నేనే! కాని కుటీరాన్ని నువ్వు సర్దుబాటు చేసిన పద్ధతి బహు ప్రశంసనీయంగా వుంది. ఇంటీరియర్ డెకొరేషన్‌లో నీకు డిప్లొమా ఇవ్వవచ్చు" అన్నాడు.

"కాంతీ ఏడీ?"

కాంతీ అని ముద్దుగా పిలుస్తున్నావు ఇప్పుడు కాంతారావుని భర్తగా ఎన్నుకొన్నావా,

"భర్తకాదు. వల్లకాడుకాదు. కాని నువ్వు ఇంత మోసగాడివని తెలియక నేను నీకు మనసిచ్చాను. నువ్వు చెప్పిన మాయమాటలన్నీ నమ్మాను"

"సరే! నమ్మావులే నమ్మావనడానికి తార్కాణంగా నువ్వు నా గదిని సర్దిన పద్ధతే చెబుతుంది"

ఇంతకీ కాంతి ఏడి!"

నా చేతిలో రివాల్వర్ చూసి పైన అటక ఎక్కాడు. కాంతారావుతో క్రిందికి దిగితే కాల్చి చంపుతానని చెప్పాను."



"నీ పేరేమిటి?"

"మార్తాండశాస్త్రి."

"మార్తాండశాస్త్రి అన్నది ఆ కవి పేరు. అతని స్థానంలోనే నువ్వు వచ్చి నాటక మాడావు. నీ అసలు పేరేమిటి చెప్పు!"

పి. పి. రావు అంటే పరోపకారి పరమేశ్వరరావు. మార్నింగ్ స్టార్ పత్రికలో నా ఎడ్వర్టయిజ్‌మెంటు చూసి కుమారరాజు నన్ను నెక్లెస్ అపహరించడానికి తీసుకు వచ్చాడు. ఆ నెక్లెసును కుండీలో దాచినది నువ్వేనా?" అన్నాడు పి. పి. రావు.

"నెక్లెస్ ఏది? ఆ రివాల్వర్ ఎక్కడిది?"

రివాల్వర్ కాప్రమేడ్ కుక్కుటేశ్వరరావుది. నువ్వు చూడలేదుగాని చూడవలసిన మనిషే.

నేనడిగింది నెక్లెస్ సంగతి. కుక్కుటేశ్వరరావును గురించి కాదు.

నెక్లెస్ కోసం ఎంత మంది తిరుగుతున్నారా! నువ్వు ఒకర్తివన్నమాట అన్నాడు పి. పి. రావు.

అవును, "నెక్లెసు అపహరించి తనకిమ్మన్నారు రామకృష్ణప్రసాద్ గారు.

"ఏం తిస్తానన్నారు ?"

"నాకేమీ అక్కరలేదు. రత్నప్రభకు సాయం చెయ్యడంకోసమే ఈ ఏడు పంతా.

"రత్నప్రభను నేను కూడా ఎరుగుదును."

హంబగ్ అసలు ఎరుగవు కాంతారావు చెబితేనే గ్రహించావు."

"ఓసి తెలివి తక్కువ ఆకతాయి మొద్దూ, ఆ వేళ నువ్వు హస్నా బాను రత్న ఇంటికి రావడం నేను చూడలేదా నేను కోళ్ళు, చేపలు వ్యాపారం చేసిన వాడిని. హస్నా బాను ఎంప్లాయిమెంటు ఏజెన్సీలో ఏదైనా ఉద్యోగం సంపాదించాలనుకుంటున్న సమయంలో నేనక్కడకు మహాకవి మార్తాండ శాస్త్రి రూపంలో రావడం జరిగింది."

ఆ జ్ఞాపకానికి వచ్చింది. పి. పి. రావు అనే ఆయన వచ్చాడని పనిమనిషి లక్ష్మి చెప్పడంతో పి. పి. రావు ఫామిలీ ఫ్రెండ్! నువ్వు కలుసుకోవలసిన మనిషే. అని చెప్పింది. సరే కాని నేను నీకు నిజంగా మనసిచ్చినప్పుడు నా దగ్గర దాపరికమెందుకు? నన్ను మోసం చెయ్యడం దేనికి?"

"నువ్వు అడగలేదు. నేను చెప్పలేదు. నువ్వు ఎలా నిష్కామంగా నెక్లెస్‌ను రామకృష్ణప్రసాద్‌జీకి ఇవ్వదలచావో నేనూ అలాగే ప్రతి ఫలాపేక్ష లేకుండా కాంతారావు ద్వారా రామకృష్ణప్రసాద్‌కి అందచేయాలనుకున్నాను. నాకు కాంతి 500 రూపాయలిస్తానన్నాడు. వద్దన్నాను. రత్నప్రభకు సాయం చెయ్యడమే నామతమన్నాను. కావాలంటే కాంతారావుని అడుగు."

"నెక్లెస్ ఇయ్యి" అంది.

ఇదుగో! అంటూ గోడనున్న చిలక బొమ్మ తీసి పొట్టకున్న మీట నొక్కాడు. నెక్లెస్ క్రిందపడింది. ఆ చిలక దాని నందుకుని "అహా! ఎంత బాగుందో! అంది.

ఇంతలోనే "ఏయ్! హాండ్సప్" అంటూ రివాల్వర్‌తో కుక్క ఈశ్వరరావు, ప్రక్కన మహాదేవి కనిపించారు.



అప్రయత్నంగా సుజాత చేతిలోని నెక్లెసు క్రింద పడింది.

మహాదేవి వంగి ఆ నెక్లెసు తీసుకుని "రా పోదాం" అంది.

# 18

మహాదేవి నెక్లెసు తీయడం చూసినప్పటికీ కుక్క ఈశ్వర రావు దానిని గమనించనట్టే తనచేతిలోని రివాల్వరు సుజాత పి. పి. రావుల వైపు గురిచూసి వుంచాడు.

పి. పి. రావు అమాంతంగా కుక్క ఈశ్వరరావు మీదకు దూకేవాడే దూరంకూడా అట్టే లేదు. కాని అతని చేతిలో రివాల్వర్ వుండటంవల్ల తటపటాయించాడు. అయితే సుజాత బిక్క ముఖం చూశాక నెక్లెసు తిరిగి ఎలా సంపాదించడమా అని ఆలోచనలో పడ్డాడు.

"అబ్బాయి! నువ్వు మహాదేవి భార్యా భర్తలా" అని అడిగాడు పి. పి. రావు.

ఇద్దరం ఏమౌతామో త్వరలోనే తెలుసుకుందువు గానిలే। అన్నాడు కుక్క ఈశ్వరరావు:

"ఇష్। వాడి ఉచ్చుల్లో నువ్వు పడకు. వాడు ఏదో నాటకం ఆడబోతున్నాడు" అంది మహాదేవి.

"పెళ్ళాం మొగుడితో మాట్లాడినట్టే మాట్లాడు తున్నావే" అన్నాడు పి. పి. రావు.

వీళ్ళిద్దరి కాళ్ళూ చేతులు బంధించడం మంచిది కదా అంది మహాదేవి.

"ఏం? ఎందుకు?"

"నెక్లెసు మనకు దొరికిందని అరవకుండా!"

వాళ్ళు అరవరులే! ఎందుకంటే ముందు వాళ్ళ దగ్గరే వుందిగా!"

ఇంతలో సిమెంటుతో ఏనాడో నిర్మించబడి శిథిలావస్థలోవున్న అటకనుంచి ధన్ ధన్ మని శబ్దం వినిపించింది. అటకమీాదనుంచి క్రిందికి దిగడానికి నిచ్చనలేదు. మెట్లున్నాయి. కాంతారావు ముందు ఒక కాలు మెట్టుమీాద పెట్టాడు.

ఆ ఒంటికాలు చూసిన కుక్కుటేశ్వరరావుకి భయం ఆవహించింది. అతని చేతివ్రేళ్లు రివాల్వర్ ట్రిగ్గర్ మీాద వున్నాయేమో అప్రయత్నంగా దానిని లాగాడు. అది అటకకు తగిలి మరింత సిమెంటు ఇటుకలు క్రిందపడ్డాయి. క్రిందకుదిగి పారిపోవడానికి ప్రయత్నిస్తే రివాల్వర్ ప్రేల్చి చంపేస్తానన్నా, అని బెదిరింపు జ్ఞాపకానికి వచ్చింది. అతడే రివాల్వర్ ప్రేల్చాడు కాబోలు ననుకుని కాంతారావు దభాలున క్రిందకు వురికాడు. కుక్కుటేశ్వరరావు అలా ఉరికిన దెవరా అని చూస్తున్న సమయంలో పి. పి. రావు లటాలున కుర్చీ ఎత్తి అతని తలమీాద మోదాడు.



రివాల్వర్ క్రిందపడిపోగా కళ్లు బైర్లు కమ్మిన కళ్ళతో కుక్కుటేశ్వరరావు నోట మాటరాక నిర్విణ్ణుడై చేష్టలు దక్కి అలా కూర్చుండిపోయాడు.

అతని చేతిలో రివాల్వరును పి. పి. రావు లాగాడు. ఇప్పుడు రెండు చేతుల్లోను రెండు రివాల్వర్లు పెట్టుకున్న పి. పి. రావు "మహాదేవి! ఆ నెక్లెస్ ఇస్తావా! రివాల్వర్ ప్రేల్చనా!" అని అడిగాడు.

"నేను చచ్చినా నెక్లెస్ నీకివ్వను. కాలుస్తావా! కాల్చు. ఆడదానిమీాద రివాల్వర్లు ప్రయోగిస్తావా!"

ఆడదానివేకాని స్త్రీ సహజమైన పనులు చేయలేదు. నువ్వు కవయిత్రివే అనుకున్నాను కాని ఆడ దొంగవనుకోలేదుగా; నీ భర్త లేదా నీ కాబోయే భర్తను యమలోకానికి పంపగలను. రెండు రివాల్వర్లు ప్రేలుస్తాను. అవి అతనికి ఎక్కడ తగిలి ప్రాణంపోయినా నాకు బాధ్యత లేదు."

పేక ముక్కలతో మోసం చెయ్యడానికేగాని నిజంగా రివాల్వర్ ప్రయోగించడంలో అనుభవంలేని కుక్కుటేశ్వరరావు నిజంగా పి. పి. రావు తన్ను రివాల్వర్లతో కాల్చి చంపివేయవచ్చునని భయపడ్డాడు. ఎలాగో లేని సత్తువ తెచ్చుకుని మహాదేవి ప్రక్క నిలబడి ఆమె చేతిలోని నెక్లెసును లాగి వేసి సుజాత మీాద పడ వేశాడు. సుజాత లటాలున దాని నందుకుని వెనుకకు రెండడుగులు వేసింది.

"రా, పోదాం!" అన్నాడు కుక్కుటేశ్వరరావు.

"మీరే బాగుపడండి" అంటూ మహాదేవి అతనిని అనుసరించింది. ఇద్దరూ ఆ చీకట్లో కలిసి పోయారు.

మహాదేవి కుక్కుటేశ్వరరావులు వెళ్ళిపోగానే రెండు నిముషాలు నిస్తబ్దత నెలకొన్నది.

"కవయిత్రి, దొంగతనాలకు పాల్పడటం విచిత్రమే!" అంది సుజాత.

"విచిత్రమే! ఈ నెక్లెసు చోరీకి మహాదేవి, కాంతి, నువ్వు, నేను, ఎందరం పాటుపడ్డామో చూడు. ఇప్పుడు నీ యిష్టం. రామకృష్ణప్రసాద్ గారిని కలుసుకుని కర్తవ్యం ఆలోచించుకో : నా బాధ్యతతీరి పోయింది కదా!" అన్నాడు పి పి. రావు.

"మరి నువ్వు పెళ్ళి చేసుకుంటావన్నావు?"

"ఆ! చేసుకోవాలనే అనుకుంటున్నాను. నా దరఖాస్తును ఆ దేవత అనుగ్రహిస్తే!"

"ఏ దేవత?"

"ఏ దేవతో నీకు తెలియదా!"

"తెలుసు! అయితే కాంతారావు అలా ఎంతసేపు ఆ గదిలోనే వుంటాడు?"



"ఇంతకీ నువ్వు నాటక మాడిన మహాకవి మార్తాండ శాస్త్రి ఏమైనట్టు?"

"రాజమండ్రిలో వున్నాడు."

"సరస్వతి అక్కడకు వెళ్ళిందా!"

"ఆ! వెళ్ళింది. ఇక్కడినించి శర్మ వెళ్లాడు." అన్నాడు పి. పి. రావు.

"దేవత కరుణించినట్టు—మనం ఎప్పుడు పెళ్ళి చేసుకుందాం?"

"నీ యిష్టం! ఈ శుభం సంగతి రేపు ఉదయందాకా మన మనస్సులోనే వుంచుకుందాం. ఇప్పుడు భోజనానికి ఆనందభవనానికి వెళ్ళినప్పుడుకూడా ఎవరికీ చెప్పవద్దు."

"నీ నిజాయితీ బోధపడ్డాకనే నాకు నువ్వంటే నిజమైన ప్రేమ కలిగింది. ఇంతవరకు నువ్వు ఆ నెక్లెస్ ఎవరికీ ఇవ్వక నువ్వే అట్టిపెట్టుకుంటావనుకున్నాను."

నిన్న ఆ రోజున రత్న యింటి దగ్గరచూసి నప్పటి నించి నిన్ను పెళ్ళాడాలనే తపన కలిగింది. అందుకే ఇంత సాహసం చేశాను. "మిష్టర్ కాంతారావు రాపోదాం!" అన్నాడు.

ముగ్గురూ ఆనంద భవనానికి చేరుకున్నారు.

# 19

"శర్మ వెళ్లిపోయాడు. ఇప్పుడు మరో సెక్రటరీని చూడాలి" అనుకున్నాడు రాజావీర వెంకటసత్యనారాయణరావు.

"నమస్కారం సార్" అన్నాడు పి. పి. రావు.

"ఓహో! నువ్వా! మహాకవి మార్తాండశాస్త్రినని చెప్పుకుంటున్నాడా పెద్దమనిషి. పెద్ద మనిషి కాడు దొంగ పుష్పావతిగారి నెక్లెసుకోసం వచ్చాడు" అని శర్మ చెప్పి వెళ్లాడు.

"నెక్లెస్ నా దగ్గర లేదు. నేను తియ్యలేదు. ఇక మార్తాండశాస్త్రిని నేను కాను. అది నిజమే కాని మీ మర్యాద కాపాడ్డానికి వచ్చాను. మీరు ఆ రోజున ప్లేయర్స్ క్లబ్ లో మార్తాండశాస్త్రితో కాఫీ సేవిస్తూ ఎంతసేపూ మీ లోటును గురించే మాట్లాడారని ఆ తర్వాత మీరు సిగరెట్ గాని చుట్టయినాగాని యివ్వకపోగా రోడ్డు కావలి వైపునవున్న పూల అంగడికి వెళ్ళి కూర్చున్నారని తిట్టిపోసి, స్టేషన్ కి చక్కగాపోతే మీరు కళ్ళజోడుతో తిరిగివచ్చి అతని కుర్చీలో కూర్చున్న నన్ను చూసి క్షమించమన్నారు. నేనే మార్తాండశాస్త్రి ననుకున్నారు. మీతో కూడా



రమ్మన్నారు. నేను వచ్చాను. నేను దొంగను కాను. నేను ఒరిజినల్ గా మొన్న మొన్నటివరకు కూడా డబ్బున్న వాడినే మీరు మాంబళంలోని "నందనవనం" పేరు విన్నారా ఆ భవనం తోటమాలే. మా నాన్నగారికి మీకు మల్లెనే తోటలంటే యిష్టం."

"ఆ! ఆగు అయితే నందనవనం తోట యజమాని కామేశ్వరరావు కొడుకువా! 1965 లో పుష్ప ప్రదర్శన జరిగినప్పుడు గులాబీ పూలుకు మొదటి బహుమతి నాకు, మల్లెలకు మీ నాన్నకు బహుమతులు వచ్చాయి."

"శర్మ స్థానే నన్ను నియమించండి. నేను యింతకు ముందు సెక్రటరీగా పనిచెయ్యలేదు కాని యిప్పుడు చేస్తాను. పెళ్ళి కూడ చేసుకుంటున్నాను. కనుక మీరేమీ భయపడనక్కరలేదు. నాతో పాటు నాకు కాబోయే భార్య సుజాత కూడా పుస్తకాల కేట్లాగు సిద్ధంచేస్తూ నాకు చేదోడు వాదోడుగా వుంటుంది.

"ఏమిటి? సుజాతను పెళ్ళి చేసుకోబోతున్నావా! సరే! సెక్రటరీగా పని చెయ్యి ఇవాళ నుంచే" అన్నాడు రాజావీర వెంకటసత్యనారాయణరావు జమీందారు.

"ఈ శుభవార్త ఆమెకు చెప్పివస్తాను. రేపే మీరు మా వివాహం జరిపించండి." అంటూ పి. పి. రావు మెట్ల దగ్గరవున్న సుజాతను కలుసుకొనడానికి వెడుతూంటే కాంతారావు పిలిచాడు.

"మా మామయ్య నాకు రెండువేలు యిచ్చాడు. నేను యిప్పుడు సుజాతను నిశ్చింతగా పెళ్లాడవచ్చు. డబ్బులేదనే ఆమె జంకింది" అన్నాడు.

"బాబాయి పొరబడు తున్నావు. రేపే మీ నాన్న గారి సమక్షంలో నాకు సుజాతకు పెళ్లి. నువ్వు తోడు పెళ్లి కొడుకువుగా వుండువుగాని" అన్నాడు పి. పి. రావు నవ్వుతూ.

కాంతా రావు సంభ్రమాశ్చర్య విభ్రమాలలో మునిగిపోయాడు.

పి. పి. రావు వెళ్లి సుజాతకు తనకు సెక్రటరీ ఉద్యోగం లభించిందని చెప్పాడు.

ఆ రోజే సుజాత తన పెళ్లి సంగతి రత్నప్రభకు వ్రాస్తూ "పది వేలు మీ నాన్న పంపిస్తున్నారు. అందుకో" అని వ్రాసింది.

పుష్పావతి తన కొత్త నెక్లెస్‌ను చూసుకుని మురిసి పోయింది.